

# మూసీ

# MUSI



◆ Samputi : 25 ◆ Sanchika : 04 ◆ Pages : 64 ◆ Rs. 20

◆ Febryary 2022

మూసీ 25 వసంతాలు

UGC Care List Approved Journals



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**
సంపుటి : 25 సంచిక : 4
ఫిబ్రవరి - 2022
'ప్లవ' మాఘ మాసం
**సంపాదకులు** (EDITOR)
**సాగి కమలాకర శర్మ**
**SAGI KAMALAKARA SHARMA**
**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
**డా. దత్తయ్య అట్టెం**
**Dr. DATTAIAH ATTEM**

Printed and Published by
B. Anantha Laxmi
*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్ - 500 013
ఫోన్ : 9347971177
email : editormusi@gmail.com

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796
UGC APPROVED JOURNAL



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక
చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

సుప్రసన్నమైన సారస్వత జీవనం ... డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి 7
ఋణానుబంధాలు (బందారం కథలు-3) ... డా. నందిని సిధారెడ్డి 11
విస్మృత కవి 'ధరూరి తిరువేంగళదాసు' ... పెబ్బేటి మల్లికార్జున్ 15
పెన్నా శివరామకృష్ణ జీవితం, సాహిత్యం ... ఐ. చిదానందం 17
డా. తిరుమల రామచంద్రగారి ఆత్మకథ - ఒక పరిశీలన ... డా. వీపూరి వేంకటేశ్వర్లు 20
ఎప్పుడొస్తావు నాన్నా (కథ) ... ఎం. ఆర్. అరుణకుమారి 23
బొమ్మ హేమాదేవి నవలలు - సామాజికాంశాలు ... డా. సయ్యద్ అఫ్రీన్ బేగం 27
పద్య మనోహరం - 27 ... డా. గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు 30
మేలిమి 'గింజల' కవిత్వం ... బూడిద ఆంజనేయులు 31
గ్రంథాంతరంగం 9 - జనుమంచి శేషాద్రిశర్మ గారి షష్టిపూర్త్యుత్సవ సంచిక ... ఘట్టమరాజు 33
కాశీయాత్రా చరిత్ర - తెలంగాణ సంస్కృతి ... యం. రేణుక 37
దర్శకులకు మార్గదర్శకులు టి.వి. నారాయణ ... డా. గుండెడప్పు కనకయ్య 39
వైవిధ్య భరితం - రాజశేఖర చరిత్రము ... డా. బుడిగె ఉమేశ్ 41
తెలుగు శాసన సాహిత్యంలో మొరిపిరాల శాసన ప్రాశస్త్యం ... డా. భూక్యా రాజారాం నాయక్ 45
కె.విశ్వనాథ్ చలన చిత్రాలు - సామాజిక అవలోకనం 20 ... టి. లక్ష్మీనారాయణ 49

### కవితలు

వసంత పంచమి ... డా. అయాచితం నటేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం... మంత్రి శ్రీనివాస్ -6; మదర్స్ డే లు ... వడ్డాప్పురం కృష్ణ - 10; మశ్శీ ... తండ హరీష్ గౌడ్ - 10; ఓదార్పు ... కొమురవెల్లి అంజయ్య - 13; నేను ... బి. అంజనీ దేవి - 13; సూర్యోదయము ... అల్వాల లక్ష్మణమూర్తి - 14; నిజ నిర్ధారణ ... రామ్ పెరుమాండ్ల - 32; భారత వీర! ... అవుసుల భానుప్రకాశ్ - 44; సైనికా! నీకు శాల్యూట్!! ... జి. శైలమ్మ - 44; చలి - చెలి ... డా. జిన్సీ - 52; ఎదురుచూపే ... ముత్యంపేట గంగాధర్ - 62; ఒమిక్రాన్ ... డా. గుడేలి శీనయ్య - 62;

### సమీక్షలు

ప్రపంచ పద్యం - గోపి కవిత్వం ... డా. వెల్దండి శ్రీధర్ 53
అట్టడుగు వర్గాల జీవన ప్రతిబింబం - బయటి గుడిసెలు ... డా. తండు కృష్ణ కౌండిన్య 55
కథాకాశంలో కొత్త సూర్యోదయం ... డా. ఎస్. రఘు 58
స్వీకృతి ... 61


**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,** 3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4  UGC Care List Approved Journals
హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

## సంపాదకీయం



వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి



స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**

# సంధానం

సంధి శబ్దానికి కలయిక అని అర్థం. వ్యాకరణంలోనూ, ప్రాంతాల పరంగానూ, రాజకీయ వ్యవహారాల లోనూ కలయికలు ఏ రూపంలో ఉన్నా సంధి అనే అర్థంతోనే వినియోగిస్తున్నాం. బాణాన్ని ధనుస్సు నారితో కలిపి ఎక్కుపెట్టడాన్ని సంధించడం అని వాడుతున్నాం. నదుల అనుసంధానం అనే పదం ఇటీవల అందరం వింటున్నదే. ఏ రూపంలో కలయికలైనా సంధానం అనే అర్థంలోనే వినియోగించబడుతున్నాయి.

సంధానం ద్వారా రెండు ఒకటిగా మారుతాయి. రెండు లేదా అనేక విషయాలు, వ్యవహారాలు, వస్తువులు, దేశాలు, నదులు మొదలైన వాని మధ్య ఒక ప్రత్యేక బంధం ఏర్పడుతుంది. భారతీయ సంధాన భావనే వివాహాదులు. రెండు కుటుంబాల కలయిక. తినే ఆహారంలో పదార్థాల కలయిక, వేసుకునే దుస్తుల్లో కలయికలు, శరీర అవయవాల కలయికలు అన్నీ సంధాన భావనలోనే ఉంటాయి. ఈ సంధానం దెబ్బ తిన్నప్పుడు అన్ని వ్యవహారాలు విచ్ఛిన్నమై విడిపోతాయి. సంధానం వల్ల శక్తి పెరుగుతుంది, సమగ్రమైన రూపం ఏర్పడుతుంది.

ఒక సెల్‌ఫోన్ లేదా అటువంటి ఏ ఇతర వస్తువైనా ఛార్జింగ్ పెట్టాలంటే ఒక వైరు, ఛార్జర్ సహకారంతో, ఎలక్ట్రిక్ పవర్‌తో సంధానం చేస్తుంటాం. శక్తి ఛార్జర్, వైరు ద్వారా ఫోన్‌లోకి వస్తుంది. ఈ ప్రక్రియ అనుసంధానం. దీని వల్ల ఒక శక్తిని మరో దగ్గర నింపుకోవచ్చు, దర్శించవచ్చు. సృష్టిలో ఇటువంటి అనుసంధానాలు అనేకంగా ఉంటాయి. నిత్యజీవితంలోనూ అనేక వ్యవహారాల్లో ఇటువంటి అనుసంధాన ప్రక్రియలను మనం గమనిస్తుంటాం.

మన శరీరం, మనస్సులు రెండూ కలవడం ఒక సంధాన ప్రక్రియ. ఈ రెండూ మూలశక్తి లేదా చైతన్యంతో నిరంతరం కలిసి ఉండే ప్రక్రియ సంధానం. దీనినే ఆధ్యాత్మిక పరిభాషలో యోగం అని కూడా అంటారు. అది కూడా కలయిక అనే అర్థంలోనే వినియోగింపబడుతుంది. ఈ విషయాన్ని మనం గమనిస్తే మానవుడు నిరంతరం దేనితోనో ఒకదానితో అనుసంధానించబడే ఉన్నాడు. మనం కలిసి ఉన్న దాని నాణ్యతను బట్టి మనకు శక్తి వస్తుందా, మన శక్తి తగ్గిపోతుందా, అనే విషయాలను తెలుసుకునే అవకాశం ఉటుంది.

మనకన్నా ఉన్నతమైన, ఉత్తమమైన విషయాలను మాత్ర మే నిరంతరం తలచుకుంటూ, వాటితోనే మనస్సును కలిపిస్తుంటే మనకు శక్తి సంక్రమించి, అన్ని విధాలుగా ఎదగడం జరుగుతుంది. మన శక్తి కన్నా తక్కువ శక్తి ఉన్న విషయాలు, వస్తువులు, వ్యక్తులు, ప్రవర్తనలు, విధానాలతో మన మనస్సును నిరంతరం కనిపితే మన శక్తి క్రమంగా తగ్గిపోయి అధోగతి పాలు కావడం జరుగుతుంది. అందుకే అన్ని విషయాలలోనూ అనుసంధానమే ముఖ్యమైన ప్రక్రియ.

సూర్య, వాయు, అగ్ని, జల, వృక్ష చైతన్యాదులు వేనితోనైనా మనస్సును సంధానం చేస్తుంటే, మనస్సు కొంత సమయంలోనే శక్తివంతమై ఈ సమాజానికి, ప్రకృతికి, పశు పక్ష్యాదులకు వినియోగపడుతుంది. మన శక్తికన్నా ఎక్కువ శక్తితో దేనితో కలిసినా మనలో శుద్ధత కలుగుతుంది. శక్తి పెరుగుతుంది. దీనికే ధ్యానము అని మరో పేరు. ఫోన్ ఛార్జింగ్ పెట్టుకున్న విధంగానే, మనస్సును ఎక్కువసేపు శక్తి దగ్గర కేంద్రీకరించడం వల్ల తమ శక్తిశాతం వ్యక్తి పెంచుకుంటాడు. ఈ కేంద్రీకరించడానికి ఎన్నో సమస్యలు ఎదురౌతాయి. వానిని అధిగమిస్తూ ఉండాలి. మనిషి ప్రకృతి చైతన్యంతో, మూల శక్తితో నిరంతరం సంధానమైతే శక్తిగా విస్తరించే అవకాశం ఉంది. శరీర, మానసిక శుద్ధికి ఇది సోపానం అవుతుంది. ఉన్నత కార్యనిర్వహణకు హేతువు అవుతుంది.

# వసంత పంచమి



చదువుల తల్లి జన్మదిన సంరభమన్న జగత్తు సర్వమున్
కొదవలు లేని జ్ఞానముల కూర్మిని పొందెడి పుణ్యకాలమే
చదువులు చిన్ననాట కొనసాగి సమస్త ఫలాల నిచ్చుచున్
తుది యనుమాటలేక తులతూగగ జేయు మనుష్యకోటులన్

ధాత సృజించు సృష్టియను తాత్త్వికరూపము వాణి తోడుగా
చేతననొంది విశ్వమను చిత్రముగా విలసిల్లుచుండెడిన్
పాతను కొత్తనున్ కలిపి భవ్యముగా విరచించు లోకమున్
కూతలతో మనోజ్ఞముగ గొప్పలు నిల్పును వాణి నిత్యమున్.




అక్షరమాలయే బ్రతుకు లక్షర రూపములే సమస్తముల్
శిక్షితమైనదే మనుజ జీవితమన్నది మూల సూత్రమై
రక్షగ నిల్చు వాఙ్మయము రాజిల జేయుచు భావికాలమున్
రక్షిణి సర్వదా పలుకు రాణియె శోధన శాస్త్ర విద్యలన్!

మాటయె భూషణంబు జనమాన్యత నొందగ జేయు మాటయే
మాటను దివ్య సాధనము మాదిరి మార్చుచు సాగగావలెన్
మాటను నిల్చు సత్యమిల మాటకు కట్టుబడంగ పూజ్యతన్
నీటుగ నొందు మానవుడు నిత్యము వాణిని గొల్వగాదగున్!





ప్రణవమునాదిగా బలుకు ప్రాబలుకెల్ల సరస్వతీ కృపన్
మణులను బోలి వెల్గులిడు మంగళమైన గళమందు మ్రోగుచున్
అణువులలోన శబ్దములు హాసము లొల్కుచు మ్రోగుచుండగా
గుణములనిచ్చు విద్యలకు కోటి నమస్సులు జేయగావలెన్



డా. అయాచితం నటేశ్వర శర్మ
విశ్రాంత అధ్యాపకులు, కామారెడ్డి, ఫోన్ : 94404 68557

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (6) UGC Care List Approved Journals
హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# ఆచార్య 'ఎండ్లూరి' అస్తమయం



ప్రముఖ కవి, దళిత సాహితీ రథసారథి, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు 28 జనవరి 2022 (శుక్రవారం) తెల్లవారు జామున హైదరాబాదులో తుది శ్వాస విడిచారు.

రాజమండ్రి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో, తెలుగు ఆచార్యునిగా సేవలందించి ఎందరో విద్యార్థులకు, పరిశోధకులకు మార్గదర్శనం చేశారు. 21 జనవరి 1959లో అమ్మమ్మ గారి ఊరు నిజామాబాద్ జిల్లా పాముల బస్తీలో జన్మించిన సుధాకర రావు తల్లిదండ్రులు ఎండ్లూరి దేవయ్య, శాంతాబాయి.

వీధిబడి చదువు నుంచి విశ్వవిద్యాలయ చదువు వరకు హైదరాబాద్‌లోనే పూర్తి చేసుకొని తెలుగు ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి విశ్వవిద్యాలయ ఆచార్యునిగా ఎదిగారు.

ప్రవృత్తిగా తెలుగు కవితా దిగ్గజంగా సాహితీలోకంలో విశేషమైన కృషి చేసి, తెలుగు దళిత కవిత్వంలో తనదైన ముద్రతో పయనించారు. వర్తమానం, కొత్తగబ్బిలం, నా అక్షరమే నా ఆయుధం, మల్లెమొగ్గల గొడుగు, నల్లద్రాక్ష పందిరి, వర్గీకరణీయం, గోసంగి, కథానాయకుడు జాషువా, తెలి వెన్నెల మొదలైన రచనలతో తెలుగు సాహితీ క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు.

వీరి కుటుంబం కూడా తెలుగు సాహిత్యంతో పెనవేయబడింది. వీరి శ్రీమతి దివంగత హేమలత, రచయిత్రి సామాజిక సేవకురాలు కాగా, కుమార్తె ఎండ్లూరి మానస చక్కటి కథా రచయిత్రి. తను రాసిన కథా సంపుటి 'మిళింద'కు 2020 సం.పు కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించింది.

శ్రీమతి హేమలత 2019లో మరణించిన నాటి నుండి సుధాకర్ గారు తీవ్రమైన మానసిక వేదనకు లోనయ్యారు. ఒకానొక సందర్భంలో "నాకూ కరోనా వచ్చి హేమ చెంతకు చేరిస్తే బాగుండును..." అంటూ తన నిర్వేదన భావాన్ని వ్యక్తపరిచారు. ఎంతో భవిత గల ఎండ్లూరి వారి అకాల మరణం తెలుగు సాహిత్యానికి తీరని లోటు. వారి విద్యార్థి లోకానికి అశనిపాతం.

మూసీ మాసపత్రికకు ఆప్తమిత్రుడుగా ఉన్న ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి పత్రిక తరపున శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

# తుకారాం అభంగం

చిత్తమందు కలకలము
సదా నుండు ఆందోళనము
కోరికల మనసు పని
ఫలము ఇదే కనుమా!

అతని దర్శనము కాకున్న
శవ సమానము ఈ జన్మ
సదా శోధించు నీలో
కొలువున్న పరమాత్మను

కువాక్కుల మురికిలో
నుండబోకుమోయి
అమృత వాణి పంచుతూ
అందరివాడి వవ్వవోయి


తుకా పలుకు మంచిమాట
మాధుర్యాన్ని పంచునోయి
పరుల మనసు దోచి మాట
ఉపకారం చేసునోయి




అనువాదం : డా॥ మంత్రి శ్రీనివాస్
ఆదిలాబాద్.
ఫోన్ : 83283 33720


# "సుప్రసన్న"మైన సారస్వత జీవనం

**డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాస మూర్తి** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 98 66 91 7227



**"ఎనబై మూడు వసంతాల సుప్రసన్నమైన అనుభవాల పంట ఆయన. ఈ వయసులోనూ అలసట ఎరుగని అధ్యయనం, అవిశ్రాంతంగా రచనా సేద్యం! సన్నిహిత బృందానికి తన బాల్యం నాటి సాహిత్య సంగతులు చెబుతూ మానసోల్లాసం కోసం కవితా సృజన చేస్తూ అడిగినవారికి కాదనకుండా ఆత్మీయమైన పీఠికలు రాస్తూ అక్షరాలోకంలో అనుక్షణం విహరిస్తూ ఉండే సాహిత్య తపస్వి సుప్రసన్న. గుర్తింపులు, పురస్కారాలు, సన్మానాలకు అతీతంగా ఆరున్నర దశాబ్దాలుగా సాహితీ రంగానికి నిబద్ధుడైన విలక్షణమూర్తి సుప్రసన్న. వైవిధ్యభరిత సాహిత్యానుభవాలు మూర్తీభవించిన ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య భవిష్యత్తరాలకు మహత్తర స్ఫూర్తి దాత".**

**వరంగల్లు నేపథ్యంలో :** సుప్రసన్న రమారమి ఏడాది నుండి భాగ్యనగరంలోని నారపల్లి ప్రాంతంలో ఉంటున్నారు. అయితే ఆయన సాహిత్య జీవితమంతా వరంగల్లుతో ముడిపడి ఉంది. వరంగల్లు సాంస్కృతిక వికాస క్రమం సుప్రసన్నకు సంపూర్ణంగా అవగతం. ఆయన సాహిత్య దృక్పథంపై నాటి పరిణామాల ప్రభావం గాఢంగా జరిగింది. 1920ల నుండే వరంగల్లు పట్టణం తెలంగాణలో భాషా సాంస్కృతిక ఉద్యమాలకు కేంద్రం. రాజరాజ నరేంద్ర భాషా నిలయం పేరుతో ఏర్పడిన గ్రంథాలయం, తెలుగు మాధ్యమం ద్వారా బోధన చేసిన యాబైకి పైగా ఖాస్గీ (ప్రైవేటు) బడులు తెలంగాణ పత్రికా రచనలో మైలురాయి వంటి 'తెనుగు' వారపత్రిక నాటి వరంగల్లు తెలుగు వికాసానికి ప్రతీకలు. ఈ పట్టణంలో 1936లో జన్మించారు సుప్రసన్న. తాతగారు రంగాచార్యులు గొప్ప పండితులు. విశిష్టాద్వైత తాత్త్వికతలో నిష్ణాతులు. మంచి పౌరాణికులు. విజయనగరం విద్వాంసుల వద్ద సకల శాస్త్రాలు చదువుకున్న మేధావి. ఇక మాతామహులు ఠంయాల లక్ష్మీనరసింహాచార్యులు. (ఈయన ప్రస్తావన గోలకొండ కవుల సంచికలో ఉంది). పితామహుడు, మాతామహుడు – ఈ ఇద్దరూ బాల్యం నుండే సుప్రసన్నను ప్రోత్సహించారు. ఉభయుల సాన్నిహిత్యం వల్ల ఆయనకు సాహిత్యంతో సన్నిహిత అనుబంధం ఏర్పడింది. చిత్రమైన సంగతేమిటంటే ఆయన తన పదవ సంవత్సరం వరకు పాఠశాలకు వెళ్ళనే లేదు. ఇద్దరు తాతగార్లు చెప్పిన పద్యాలు, శ్లోకాలు వందల సంఖ్యలో అప్పటికే కంఠస్థమయ్యాయి. అవి సుప్రసన్న భవిష్య సాహితీ సౌధానికి పునాదులు వేశాయి.




పాఠశాలలో పదేళ్ళ తరువాత చేరినా అక్కడి వాతావరణానికి త్వరగానే అలవాటు పడ్డారు. ఆయన చదువుకున్నది ఆంధ్ర విద్యాభివర్ధనీ పాఠశాలలో. అక్కడ వై.కె.శాస్త్రి వంటి గొప్ప ఉపాధ్యాయులు సుప్రసన్న సాహిత్యాభిరుచులకు నారు, నీరు పోశారు. పాములపర్తి సదాశివరావు వంటి అద్భుత మేధావులు ఆయనకు పాఠాలు చెప్పారు. నాటి ఆంధ్రవిద్యాభివర్ధనీ పాఠశాలలో అనిర్వచనీయమైన సాహిత్య వాతావరణం ఉన్నట్టు సుప్రసన్న జ్ఞాపకాలు చెబుతున్నాయి. విశ్వనాథ సత్యనారాయణ వంటి సుప్రసిద్ధులు ఈ పాఠశాలకు వచ్చి ప్రసంగించారట! అలనాటి విశ్వనాథ ప్రసంగాన్ని సుప్రసన్న ఈనాటికీ గుర్తు చేసుకుంటారు. ఇంటర్మీడియట్ వరంగల్లులో పూర్తిచేసుకొని 1955లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలోకి అడుగుపెట్టారు. అప్పటికే వివాహం జరిగింది. సతీమణి శారద ఆయన సాహిత్యకృషికి ఆలంబనగా నిలిచి 2011లో కన్నుమూశారు. సుప్రసన్న ఉస్మానియా జీవితంలో చేకూరి రామారావు, మాదిరాజు రంగారావు వంటివారు మంచి మిత్రులు. అక్కడ ఏడు సంవత్సరాల నిరంతర సాహిత్యాధ్యయనం సాగింది. ప్రబంధ సాహిత్యంపై పరిశోధన చేసి 1962లో పిహెచ్.డి పట్టాతో వరంగల్లు చేరుకున్నారు. యూనివర్సిటీ జీవితంలో ఆనాటి తెలుగు విభాగం



అధ్యక్షులు ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం విశిష్ట వ్యక్తిత్వం సుప్రసన్నను బాగా ప్రభావితం చేసింది. నాటి ఏడేళ్ళ కాలంలో ఎంతో ఎత్తుకు ఎదిగారాయన. అనేక కార్యక్రమాల్లో ప్రసంగించారు, కవిత్వాన్ని వినిపించారు. కాళోజీ, దివాకర్ల వంటి పెద్దల ప్రశంసలు పొందారు. ఉజ్జ్వలమైన సాహిత్య భవితవ్యం ఉందని ప్రముఖులు అభినందించారు, ఆశీర్వదించారు. తొలుత ఉస్మానియా విశ్వవిద్యాలయం వరంగల్లు స్నాతకోత్తర కేంద్రం తెలుగు విభాగంలో ఉపన్యాసకులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కేంద్రమే 1976లో కాకతీయ విశ్వవిద్యాలయంగా ఎదిగింది. ఇక్కడ సుప్రసన్న తెలుగు విభాగం ఆచార్యులయ్యారు. విభాగం అధ్యక్షులయ్యారు. డీన్‌గానూ ఉన్నారు. పాఠ్య ప్రణాళికల రూపకల్పనలో క్రియాశీలక భూమిక నిర్వహించారు. పలువురు పరిశోధక విద్యార్థులకు పర్యవేక్షకులుగా ఉన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఉత్తర, దక్షిణ భారతాల్లో జరిగిన అనేక సదస్సుల్లో వివేచనాత్మకమైన పత్ర సమర్పణలు చేశారు. 1977 నుండి పలు పర్యాయాలు ప్రతిష్ఠాత్మకమైన ప్రాచ్య మహాసభల్లో (ఓరియంటల్ కాన్ఫరెన్స్) పత్రాలు సమర్పించారు. ప్రతి ప్రసంగాన్ని విజ్ఞానమయ తరంగంగా తీర్చిదిద్దుతారు సుప్రసన్న. అందుకే సుప్రసన్న ప్రతి ప్రసంగం ఒక అమూల్యమైన వ్యాసం వంటిదే అంటారు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు వెల్దండ నిత్యానందరావు. 1982లో వరంగల్లులో అత్యంత ప్రతిష్ఠాత్మక రీతిలో పోతన పంచశత జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవ నిర్వహణలో సుప్రసన్న పాత్ర ఎంతో ఉంది. సాహితీ బంధం, బృందం వంటి సంస్థలతో ఆయనకు సాన్నిహిత్యం ఉంది. వరంగల్లులోని కవులు, రచయితలు, పరిశోధకులు, పండితులు అందరూ సుప్రసన్నకు ఆత్మీయులే. వయోభేదాన్ని పాటించకుండా అందరితోనూ ఆత్మీయంగా ఉండడం ఆయన విజ్ఞాతల్లో ఒకటి. తాను పుట్టి పెరిగిన వరంగల్లు నగరమంటే ఆయనకు ప్రాణం. నాటి కాకతీయులు నుండి ఈనాటి వరకు ఈ ప్రాంత వైవిధ్యాన్ని అమూల్యమైన ఆధారాలతో సుప్రసన్న వివరిస్తారు.

**మృదువైన కవిత్వం :** సుప్రసన్న పద్యాన్ని ఇష్టపడతారు. అయితే వచన కవిత్వాన్ని ఆయన ఏనాడూ తేలికగా చూడలేదు. ఒకటి రెండు గేయ కావ్యాలు రచించినా పద్యం – వచన కవితా రూపాల్లోనే ఆయన సృజన కొనసాగింది. తెలుగులో ఎక్కువమంది సృజించని ఉదాహరణ ప్రక్రియలోనూ సుప్రసన్న ఒక రచన చేశారు. పద్యమైనా, వచన కవిత్వమైనా మృదురీతితో కూడిన అభివ్యక్తి సుప్రసన్నకు ఇష్టం. తొలి దశలో సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు తన బాబాయి కోవెల సంపత్కుమారాచార్యతో కలిసి పద్యరచన చేశారు. అవి 'హృద్గీత' అనే పేరుతో ప్రచురణ పొందాయి. విశ్వనాథ సత్యనారాయణ ఆశీస్సులు లభించాయి. అప్పటికాయన ఇంటర్మీడియట్ విద్యార్థి. నాటి ప్రసిద్ధ మాసపత్రిక "తెలుగు స్వతంత్ర". ఇందులో 1954లో సుప్రసన్న తొలి కవిత వెలుగు చూసింది.

1955లో ప్రతిష్ఠాత్మకమైన గేయకవిత పోటీలో బహుమతి లభించింది. 1960వ దశాబ్ది నుండి సుప్రసన్న పద్య – వచన కవితా స్రవంతులు జీవనదుల వలె అనేక పాయలుగా సాగుతూనే ఉన్నాయి. ప్రతి కావ్యంలోనూ వైవిధ్యతను సాధించడం విమర్శకులు అంగీకరించిన సత్యం. కావ్యాల్లో తాత్త్విక రచనలున్నాయి, అనుభూతి గాఢతను పొదవుకున్న కావ్యాలున్నాయి. స్మృతి కవితలున్నాయి, శతకాలున్నాయి. ఆనంద లహరి, అధునా, ఋతంభర, పాండిచ్చేరి గీతాలు పన్నెండు, శ్రీ పాంచాలరాయ శతకం, శతాంకుర, స్తుతిప్రబంధం, కన్నీటి కొలను, కృష్ణరశ్మి, శ్రీనిరుక్తి, శ్రీనృసింహ ప్రాప్తి, సాంపరాయం, ప్రీతిపుష్కరిణి, శేషాలిక, మణికర్ణిక, పరిక్రమ, శివాభిసారిక ఇట్లా ఎన్నో కావ్యాలు. 1987లో రచించిన 'శతాంకుర' అనంతరం తన కవితా రచనలో స్పష్టమైన పరివర్తన ఏర్పడినట్టు సుప్రసన్న చెబుతారు. ఈ కావ్యాన్ని ప్రసిద్ధ భాషావేత్త, విమర్శకులు ఆచార్య చేకూరి రామారావు విశ్లేషించారు. 'శతాంకురాల మృదుస్పర్శ' పేరుతో రచించిన ఈ వ్యాసంలో సుప్రసన్న కవితా ప్రతిభకు కితాబులిచ్చారు చేరా.


**లలితమైన విమర్శ :** సుప్రసన్న విమర్శనా పద్ధతి 'ప్రసన్నమైన మార్గంలో కొనసాగింది. ఆయన అనేక విమర్శనాత్మక గ్రంథాలు రచించారు. వీటిలో కొన్ని ప్రత్యేక గుణాల్ని గుర్తించవచ్చు. సుప్రసన్న విమర్శనా వ్యాసాల్లో విశ్వనాథ సాహిత్యతత్త్వం ఉజ్జ్వలంగా ఆవిష్కృతమైంది. ఆయన వ్యాసాల్లో జాతీయవాద సాంస్కృతిక దృక్పథం ప్రస్ఫుటం. తనకు నచ్చని అంశాన్ని ఎవరికీ వేదన కలిగించని రీతిలో స్పష్టం చేయడం సుప్రసన్న విమర్శ వ్యాసాల మరొక లక్షణం. లలితమైన శైలిలో స్పష్టత ప్రాణంగా విమర్శ సాగుతుంది. ఆలంకారికత వ్యాసంలో అంతర్గతంగా ఒదిగిపోతుంది. దీనితో వ్యాసానికి ఒక చక్కని శబ్దపరిమళం వచ్చి చేరుతుంది. అందుకు దాశరథి కవిత్వంపై రచించిన వ్యాసంలోని ఈ వాక్యాలు మంచి ఉదాహరణ.


ప్రగతివాద గ్రీష్మాంతాన తెలుగు కవిత్వపు పొలిమేరలను దాటి దాశరథి మేఘం అరబిక్ పారశీక ఉర్దూ కవితానుభవాల వర్షాన్ని కుండపోతగా కురిసింది. గాలిబ్ తెలుగువాడైనాడు. సూఫీ కవిత్వ స్పర్శ అల్పాక్షరముల అనల్పార్థ రచనకు తెలుగు కవితలో దారి తీసింది. సంస్కృత కవితలోని వైదర్భీరీతిని తన కవితలో జొప్పించి ఆయన కాల్పనికత కవిత్వపు అమృతసృష్టిని పునరాగమింపజేశారు. కాళిదాసన్నా, కీట్సన్నా, గాలిబ్ అన్నా, నజ్రుల్ ఇస్లామన్నా సమానంగా ప్రేమించాడు. రవీంద్రుని కావ్య మార్మికతను, విశ్వనాథ భావనా పారమ్యాన్ని, కృష్ణశాస్త్రి కవితా రీతి మాధుర్యాన్ని, శ్రీశ్రీ కవితలోని జలపాత ధోరణినీ – ఇవన్నీ తనలో సంలీనం చేసుకున్నా తనదైన గొంతులో తనదైన నూతన ప్రతీక సామగ్రితో అమేయుడై తెలుగు రసిక లోకానికి అమృతాభిషేకం చేసినాడు.












సుప్రసన్న కవి కావడంతో విమర్శలోనూ సున్నితత్వం స్పష్టంగా కనబడుతుంది. తన విమర్శా సంకలనాలకు పేర్లు పెట్టడంలో ఆయన భావుక దృష్టి అర్థమవుతుంది. ఒక వ్యాస సంకలనం **"సహృదయ చక్రం"** మరొకటి **"చందనశాఖి"** ఇంకొకటి **"భావుక సీమ"** అట్లాగే **"కావ్యప్రమితి"**, **"భావసంధ్య"** వంటి వైవిధ్యంతో కూడిన పేర్లతో రచనలు వచ్చాయి. ఇటీవలి కాలంలో వచ్చిన వ్యాస సంకలనం పేరు **"రస రాజధాని".**

1954లో విద్యార్థిదశలో గోలకొండ పత్రికలో ప్రచురణ పొందిన చిన్న వ్యాసం మొదలుకొని ఇటీవలి వరకు సుప్రసన్న వందలాది విమర్శలు వెలువరించారు. ఇందులో సుదీర్ఘ వ్యాసాలున్నాయి, సందర్భానికి అవసరమైనవి ఉన్నాయి. పత్రికల్లో పుస్తక సమీక్షలు కొన్ని వందలవరకు ఉంటాయి. 1971లో వెలువడిన 'సాహిత్య వివేచన' విమర్శలోకంలో సుప్రసన్నకు గొప్ప గుర్తింపు తీసుకొని వచ్చింది. ఈ రచనను చదివి ప్రసిద్ధ సాహితీవేత్త అబ్బూరి రామకృష్ణారావు ఆయనను అభినందించారు. సాహిత్య వివేచనకు ఆనాటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది.

1983లో వెలువడిన **"సహృదయచక్రం"** సుప్రసన్న లోతైన పాండిత్యానికి ప్రతిరూపం. ఇది ఆయనను విద్వత్ విమర్శక ప్రపంచంలో స్థిరంగా నిలబెట్టింది. 1993లో వచ్చిన **"భావుక సీమ"** వ్యాసం భారతీయ సాంస్కృతిక మూల్యాలను - సాహిత్య చరిత్రను తులనాత్మకంగా విశ్లేషించాయి. అత్యంత జటిలమైన **"ప్రాగ్రూప విమర్శ"**లోనూ సుప్రసన్న కృషి ఉంది. **"భావ సంధ్య"**లోని కొన్ని వ్యాసాలు అపూర్వవమైన అనుభవ సంపుటులు.

సుప్రసన్న ఎంతోమంది రచనలకు ఉత్తమస్థాయి పీఠికలు అందించారు. వీరిలో ప్రసిద్ధులున్నారు, ప్రవర్ధమానులూ ఉన్నారు. పీఠికల్లోనూ పలు ప్రక్రియలకు సంబంధించినవి ఉన్నాయి. పలు విలువైన పీఠికలతో **"అంతరంగం"** అనే సంకలనం వచ్చింది. ఈ రచనకు ప్రతిష్ఠాత్మకమైన **"శాంగ్‌సుంగ్"** పురస్కారం లభించింది. ఈ సందర్భంలో సుప్రసన్న దక్షిణకొరియాలో పర్యటించారు.

**చేతనావర్త కవిత్వం :** భారతీయ తాత్త్వికత, సాంస్కృతిక మూల్యాలు, దేశీయ సారస్వత వారసత్వం వంటి అంశాల్లో సుప్రసన్న వైఖరి అత్యంత నిబద్ధతతో కూడుకున్నది. ఆయన తన మౌలిక అవగాహనను వెల్లడించేందుకు ఏనాడూ వెనకాడలేదు. ఈ దృష్టి కోణానికి ప్రతిరూపం వంటిది. 'చేతనావర్త కవిత్వం' 1960వ దశాబ్ది మధ్యకాలంలో వరంగల్లులో 'చేతనావర్త కవిత్వం' ప్రారంభమైంది. చేతనావర్త కవి బృందంలో కోవెల సుప్రసన్నాచార్య, పేర్వారం జగన్నాథం, కోవెల సంపత్కుమారాచార్య, వేనముద్దల నరసింహారెడ్డి (వే.న.రెడ్డి) జాతీయవాద మూల్యాలతో మూడు కవితా సంకలనాలు వెలువరించారు. వీటికి సుప్రసన్న రచించిన పీఠికలు విలువైనవి. దిగంబర కవిత్వం తరువాత వచ్చిన చేతనావర్త కవిత్వానికి ఆధునిక తెలుగు సాహిత్యచరిత్రలో సముచిత స్థానమే ఉంది.

**సుప్రసన్న తాత్త్విక మూలాలు :** సుప్రసన్న బహిర్గత స్థాయిలో సాహితీవేత్త అయినా ఆయన అంతరంగమంతా తాత్త్విక భావజాల నిలయం. సుప్రసిద్ధ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, తత్త్వవేత్త శ్రీ అరవిందుల సాహిత్యాన్ని సుప్రసన్న సంపూర్ణంగా అధ్యయనం చేశారు. శ్రీ అరవిందులు రచించిన 'సావిత్రి' ఆయనకు బాగా ఇష్టమైన కావ్యాల్లో ఒకటి. జిడ్డు కృష్ణమూర్తి, శ్రీ రమణమహర్షి తాత్త్వికధార అంటే సుప్రసన్నకు బాగా ఇష్టం.

1987 తరువాత సద్గురు కందుకూరి శివానందమూర్తికి సుప్రసన్న బాగా సన్నిహితులయ్యారు. శివానందమూర్తి తాత్త్వికతకు బాగా అర్థం చేసుకున్నారు. అందుకు వ్యాఖ్యానాలుగా నిలచే రచనలు చేశారు. తన జీవితంలో కొత్త వెలుగుల్ని ప్రసరించిన అద్భుత ఆధ్యాత్మిక చైతన్యం శివానందమూర్తి అంటారు సుప్రసన్న.

విశ్వనాథ చెప్పిన "జీవుని వేదన"ను త్రికరణశుద్ధితో విశ్వసించే సుప్రసన్న జీవితంలో ఎదురైన బాధల్ని తాత్త్విక దృష్టితో ఎదుర్కొన్నారు. 2008లో పెద్ద కుమారుడు శ్రీనివాస్ హఠాత్తుగా కన్నుమూశారు. మరొక మూడు సంవత్సరాలకు సతీమణి శారద స్వర్గస్థులయ్యారు. ఈమధ్యకాలంలో తాను ఎంతో అభిమానించే బాబాయి కోవెల సంపత్కుమారాచార్య చనిపోయారు. ఈ ఆత్మీయ వినియోగాలు సుప్రసన్న కలం నుండి స్మృతి కవిత్వ రూపంలో ఉనికి వచ్చాయి. ఇవి సహృదయులందరికీ కంట తడి పెట్టిస్తాయి.

సుప్రసన్నను ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము - తెలంగాణ సర్కారు కూడా సముచిత రీతిలో సత్కరించాయి. ప్రతిష్ఠాత్మకమైన సనాతనధర్మ ఛారిటబుల్ ట్రస్ట్ పురస్కారం, పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలలో సాహితీవేత్తగా పురస్కారం - ఇంకా పలు అవార్డులకు సుప్రసన్న ఎంపికయ్యారు. అనుక్షణం సాహిత్యాన్ని ఆస్వాదించే అద్భుత మూర్తిమత్వం కోవెల సుప్రసన్న.

## మదర్స్ డే లు

నిన్నటి రోజు అంతా అబద్ధం
ఆమె కన్నీళ్లే యథార్థం
నిన్నటివన్నీ యాంత్రిక నవ్వులే
మళ్లీ ఎప్పుడో గానీ అవి కనిపించవు
అవాస్తవాలు అంతే అరుదుగా నిజమవుతాయి

ఆమె పుట్టుక ఎవ్వరికీ తెలియదు
అదొక కారు చీకటి అమావాస్య గావొచ్చు!
ఇగో ఇలా మదర్స్ డే రోజు
ఏదో RIP డే నాడు మాత్రమే ఆమె మళ్ళా గుర్తుకొస్తే
ఎంత దారుణం!?

ఇన్నేసి ప్రేమలున్నా దేశమంతటా వృద్ధాశ్రమాలే
అవి ఎన్నడూ ఖాళీ అవ్వవు
అవ్వలంటే అంత ప్రేమ మరి
జీవితం అంతా జీతం కొరకే పాకులాట
ఇలా ఒక్క రోజు ప్రేమకై వెతుకులాట
తేదీలు గుర్తు పెట్టుకునేందుకూ పెనుగులాట
ఐనా ఎవడో గుర్తుచేస్తే తప్పా సోయికి రాలేము
ఆమె కన్నీళ్లే యథార్థం
మన నవ్వులన్నీ నాటకాలే......!!

మళ్ళొచ్చే ఎండాకాలమే ఆ నవ్వు కనిపించొచ్చు
కానీ ఆమె అనుభవించే ఎండమావులే ఎవడికీ కనిపించవు!
ఐనా వెతికే ఆలోచన చేయకండి
ఆమె అంతరంగం అంతే
జనులెరుగని అఘాతం

మీకు కావాల్సినపుడు
మళ్ళీ ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు తనను కదిలించండి
మళ్ళీ ఓ చిరునవ్వు
అది కూడా అబద్ధమే.....!!

**వడ్క్యాపురం కృష్ణ**
ఫోన్ : 96666 02670

## మళ్ళీ....

ఓ మంచిరోజు
ఇంటి ముందు చిగురేసిన మొక్కలా
తలుపుతడుతుంది

ఆశల జలపాతమొకటి
లోపలికి దూకుతూ
మెత్తగా స్పర్శించే పులకరింతయి
మీదినుండో నీటిబిందువులా
జారుతూ వెళుతుంది

గాజులు భళ్ళుమంటున్న శబ్దాలను
ఊపిరిసల్పనివ్వని దుఃఖపుక్షణాలను
క్యాలెండర్లో నుండి తీసి
దూరంగా విసిరేసే రోజులు
ఇంకెంతో దూరంలో లేవు

హాస్యతుంపరల సాయంత్రమొకటి
ఒక టేబుల్ చుట్టూ మూగి
నాలుగు వన్ బై టూ టీల్లో నుంచి
పొగలుకక్కుతూ
నాలుగు నవ్వులుగా విచ్చుకుంటుంది

ఈ విషాదరాత్రులు
దోసిళ్ళలోంచి తెల్లని పావురాలై ఎగిరి
ఆనంద ఆకాశాన్ని
తప్పక ముద్దాడుతాయి

రోజులు మళ్ళీ
కొత్తదుస్తులు తొడుక్కొని
వెలుగునివ్వటంలో
సూర్యునితో కుస్తీ పడతాయి
**(కరోనా నుండి బయటపడుతామన్న ఆశావాహ దృక్పథం..)**

**తండా హరీష్ గౌడ్**
ఫోన్ : 89784 39551

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

బందారం కథలు -3

# ఋణానుబంధాలు

డా. నందిని సిధారెడ్డి, ఫోన్ : 9440 381148



మేలిక రాగానే పక్క మీదే లేచి కూచున్నాడు రాజయ్య. కుడివైపు తిరిగి పండరంగని ఫోటో నమస్కరించాడు. ఆ పక్కనే ఉన్న యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి, భద్రాచల సీతారాముల ఫోటోలకూ, అర్జునునికి విశ్వరూపం చూపిస్తున్న శ్రీకృష్ణుని చిత్రపటాలకు మొక్కి చెంపలు వేసుకొని భక్తితో మునివేళ్లు కళ్లకద్దుకున్నాడు. చీకట్లు కమ్ముకొని ఉన్నా కొంచెం దూరంలో ఉన్న బుగ్గ దీపం వెలుగులు చిమ్ముతున్నది. ఎదురుగా చూస్తే గోడ గడియారంలో నాలుగు దాటింది. రాజయ్య పక్క దిగేసరికి అలికిడైంది. భూమయ్య నిద్ర లేచి వచ్చి పెద్దర్వాజ తీశాడు. దర్వాజ తెరిచిన చప్పుడుకు అరుగుల మీద పడుకున్న నలుగురు జీతగాండ్లు ఉలికిపడి లేచి కూచున్నారు. సరాయించుకుంటూ బయలకు వచ్చాడు రాజయ్య. వెనుకాల భూమయ్య అనుసరించాడు. వాళ్లిద్దరినీ జీతగాండ్లు అనుసరించారు.

చుట్టూ పదివూర్లకు పేరెల్లిన సావుకారి సోమరాజయ్య. బందారంలో అందరూ 'పెద్ద సావుకారి' అనే వ్యవహరిస్తారు. ఇరవై ఐయిదేండ్ల కింద వాళ్ల నాయన బతకటానికి బందారం వచ్చాడని అంటారు. రాజయ్య పెరుగుతూనే సంపదలు పెరుగుతూ వచ్చాయి. పదేండ్లలో ఊరి పెద్ద సావుకారి కావటం చిన్న విషయం కాదు. వ్యవహారాలు చూడడానికి నమ్మకస్తుడు కావాలని, చిన్నభార్య తమ్మున్ని షేర్దారుగా తెచ్చుకున్నాడు. ఆయనే భూమయ్య సేటు.

రాజయ్య సరాసరి షెడ్డులో కట్టేసిన గోమాత దగ్గరికి వెళ్లాడు. గోవును లక్ష్మి అనే పిలుస్తారు. రాజయ్య అడుగుల చప్పుడు విని లేచి నిలబడే గోవు మాలక్ష్మి ఆ పూట లేవలేదు. వారం పది రోజుల నుండి తెలియని జబ్బుతో ఆయాసపడుతున్నది ఆవు. అప్పటికి పశు వుల జబ్బుల్లో అనుభవమున్న వూరి వాళ్లందరికీ చూయించాడు. పసర్లు పోశారు. కొనుపులతో వాతలు పెట్టారు. అయినా జబ్బు నయం కాలేదు. నాలుగు రోజుల నుండి మేత మానేసింది. వయసు మీద బడింది – ముసలితనం తప్పదన్నారంతా.

ఎంతకూ ఆవు లేవకపోవడంతో రాజయ్య 'లక్ష్మీ' అని పిలిచాడు. భూమయ్య దాని జబ్బ మీద చరిచి కదిపి చూశాడు. కదల్లేదు. పెద్ద జీతగాడు కళ్ల దగ్గర, ముక్కు దగ్గర వేళ్లు పెట్టి చూశాడు. కళ్లు తెరిపించినా తెరుచుకోలేదు. వేళ్లకు శ్వాస తగల్లేదు. సావుకారుకి ఎట్లా చెప్పాలో ధైర్యం చాలలేదు.

రాజయ్య కళ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. భూమయ్య చొరవ చేసి అన్నాడు. 'లక్ష్మి, తనువు చాలించింది'. రాజయ్యకు తెలుసు. 'లక్ష్మి' అని దూడకు పేరు పెట్టుకున్న గడియ ఎట్లాంటిదో.... అప్పట్నుంచి అది ఎట్లా పెరుగుతూ వచ్చిందో ఆస్తీ, ఐశ్వర్యం అట్లా పెరుగుతూ వొచ్చింది. రాజయ్యకు లక్ష్మి అంటే ప్రాణ సమానం. తన ఇద్దరు భార్యలు ప్రతి ఉదయం లక్ష్మికి పూజలు చేస్తారు. తమకిష్టమైన పదార్థాలు తినిపిస్తారు. అందువల్ల జీతగాండ్లకూ లక్ష్మి అంటే ఇష్టమే. ఏది ఎప్పుడు ఏ వేళకు పెట్టాలో అన్నీ సమకూరుస్తారు. రాజయ్య సవారీ కచ్చురానికి కట్టే ఎడ్లు రాముడు, భీముడు రెండూ లక్ష్మి సంతానమే. తన పేరు ప్రతిష్ఠలు పది ఊర్లకు పాకడానికి తన తల్లిదండ్రులదెంత చలవో లక్ష్మి చలవ కూడా అంత అని రాజయ్య నమ్ముతాడు. తన ఒంట్లోని బలం, తెలివి ఆవుదే అని భావిస్తాడు. బయటకు బిగ్గరగా ఏడ్వలేదు గానీ – రాజయ్య లోపలి నుండి దు:ఖం తన్నుకొని వస్తున్నది. అప్పుడే బయటకు వచ్చిన సావుకారి పెద్ద భార్య పరిస్థితి గమనించి కండ్ల నీళ్లు పెట్టుకున్నది. దారెంట వెళు తున్న ఆగి చూస్తూ వెళుతున్నారు.

ఆవు అంటే మామూలు ఆవు కాదు. పెద్ద సావుకారి ఆవు. పేరు గల్ల ఆవు. సావుకారి ఆవు చనిపోయిందనే వార్త తెల్లవారుతూనే వూరువూరంతా తెలిసిపోయింది. గోవు మాలక్ష్మి అంత్యక్రియలు మనుషుల మాదిరిగా నిర్వహించాలని, తన 'పెద్ద సావుకారి' స్థాయికి ఏమాత్రం తగ్గకుండా వైభవంగా జరిపించాలని నిర్ణయించాడు రాజయ్య. పని వాళ్ళంతా ఆ పనుల్లో మునిగిపోయారు.

పొద్దెకుతుండగా సావు పనుల సమాచారం ఊరంతా వ్యాపించింది. ఒక ఆవుకు సావు కర్మలు చేయటం మీద వూరంతటా

చర్చ జరిగింది. విడ్డూరమన్నారు కొందరు. సావుకారు ప్రేమ అన్నారు కొందరు. భక్తి అన్నారు మరికొందరు. కలికాలమన్నారు కొందరు. పైసమదం అన్నారు పడనివాళ్లు. పొద్దు బారెడెక్కినప్పుడు సావు పనులకు రావాల్సిందిగా మాదిగ పెద్దలకు పిలుపొచ్చింది. చింత చెట్టు కాడ గుమిగూడిన వాళ్లల్లో రెండు అభిప్రాయాలు వినిపించాయి. **"ఎంత సావుకారయినా ఆవుకు సావు జేసుడేంటిది? సావుకారి ఆవయితే పసురం కాకుంటపోతదా? అది మనది కాకుంట పోతదా? ఆ సావు పనులకు మనం పోవద్దు. బతికున్న మనుసుల సావు జూపిత్తడు. చచ్చిపోయిన ఆవుకు సావు జేపిత్తడా? ఆయెనె జెప్తె మనమెందుకినాలె?"** అని కొందరు గట్టిగానే వాదించారు. **"సావుకారితోని పెట్టుకుంటె ఎల్లదా? అయిందానికి కానిదానికి సావుకారి దగ్గరుకు పోకుంటె నడుస్తదా? అది ఆయన పానం. పిలిచినప్పుడు పోవాలె. అన్నీ అడిగినట్టు జెయ్యాలె"** అని పెద్దలు మాట్లాడారు. చాలాసేపటి మాటల తర్వాత అనుభవమున్న పెద్దల మాట విని ఆ పనులకు వెళ్ళటానికి నిశ్చయించుకోక తప్పలేదు.

పెద్ద సావుకారి ఇంటి ముందట పెద్ద జాతర నడుస్తున్నది. వచ్చేవాళ్లు, పొయ్యేవాళ్లు, నిలబడిపోయిన వాళ్ళు, ఆడవాళ్లు, పిల్లలు. బజారు బజారంతా సందడి. మనుషుల సందడి. ముచ్చట్ల సందడి.

పెద్ద బండి తెచ్చారు. బండిని బంతిపూల దండలతో అలంకరించారు. గోవు మాలక్ష్మిని సొంతం స్నానం చేయించారు. కుంకమ తిలకం దిద్దారు. తలా ఒక దిక్కు పట్టి పదిమంది బండి మీదికెక్కించి పడుకోబెట్టారు. పూలూ దండలూ పరిచారు. డప్పు చప్పుళ్ళు దరువేస్తున్నాయి. దరువుకు తగిన విధంగా యువకులు అడుగులు వేస్తూ ఆడుతున్నారు. బండికాని వలుపలొకరు, దాపలొకరు సావుకారి జీతగాళ్ళు పట్టుకొన్నారు. నొగలు అటొక ఇద్దరు ఇటొక ఇద్దరు పట్టుకొన్నారు. బండి వెనుక ఐదారుగురు ఆసరా పట్టి నిలుచున్నారు. సావుకారి వచ్చి దు:ఖంలో వందనం చేశాడు. అతని ఇద్దరు భార్యలు చేతులు జోడించి పదేపదే మొక్కుకున్నారు. బండి ముందు భజన బృందం వాళ్ళు 'గోవిందా, గో...విందా' అన్నారు. బాళాలు మోగించినా డప్పు చప్పుళ్ళ నడుమ వినిపించడం లేదు. కొత్తను అందుకున్న జనం అరుపుల మధ్య ధ్వనించలేదు. అన్నీ కలిసి ఏదో చిత్రమైన ముగింపు. మామూలు మనుషులకి సైతం దొరకని ఉత్సవం వంటి ఊరేగింపు. ఇదివరకు ఊరిలో ఎప్పుడూ జరగని ఊరేగింపు.

బండి కదిలింది. లక్ష్మి మీద చిల్లర పైసలు, ప్యాలాలు, పూలు కలిపి గుప్పెడు గుప్పెడు వెదజల్లుతున్నాడు భూమయ్య సేటు. విషాదమైనా, చోద్యమైనా అందరూ పంచుకోవటం ఊరి ఆనవాయితీ. తలా ఓ మాట వెలిబుచ్చుతూ కొందరు బండి వెనుక సాగుతున్నారు. అటుపక్క ఇటుపక్క ఆసాములు మాట పోకుండా నడుస్తున్నారు. బండి ముందు సావుకారి, అతని సమీప బంధువులు, సన్నిహిత మిత్రులు నడుస్తున్నారు. కొంచెం దూరంగా ముసలమ్మ కట్టె సాయంతో కష్టంగా నడుస్తున్నది.

చౌరస్తాలో చావు ఊరేగింపు ఆగింది. దరువు మార్చి పెద్ద పెట్టుగ డప్పులు బలంగా మోగించారు. ఒక డప్పు బోర్లించి చిల్లర పైసలు పోశాడొకాయన. మరొకాయన నేల మీదికి వంగి చెంకన తగిలించుకొన్న డప్పును బలంగా కొడుతూ, ఆ ప్రతిధ్వనిలో బోర్లించిన డప్పుమీది పైసలు ఎగిరి కింద పడేలా ప్రకంపనలు సృష్టిస్తున్నారు. అన్నీ కింద పడిన తర్వాత విజయహాసంతో తల పంకించి దరువు వేస్తూ ఆడడం నిపుణులకు మాత్రమే వచ్చిన విద్య. మరొకాయన గజానికొక మట్టికుప్ప చొప్పున ఐదు మట్టికుప్పలు చేసి కుప్ప నడుమ నోటు చుట్టి నిలబెట్టాడు. కుప్పలకు నోట్లు అందరినీ ఆకర్షిస్తున్నాయి. డప్పు కొట్టేవాళ్లు సైగ చేసుకున్నారు. ఒకతను డప్పు కొడుతూనే నేల మీదికి వంగాడు. కుప్ప మీదికి ముఖం చాచి కన్ను తెరిచి రెప్పల్తో నోటు అందుకుని ఇరికించుకుని తీసి ఎత్తి పక్కన పడేశాడు. అది మరొక నైపుణ్యం. అయిదు కుప్పల్లోని అయిదు నోట్లు అట్లా తీసి ఎత్తినప్పుడు అతని కళ్లల్లో గెలుపు ఆనందం తొణికిస లాడుతున్నది. ఆ బృందంలో ఎవరో ఒకరు గట్టిగా ఈల వేయడం, నోట్లన్నీ దరువు బృందం ముఖ్యుడు తీసి భద్రపరచడం....సావుకారి మనుషులు మరికొన్ని నోట్లు తెచ్చి ఇచ్చి ఆడించటం.... ప్రమాదకరమైన ఆట. అటూ ఇటూ అదొక సరదా. దూరంగా రాయి మీద కూచొని ఆటపైనే పరికించి చూస్తున్నది పండు ముసలవ్వ. **'ముసల్దానికేం పనిలేదు. చాతగాకున్నా యెంటొస్తది'** అన్నారెవరో.

ఊరేగింపు మూల తిరిగింది. మరో మూల. మరో మూడు బాటలు. కొందరు ఆగిపోతుంటే కొందరు ఇళ్ళలోంచి బయటకొచ్చి చూస్తున్నారు. భజన చప్పుళ్లు, డప్పు చప్పుళ్లు, జనం చప్పుళ్లు, ఆవు మీద చల్లిన పైసలు ఏరుకోవడానికి చిన్న పిల్లలు పోటీ పడుతున్నారు. ఒకరినొకరు తోసుకుంటూ, ఒకోసారి సీచురూడుకుంటున్నారు. మళ్ళీ కలిసిపోతున్నారు. ఊరేగింపు వెళ్లిన తర్వాత తోవలో ప్యాలాలు పక్షులు తింటున్నాయి అక్కడక్కడ.

సావుకారి గుడ్డంలోకి చేరుకున్నది గోవు శవ యాత్ర. కాష్టం పేర్చి ఉన్నది. అన్ని చప్పుళ్లు ఆగిపోయాయి. తలా ఒక దిక్కు పట్టి ఆవును దించి కాష్టం మీదికి చేర్చారు. తెచ్చిన పాలు అందిస్తే సావుకారి ఆవు మీద చిలకరించాడు. నెయ్యి ముద్ద గొంతుమీదా, తల మీదా ఉంచాడు. వొచ్చిన వాళ్ళు తలా ఒక కట్టె ఎడమచేత్తో కాష్టం మీద వేస్తున్నారు. దూరంగా వెళ్లి నిలుచుంటున్నారు. అతి కష్టంగా కట్టె పట్టుకొని వచ్చి కాష్టం మీద వేసి ఆవుకు మొక్కింది ముసలవ్వ. కట్టెలు పేర్చుతూ కొన్ని పిడకలు పేర్చారు.

సావుకారి అనుమతితో కాష్టానికి నిప్పు పెట్టారు. కాష్టం అంటుకున్నది. గోవు మాలక్ష్మి కళేబరం కాలుతున్నది. పెద్ద సావుకారి కళ్లనీళ్ళు పెట్టుకున్నాడు మరోసారి. ఏవేవో గుర్తుకొస్తున్నాయి.

భూమయ్య సేటుకు ఏవేవో గుర్తుకొస్తున్నాయి. వచ్చిన వాళ్లు వచ్చినట్టే గుంపులు గుంపులుగా వెనుదిరిగారు. కొందరు ఊరివైపు, కొందరు బావులవైపు.

కాష్టం ఆరిపోబోతుంటే గ్యాసు నూనె దట్టించి, గుప్పించి చల్లాడు రుమాలతను. అతనికీ ఏవో గర్తుకొచ్చాయి. కొట్టంలో గింజుకుంటున్న సవారి ఎడ్లకు ఏదో కదిలి ఏవో గుర్తుకొచ్చాయి. లక్ష్మి కాలుతున్న మంటలు చూస్తుంటే కట్టె పట్టుకొని కష్టంగా నడిచొచ్చిన ముసలవ్వకూ ఏవో గుర్తుకొచ్చాయి. ఆ ముసలవ్వకు వాళ్ల అవ్వ గురుతుకొచ్చింది. అవ్వ చావు బతుకుల్లో ఉంటే ఖర్చుల కిందికి గుద్దం సావుకారికి కుదువబెట్టింది గుర్తుకొచ్చింది. ఆ గుద్దం విడిపించుకోవటానికి సుడితో ఉన్న ఆవును సావుకారికి అమ్మింది గుర్తుకొచ్చింది. ముసలమ్మ ముడుతలు పడ్డ కళ్లల్లోంచి కన్నీళ్లు బొటబొటా రాలి పడుతూనే ఉన్నాయి.

ఆనాడు తాను సావుకారికి అమ్మిన ఆవు ఈనిన తొలిచూలు దూడ ఈ లక్ష్మి. గోవు మాలక్ష్మి.

# ఓదార్పు ...

పిల్లలేడిస్తే ఓదార్చినట్లు
పోట్రాయి తగిలి మోకాలి చిప్ప పగిలితే
బుదుగరిచ్చి కట్టుకట్టాలి
ఏడుపు గొట్టు బతుకైందని బాధపడేవారిని
ఊకుంచాలి, ఊరడించాలి
ధైర్య వచనాలు దారిచూపే మందు

ఎక్కడేసిన గొంగడి అక్కడే ఎదుగుదలైతే
నాలుగడుగుల నడకకు భుజమందించి తొవ్వలో పడేయాలి
దారి తెలియని బాటసారికి గూగుల్ మార్గమవాలి
బావిలో పడ్డ వాడిపై రాళ్లేయడం సులువు
పైకి లాగడం భవిష్యత్తుపై ఆశ నిలపడం ఓదార్పు
ఎద్దు పుండుపై ఈగలు వాలినట్లు
ముల్లుకర్రతో పొడవడం శాడిజం
మందు రాయడం కన్నీళ్ళు తుడవడమే

కరోనా అంటితే నెత్తికెక్కిన భయం
కుతకుత ఉడికించి సావుదలకు తెస్తది
ధైర్యం మందు నూరి నూరిపోయడం
బతుకుపై ఆశ చిగుర్లు వేయించడం అత్యవసరం

సమాజం చెట్టుకు చీడ పడితే
పురుగు మందు చల్లడమే ఓదార్పు

**కాముదవెల్లి అంజయ్య**
సిద్ధిపేట
**సెల్..9848005676**

# నేను

అవును నేను పల్లేరు కాయనే
నీ కాలుకింద నలగకుండ ఉండడానికి
నన్ను నేను రక్షించుకోవడానికి
తప్పలేదు మరి
ఒక్కో గాయం ఒక్కోముల్లై పెరిగింది నాలో

అవును నేను ఎడారి మొక్కనే
నిస్సారమైన జీవితంలో
నన్ను నేను బ్రతికించుకుంటాను




అవును నేను తామరాకును
కుళ్ళు కుతంత్రాల సమాజంలో
పెరిగినా మచ్చుకైనా అంటక
విరబూసిన తామరను



నేను వేణువును
నిలువెల్ల గాయలున్నా
గేయమై అలరిస్తాను

మనిషితనం నామతం
మమతల గానం నాస్వరం



**బి. అంజనీ దేవి**
హన్మకొండ, ఫోన్ : 990 896 2730

## సాధన పంచకమ్

**సంగః సత్సు విధీయతాం భగవతో భక్తిర్ దృఢాఽఽధీయతాం**
**శాన్త్యాదిః పరిచీయతాం దృఢతరం కర్మాఽఽశు సంత్యజ్యతామ్**
**సద్విద్వానుప సర్ప్యతాం ప్రతిదినం తత్పాదుకా సేవ్యతాం**
**బ్రహ్మైకాక్షర మర్థ్యతాం శ్రుతి శిరోవాక్యం సమాకర్ణ్యతామ్.**

తాత్పర్యం : 1. సత్పురుషులతో సాంగత్యమును ఏర్పరచుకొన వలెను. 2. దృఢమైన భగవద్భక్తిని కలిగి ఉండవలెను. 3. శాంతి మొదలైన సద్గుణములను తెలిసికొని ఆచరించవలెను. 4. వదలని కర్మబంధనము (కామ్యకర్మలు) వెంటనే వదిలిపెట్ట బడు గాక! 5. సద్గురువును ఆశ్రయించవలెను. 6. ప్రతిదినము గురుదేవుని పాదుకలను సేవించవలెను. 7. అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. 8. వేదములకు శిరస్సుల వగంటి ఉపనిషత్తుల వాక్యములను శ్రవణము చేయవలెను.


**వివరణ**

**7. బ్రహ్మైకాక్షర మర్థ్యతామ్ –**

అద్వితీయమగు బ్రహ్మజ్ఞానమును అర్థించవలెను. అనగా అక్షరము, అఖండము, అద్వితీయము అగు బ్రహ్మమును గూర్చిన జ్ఞానమును బోధించుమని గురువును ప్రార్థించవలెను.

**"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః॥"** (4–34)

అనగా – సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించి, చక్కగా సేవలొనర్చి, కపటము లేకుండా వినయ విధేయతలతో ప్రశ్నించుట వలన పరమాత్మ తత్త్వమును తెలిసిన జ్ఞానులు సంప్రీతులై నీకు కావలసిన బ్రహ్మ జ్ఞానమును ఉపదేశించెదరు అని ఒక శిష్యుడు గురువు వద్ద జ్ఞానభిక్షను యాచించెడు ఒక చక్కని పద్ధతిని ఉపదేశించినది భగవద్గీత. **"బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి"** – బ్రహ్మమును తెలియగోరువాడు బ్రహ్మమే అగుచున్నాడు. కావున సాధకుడు సద్గురువును ఆశ్రయించి సేవించి తనకు జ్ఞానభిక్షను ప్రసాదించి తరింపజేయమని ప్రార్థించవలెను.



## సూర్యోదయము

కొక్కొరోకో యని కుక్కుటంబులు గూసె
పల్లె జనాలను పట్టి లేపె
భూపాళ రాగముల్ భువిని యంతయు నిండె
కేకి పింఛము విప్పి క్రేంకరించె
కిలకిలా రవముల కీర పికాదులు
గువ్వ కపోతముల్ గూడు విడిచె
అజ్ఞాన తిమిరమ్మె యస్తమించిన రీతి
ఉదయ భానుడు తూర్పు నుద్భవించె
జీవ జాలమ్ము పుడమియు చేతనంబు
పొంద నూత్న కాంతులమర పొద్దు పొడిచె
అర్ఘ్య మిచ్చుచు విప్రులు అంజలింప
పయనమై సాగె పగటికి పాలకుండు

రక్తవర్ణపు కాంతి రాజీవములు మెచ్చ
సూర్యోదయంబయ్యె చురుకు బుట్టె
అరుణారుణ ప్రభలంతట వ్యాపించి
అంధకారమునకు నాశలుడిగె
నుదుట సింధూరమై నేత్ర పర్వము గాగ
ప్రకృతి మాతయు నిట్లు పరవశించె
పుడమి పులకరించె పూవులు విచ్చెను
జన జీవనానికి జవము దోచె
దినము నేలగ సూర్యుండు దెసను పొడమి
వైనతేయుడు సూతుడై వడిగ నడుప
మిత్రుడయి ప్రభాకరుడయి మింటి మార్గ
మూని చరియింప నుదయించె మోదముగను

**(రథ సప్తమి సందర్భంగా "సూర్యోదయము" ఖండకావ్యం నుండి)**

**అల్వాల లక్ష్మణ మూర్తి**
కలువకుర్తి
**సెల్..9550467431**

# విస్మృతకవి ధరూరు తిరువేంగళదాసు

**పెబ్బేటి మల్లికార్జున్,** సహాయ ఆచార్యులు, నాగర్‌కర్నూల్, ఫోన్ : 9491881916

తెలంగాణ ప్రాంతంలో గొప్ప సాహిత్య సృజన చేసి కూడా వివిధ కారణాలతో ఎంతోమంది మరుగునపడి ఉన్నారు. హరికథ, శతకం, 74 కీర్తనలు, ద్విపదలు రాసి కూడా ముద్రణకు నోచుకోక మరుగున పడి కవి ధరూరు తిరువెంగళదాసు.

**"తెనుగు సాహిత్యములో పదహారణాల తెనుగుతనము కలిగిన ప్రక్రియ గేయరచన. దీనికి మరి యే యితర భాషల సాహిత్యముల తోడను ప్రమేయము లేదు. కవి తానేదైన మధురానుభూతి పొందినపుడు దానిని గూర్చి గానము చేయును. అదియే ఒక కావ్యమై మూర్తీభవించును. ఏ భాషలోగాని ముందు పాట తరువాత మాట. హృదయస్పందియైన రసానుభూతికి జననాంతర సౌహృదయము కావలెనని కాళిదాసు చెప్పియున్నాడు"** అని యండమూరి సత్యనారాయణ చెప్పారు.

వీటిల్లో కొన్ని సంగీత స్వరాలకు ప్రాధాన్యం ఇస్తే మరికొన్ని రసవంతమైన సాహిత్యానికి ప్రాముఖ్యతను ఇచ్చాయి. సంగీతానికి పనికి వచ్చే పాటలలో అధిక భాగం 19వ శతాబ్దంలో వచ్చాయి. ఆ తరువాత ఎక్కువమంది వాగ్గేయకారులు తెలుగులో కన్పిస్తారు. ఈ గేయాలు రసానందంగానీ, ఉపదేశంగానీ వెంటనే కలిగిస్తాయి.

తెలంగాణ వ్యాప్తంగా ఎందరో సంకీర్తనాచార్యులు ఉన్నారు. వీరి సాహిత్యాన్ని జానపద సాహిత్యంగా శిష్ట వ్యవహారులు చూసి వదిలివేయడం వలన అనేక రాతప్రతులు శిథిలమైపోయాయి. అక్కడక్కడ గ్రంథముద్రణ జరిగినా ప్రధాన సాహితీ ప్రవంతిలోకి మాత్రం రావటం లేదు. ఇప్పటికి జానపదుల నోళ్లలో దాగి ఉన్నది. ఈ సాహిత్యంలోని భాషాపటిమ, వర్ణనలు, తాత్త్విక జ్ఞానం, అలంకారాలు, రాగం మొ॥ ప్రజలను ఉత్తేజపర్చి ఆనందింపజేస్తాయి.

కీర్తనా సాహిత్యంలో భగవంతుణ్ణి సర్వస్వంగా భావించి తమ బోధనను, సంతోషాన్ని, కోపాన్ని, బెదరింపును, ప్రార్థనను అన్ని భావాలను సందర్భానుసారంగా ప్రకటిస్తారు. కీర్తన అంటే పొగడటం. భక్తుడు భగవంతుని అనేక విధాలుగా తనను రక్షించమని, ఆదుకొమ్మని ప్రార్థిస్తాడు. అలాంటి ప్రార్థనలే గేయరూపాన్ని, కీర్తనలుగా రూపొందాయి.

ఇవన్నీ కూడా చాలావరకు ప్రజల నాలుకలపైననే ఉండటం వలన కాలగర్భంలో కలిసిపోయే అవకాశం ఉంటుంది. అట్లాగే ముద్రణ పొందినవి కూడా, ఆ ప్రతులు సులభంగా లభించక పోవడంవలన కూడా ఆ రచనలు, కవులు ప్రాచుర్యం పొందక, సాహితీలోకానికి దూరంగా ఉండే పరిస్థితి ఉంది. అలాంటి స్థితిలో ఉన్న ధరూరు తిరువెంగళదాసుగారి రాతప్రతులు నాకు లభించాయి.

పరిశోధన నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లాలోని రాకొండ గ్రామవాస్తవ్యుడైన శేఖర్‌రెడ్డిగారి ఇంటికి వెళ్లాను. వీరు కాలం చేశారు. కాని వీరు సేకరించిన కొన్ని అముద్రిత ప్రతులు వారి కుమారుడు రుక్మాంగద రెడ్డి అందించారు. వాటిల్లో తిరువెంగళదాసు రచించిన అముద్రిత రచనలు లభించాయి. గొప్ప సాహిత్య సృజన చేసిన ఈ కవి విస్మృతంగా ఉన్నాడు.

ధరూరి తిరువేంగళదాసు యొక్క వంశ చరిత్రను రాసిన రాతప్రతి రెండు పుటలు లభించాయి. వీరి పూర్వుల నివాసం కంచి. వీరి వంశంలోని అందరూ వైద్యులు. వీరి వంశంలోని ఒక వైద్యుడు సంచారవశంగా గద్వాలకు వచ్చి అక్కడి ప్రభువుల ఆశ్రయంతో ధరూరులో స్థిరపడిపోయాడు. దీనితో ధరూరువారు అనే పేరు వచ్చింది. కొంతకాలానికి మహమ్మదీయులు గద్వాల కోటను ఆక్రమించుకొనగా హైదరాబాద్‌కు దగ్గరలోని బాలానగర్ వచ్చి స్థిరపడ్డారు.

బాలనగర్‌లో తిరువేంగళాచార్యులు అనే వీరి వంశస్థుడు వైద్యం చేస్తూ గొప్ప పండితుడుగా స్థిరపడ్డాడు. ఆ సమయంలో ఎల్లమ్మ రంగాపురం దొర తిరువేంగళాచార్యున్ని తన గ్రామానికి రప్పించి, ఆవాసం కల్పించారు. తిరువేంగళుని కుమారుడు కస్తూరి రంగాచార్యులు. ఇతని కుమారులు తిరువేంగళదాసు, కేశవాచారి, లక్ష్మణాచారి, ఈ సోదరులు పెద్దవారయ్యే సరికి కస్తూరి రంగాచార్యులు రాకొండకు వచ్చి స్థిరపడ్డారు. తిరువెంగళదాసు కాలం క్రీ.శ. 1852-1918.

**రచనలు :** 1) ఏకాదశీ మాహాత్మ్యం - హరికథ 2) రాకొండ సీతాపతిశతకం 3) భజనకీర్తనలు 4) తిరుప్పావై - తెలుగుద్విపదలు రచించారు. ఇవన్నీ అముద్రితం.

ఏకాదశి మాహాత్మ్యమును ఆ ఊరి దొర వెంకటలక్ష్మణరావు కోరికపై రచించాడు. శివుడు పార్వతికి కనిపించిన పద్మపురాణంలోని భాగాలను తీసుకొని రచించాడు.

భజన కీర్తనలు ఉన్న అముద్రిత ప్రతి పూర్తిగా లభించింది. ఇందులో మొత్తం 74 కీర్తనలున్నవి. రామునిపరంగా చెప్పబడ్డాయి. నామం, కీర్తన అనే పేర్లతో ఉన్నాయి. భజన కవులు ఎక్కువగా తనువు, మనస్సు, గురువు, దైవం గురించి రాస్తారు. ఈ కవి దైవం గురించి రాశాడు.

**నామ :** "హరీ హరీ నా మొరా వినవదేమిరా మరీ మందరోద్ధరా
సురేశ పూజిత కరీవరద యిందిరేశ సుందర పరాత్పరా

మరో కీర్తనలో –

**ఏమిర ఓ రామ! సుగుణ స్తోమ పరంధామ**
**కామిత వరదా కమలాసన వినుతామర రణభీమ**
**పురమపురుషరావే! మీ కృప మరువకేలు కోవే**
**నిరతము మీ శుభచరితములను మది మరువలేను వినవె**
**ఇందువదన నేను ఇకనేనెందు బోవలేను**
**కుందరదన యదునందన పరమా! నందమొందగాను**
**ధరణిలో రాకొండ! శౌరికొరత దీర్చుచుండా**
**కరుణతో తిరువేంగళకవి కృతులను స్థిరపరచుచునుండా"**

(అముద్రిత ప్రతి–పు. 28)


నలుగురిని కలుపుకొని వేడుకోవడం కన్నా, ఇతరులకు బోధించడం కన్నా తనకు తాను తత్వంగా లేదా తనలోని భక్తిని చాటుకొనే విధంగా కీర్తనగా చెప్పుకొవడంను వైయక్తిక కీర్తనలు అంటారు. ఇతని కీర్తనల్లో ఈ లక్షణం కన్పిస్తుంది.

కీర్తన :

**నారాయణ నిన్ను నమ్మినవాడను**
**యేరా నీదయ లేదా దేరా మ్రొక్కెదను**
**నీరజాసనాది మునులును నిగమములు నిను నెరుగజాలరు**
**ఘోర పాపాత్ముడను ననుకడతేర జేయర శ్రీరమాపతి**
**కన్నతండ్రివనుకొన్నాను యికను**
**నీకన్న దైవము వేరెయెన్నదెరుగనురా**
**పన్నగశయనా వాహన నా విన్నపంబాలించవేమిర**

(అముద్రిత ప్రతి పు. 41)

ఈ విధంగా ఈ కవి తనకు వ్యక్తిగతంగా కలిగిన భావాలను ఈ కీర్తనల్లో పెట్టి తన ఆర్తిని, భక్తిని, వేడుకోలును విస్తృతంగా వ్యక్తపర్చాడు.

**శిలాక్షరం**
**(బి.ఎన్. శాస్త్రి సాహిత్యం – సమాలోచన)**
ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.


**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**
**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**
**వెల : 300/-**
**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

ఈ కవి మరోరచన 'రాకొండ సీతాపతి శతకం'. ఇది మొత్తం లభించలేదు. 64 పద్యాలు మాత్రమే లభించాయి. తెలుగు సాహిత్యంలో శతకాలకు ప్రత్యేకమైన విశిష్టత కలదు. ఇది పండిత, పామరులను సమానంగా రంజింపచేయగలదు. తెలుగు కావ్య రచన అనువాదంతో ప్రారంభమైనా, శతక రచన మాత్రం స్వతంత్రంగా ప్రారంభమై, అన్ని రకాల వస్తువుతో వర్ధిల్లింది. **'రాకొండ సీతాపతి శతకం'** భక్తి ప్రధానంగా రచించబడింది. మకుటం **'రాకొండ సీతాపతే'**. మత్తేభవృత్తంలో రాయబడింది.

**శా. 'దీనుండన్నిను వేడితిన్నిపుడు నా దిక్కున్ గటాక్షించవే**
**నానా జన్మములెత్తి వేసరితి నీ నారాయణా శ్రీహరీ**
**హీనాచారుడటంచు నీ మదిననూహించంగ నేలాయికన్**
**రానే రావదె శ్రీ జగత్రయపతీ రాకొండ సీతాపతే!'**

**(అముద్రిత ప్రతి–పద్యం–11)**

**'మిము సేవింపదలించి పాండు సుతులున్ మీ పాదయుగ్మంబు మా**
**శ్రమలన్ బాపునటంచు వేడెవిల సచ్చారిత్రులన్ జేయవే**
**మము బోషింపవదేమి మ్రొక్కితిమి శ్రీమన్నాథ సర్వేశ కో**
**రము యీలోక సుఖంబు శ్రీ రఘుపతీ రాకొండ సీతాపతే'!**

**(అముద్రిత ప్రతి పద్యం–50)**

ఈ శతకంలో రాముని, కృష్ణుని అవతారాల గురించి వర్ణించాడు.

ఈ శతకంలో విపరీతమైన భక్తిని, ఆర్తిని ప్రకటించాడు. చాలా మంది భక్తకవులు తమ దైవాన్ని సర్వస్వంగా భావించి వర్ణించారు. కేవలం పాదసేవను మాత్రమే కోరుకున్నారు. తిరువెంగళదాసు కూడా

**ధనమివ్వండని వేడలేదు యిపుడున్ దారిద్ర్యమున్‌బోవు సా**
**ధనమేమియని బల్కలేదునిను ఓ దైవంబ నీపాదసే**
**వన నాకున్ బహుద్రవ్య సంపదగ నే భావించితిన్ వేరే కో**
**రనునేరన్ యిహ సంపదల్ రఘుపతీ రాకొండ సీతాపతే!**

**(అముద్రిత ప్రతి–పద్యం–42)**

అని వేడుకున్నాడు. రూపపరంగా, వస్తుపరంగా, శిల్పపరంగా తెలుగులోని ఉత్తమ శతకాలకు సరిసమానంగా తూగగలదు. సాహిత్య సృజన చేసికూడా మరుగునపడి ఉన్నాడు. ఈ కవి రచనలు ముద్రణపొంది ప్రాచుర్యంలోకి రావలసిన అవసరం ఉంది.



# పెన్నా శివరామకృష్ణ జీవితం, సాహిత్యం - పరిచయం

**ఐ. చిదానందం,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 8801444335

సంప్రదాయ శైలికి, ఆధునిక శైలికి భిన్నంగా మధ్యేమార్గంగా ప్రకృతి తాత్త్వికతను, ప్రేమతత్వాన్ని తెలిపిన కవి పెన్నా శివరామకృష్ణ. వీరి రచనలలో ఎలాంటి ద్వేషం గాని, అశ్లీలం గానీ, తిట్లు, బూతులు గానీ ఉండనే ఉండవు. స్వచ్ఛమైన ప్రకృతి మయ ప్రేమాధార రచనలే. వారి సాహిత్య ప్రస్థానమును జీవితాన్ని రేఖా మాత్రముగా పరిచయం చేయటం ఈ వ్యాస ముఖ్యోదేశం.


**జననం :** ఉమ్మడి నల్లగొండ జిల్లా మండలం కట్టంగూరు. ఈ మండలానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం దుగనివల్లి. ఈ గ్రామంలోనే పెన్నా శివరామకృష్ణ ఫిబ్రవరి 8 1960 న జన్మించారు. వీరి తల్లిదండ్రులు అనంత లక్ష్మీ, శేషావతారం గార్లు. వీరికి మొత్తం ఐదుగురు సంతానం. వీరిలో పెన్నా పెద్దవారు.

**విద్యాభ్యాసం :** పెన్నా ఒకటవ తరగతి నుంచి నాలుగవ తరగతి వరకు దుగనవల్లి గ్రామంలోనే చదువుకున్నారు. ఆ తరువాత ఐదవ తరగతి కట్టంగూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకున్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు అదే కట్టంగూరులోనే ఉన్నత పాఠశాలలో చదువు కొనసాగించారు. నల్లగొండ విజ్ఞానాంధ్ర కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసారు. కాలవ్యవధిలో చూస్తే ఇది ఇంటర్మీడియట్ తో సమానం. ఆ తర్వాత బి.ఓ.ఎల్ కోర్సు పూర్తి చేసారు. 1979 లో తెలుగు పండిట్ ట్రైనింగ్. 1980–1982 లో ఎమ్.ఎ. తెలుగు పూర్తి చేసి సెంట్రల్ యూనివర్సిటీలో ఆ తర్వాత ఎం.ఫిల్., పిహెచ్.డి. పూర్తి చేసారు.

**ఉద్యోగ జీవితం :** 1984 లో ఆనాటి ప్రభుత్వ పాఠశాలలో ఉద్యోగానికి పెన్నా జాయిన్ అయ్యారు. ఆ తర్వాత 1984 సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం రామక్క పేటలో పెన్నాకు సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఉద్యోగం సంపాదించారు. అలా 1985 లో జూనియర్ లెక్చరర్ గా పదోన్నతి లభించింది. అనేక చోట్ల ఉద్యోగ రీత్యా బదిలీలు జరిగి చివరికి కల్వకుర్తి (నాగర్ కర్నూల్) లో తెలుగు ఉపన్యాసకుడిగా 2018లో ఉద్యోగ విరమణ పొందారు.

**వివాహం :** పెన్నాకు 1986లో రాజేశ్వరి గారితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం.

**పెన్నా దృక్పథం :** పెన్నా బ్రాహ్మణ కుటుంబం కావడం చేత ఇంట్లో అనేక ఆంక్షలు ఉండేవి. ఈ కారణం చేత ఆయనకు స్నేహితులు తక్కువగా ఉండేవారు. ఇలాంటి సమయయంలో వీరికి పుస్తకాలతో కాలక్షేపం. అలా ఆధునిక కవిత్వ భావజాలం వీరిని ఆకర్షించింది. హేతువాద, నాస్తిక భావజాలం క్రమంగా నాటుకున్నాయి. చిన్నతనం నుంచి శ్రీశ్రీ, చలం రచనలు చదువుతూ



పెరగడం చేత పెన్నాలో కమ్యూనిస్ట్ భావజాలం ప్రవేశించింది. ప్రగతిశీల దృక్పథం ఏర్పడింది.

పెన్నా తన జీవితంలో పెరుగుదలకు, వృద్ధికి కారణమైన వారిని ఎప్పుడూ విస్మరించలేదు. తన రచనలను మిత్రులకు, గురువులకు అంకితం ఇచ్చి వారిని స్మరించుకున్నారు.


**పెన్నా సాహిత్యం :** పెన్నా సాహిత్యాన్ని 5 రకాలుగా విభజించవచ్చు. అవి 1) కవిత్వం 2) విమర్శ 3) సంపాదత్వం 4) సాహిత్యేతర రచనలు 5) సంపాదకత్వం 6) పీఠికలు


వీటిలో మళ్ళీ కవిత్వాన్ని 6 రకాలుగా విభజించవచ్చు. అవి 1) వచన కవిత్వం (నిశ్శబ్దం నా మాతృక, అలల పడవ మీద ద్వీప ఖండం) హైకూలు (రహస్య ద్వారం, చినుకులు చిత్రాలు, సులోచనాలు, దేశ దేశాల హైకూలు 3) దీర్ఘ కవిత – జీవనది 4) గజళ్ళు (సల్లాపం, శిశిర పల్లకి) 5) రుబాయిలు (తెలంగాణ రుబాయిలు, అశ్రుధార 6) ఇతరం – త్రిపదలు పెన్నా సరాలు.

విమర్శకు సంబంధించి 2 రకాలుగా విభజించవచ్చు. అవి 1. సాహిత్య వ్యాసాల సంకలనం (ఎరుక, ఆవిష్కరణ, వచన కవిత – ఆలంకారికత)

పరిశోధన సాహిత్య విమర్శ కవిత్వాలను శీల కవిత్వం–పరిణామ వికాసాలు సి.నా.రె విశ్వంభరలో అర్థయుక్త గజల్ సౌందర్య దర్శనం. తెలుగు గజళ్ళు – రుబాయిలు, గోరటి కవితా విమర్శ ఎన్. గోపి కవితా తత్త్వ వివేచన).

పెన్నా సంపాదకత్వం వహించిన రచనలు చూస్తే అవి ప్రేమ 101 కవిత్వ దశాబ్ది, తెలంగాణ సంస్కృతి – వ్యాసాలు శివారెడ్డి కవిత్వం – విమర్శలు, విశ్లేషణలు ఆమె ఎవరైతే మాత్రం, శివారెడ్డి




పీఠికలు దశాబ్ది కవిత, నోముల సాహిత్య ముచ్చట్లు. వీటిలో కొన్ని సహ సంపాదకత్వం ఉన్నాయి.

పెన్నా సాహిత్యేతర రచనలు చూస్తే రోజు రోజుకో చరిత్ర, జాతీయ అంతర్జాతీయ దినోత్సవాలు, నిరాశావాది, నిఘంటువు, ప్రేమ ... మరి కొన్ని సంగతులు, ముద్దుల ముచ్చట్లు, పీఠిక రచనలకు సంబంధించి పెన్నా దాదాపు 18 రచనలకు ముందు మాటలు రాసారు.

**పెన్నా వచన కవిత్వం :** పెన్నా తొలి రచన నిశ్శబ్దం నా మాతృక. ఇది జనవరి 1987 లో వెలువడింది. దీనిలో 35 కవితలున్నాయి. గుంటూరు శేషేంద్ర ఈ రచనకు స్నేహ వాక్యం రాస్తూ **"పువ్వు ఒక దేశం"** అని నామకరణం చేస్తే బాగుండును అని అభిప్రాయ పడ్డారు. కారణం దానిలో కవిత్వం అనుభూతి కవిత్వం కావడం. ఈ కవితా రచనలో పెన్నా ప్రతిభ, భావుకత, కల్పనా శక్తి తెలుస్తుంది.

**"అలల పడవ మీద"** 23 వచన కవితల సంపుటి. దీనిలో భావ వైశాల్యం గల కవితలెన్నో ఉన్నాయి. ద్వీప ఖడ్గం మరో కవితా సంపుటి. దీనిలో 46 కవితలున్నాయి. దీనిలో ఈ రోడ్డు దాటాలి, యాత్ర, కత్తి అంచుతోనే, ద్వీప ఖడ్గం, బాధించని గాయం, మాట్లాడే కపాలం వంటి మంచి కవితలున్నాయి.

పెన్నా వచన కవిత్వములో వస్తు వైవిధ్యం, తాత్త్వికత, భావచిత్రం, దృశ్యానుభూతి, సందేశాత్మకత, వర్ణనాత్మకత, ఆలంకారికత, కథాత్మకత వంటి అంశాలున్నాయి.

**పెన్నా హైకూలు :** పెన్నా తెలుగులో మూడు హైకూ సంపుటాలతో పాటుగా దేశ దేశాల హైకూ అనే హైకూ అనువాదాన్ని ప్రచురించారు. తెలుగులో తొలి హైకూ సంపుటం రహస్య ద్వారం పెన్నా వారిదే. పెన్నా హైకూలలో ప్రధానముగా స్థల, వస్తు, కాలాదులు, నిర్వచన హైకూలు, అమూర్త భావనలు, సందేశాత్మక హైకూలు వంటి అంశాలు ఉన్నాయి. ఉదాహరణకు వీటిలో స్థల, వస్తు, కాలాదులు అనగా హైకూలలో స్థలము తీసుకున్న – వస్తువు, ఏ కాలము అనే అంశాలు పరిశీలించదగినది.

**వరి నాటుతున్న వనిత**
**సూర్య బింబం మీద**
**ఒక మొక్క నాటింది.**

ఇక్కడ క్షేత్రం తడిగా ఉండటం వలన సూర్యుని ప్రతిబింబం పొలములో ఉన్న నీటిలో పడుతుంది. దీనిని కవి సూర్యబింబం వనిత మొక్క నాటిందని ఉత్ప్రేక్ష లో చెప్పారు. సాధారణముగా వరి పొలాలను వర్షాకాలం పారంభంలో సాగు చేస్తారు. కాబట్టి వర్షాకాలముగా మనం భావించవచ్చు. అలాగే సూర్యబింబం ప్రస్తావన చేయడం ద్వారా అది పగటిపూటగా చెప్పవచ్చు. పని చేయడంలో శ్రమైక సౌందర్యం, "శ్రమైక శక్తి" ని కవి దీనిలో చెప్పారు.

సామాజిక జీవితాన్ని పౌరాణిక నేపథ్యములో కవిత్వీకరించడాన్ని హైకూ పరిభాషలో మిథపోయి అని అంటారు. అనగా ఏదైనా హైకూ చదివినప్పుడు పౌరాణిక గాథ స్ఫురణకు కనుక వస్తే దానిని "మిథపోయి" అని అంటారు. ఉదాహరణకు –

**ఇది నగరం**
**మొసలి నోరు**
**శంఖ చక్రాలు లేవు**

పై హైకూలో నగరం అనేది సరస్సు లేదా చెరువు లాంటిదని కవి వ్యంగ్యార్థంలో చెప్పారు. సరస్సులో మొసలి ఉండటం సాధారణ విషయం. ఇక్కడ మూడవ పాదంలో ''శంఖచక్రాలు" లేవు అనీ రెండవ పాదంలో మొసలి నోరు అన్నచోట మనకు భాగవతములోని గజేంద్ర మోక్షము మనకు గుర్తుకు వస్తుంది. ఇలా పెన్నా హైకూలలో వైవిధ్యతను మనం గమనించ వచ్చు.

**పెన్నా దీర్ఘ కవిత్వం :** రచన కావ్యాన్ని నిర్వహిస్తూ ఒక ప్రధాన వస్తువుతో, ఒక తాత్త్విక చింతనతో, సందేశముతో, అనేక భావాలతో కథ లేకుండా సాగే లక్షణాన్ని "ఆర్చినిటి" అంటారు. ఈ లక్షణం తగినంత ఉన్న రచన దీర్ఘ కావ్యం. ఈ ప్రక్రియలో పెన్నా రాసిన దీర్ఘకావ్యం 'జీవనది'. ఈ కావ్యంలో పెన్నా అప్పుడప్పుడే ప్రారంభ మవుతున్న సాహిత్య కవితా వాదతను పరోక్షంగా విమర్శించారు.

**ఇప్పుడు నా అంతరంగం**
**ఫలాల నారగిస్తున్న పక్షి**
**ఈ లోకమనే మరో పక్షి అందుకు సాక్షి**

(జీవనది 1వ సర్గ, పు –33)

ఈ కావ్యం పై వాక్యాలతో మొదలవుతుంది. మాండ్యూకోప నిషత్తులో చూపబడిన వేడి వీడని సఖులైన రెండు పక్షులు ఒకే చెట్టును ఆశ్రయించి ఉన్నాయి. వాటిలో ఒకటి అసాధ్యమైన ఫలాన్ని తింటున్నది. మరొకటి సాక్ష్యంగా చూస్తున్నది. దీని ప్రకారం కవి

సమాజంలో హక్కులను కొందరు మాత్రమే అనుభవిస్తున్నారనీ, ఈ లోకమనే మరో పక్షి సాక్షీభూతంగా నిస్తేజంగా ఉందని కవి తన ఉద్దేశ్యాన్ని ప్రారంభించారు.

జీవనది కావ్యంలో ఇతి వృత్త సారాంశం – సంగీత, తాత్త్వికత, సందేశం వంటి అంశాలను పాఠకుడు గమనించవచ్చు.

**పెన్నా గజల్స్ :** ఫారసీ, ఉర్దూ సాహిత్యాలలో గాన యోగ్యమైన గేయ రచన గజల్. అనగా అరబ్బీ భాషలో రాగాలాపన అని అర్థం. చాలామంది అంగీకరించిన అర్థాన్ని తీసుకుంటే గజల్ అనగా ప్రియురాలితో సల్లాపం అని అర్థం. పెన్నా శివరామకృష్ణ రెండు గజల్ సంపుటాలను రచించారు.

సల్లాపం గజల్స్ లో ఏక పక్ష ప్రేమ, వియోగ శృంగార సంబంధిత గజల్స్ ఎక్కువ. శిశిర పల్లకి లో 75 గజల్స్ కలవు. పెన్నా గజల్స్ ని భాషా సౌందర్య, ప్రయోగ, ప్రేమ విరహ గజల్స్ వంటి అంశాలతో పరిశీలించవచ్చు. పెన్నా గజల్స్ గేయ రూపంలో, కథా రూపంలో పాడడానికి అనువుగా వున్నాయి. వీరి గజల్స్ లో వైయుక్తికంగా ఉంటూ భావాలలో లాలిత్యం, సౌకుమార్యం ఉంటుంది.

పెన్నా గజల్స్ లో ప్రధానంగా నివేదన, భాషా సౌందర్యం, చమత్కారం, విరహం, ఆకాంక్ష, తాత్త్వికత, అధిక్షేపం, వ్యంగ్యం, సామాజికాంశాలు, ప్రభోధము, అభివ్యక్త, అన్య దృశ్యాలు, వేదన, చిత్తభ్రమం, నిరాశ, వైరాగ్యం మృత్యు స్పర్శ, ఖితా బందో తఖల్లుస్ వంటి అంశాలున్నాయి.


రుబాయిలు–:

పెన్నా రుబాయిలలో ప్రధానంగా చెప్పుకోవల్సిన రచన తెలంగాణ రుబాయిలు. దీనిలో 103 రుబాయిలు ఉన్నాయి. **అశ్రు ధార** సంపుటిలో 500 రుబాయిలున్నాయి.

పెన్నా రుబాయిలలో ప్రభోదాత్మకతను, భావుకతను, సామాజికాంశాలను, వ్యంగ్య హాస్య విషయాలను స్వరాష్ట్ర ప్రేమను, తెలంగాణ ఉద్యమ చిత్రణ వంటి అంశాలును ఉన్నాయి.

కన్నీటి జడిలో తడిసిన కంటకము పువ్వుగ మార్చగలవా! రంగులెన్నో మార్చుకున్నా జ్వాల నీడను ఇవ్వగలదా? ముళ్ళ పొదపై ఆరవేసిన వస్త్రమే ఈ బతుకు పెన్నా పగలకుండా హృదయమైనా లోక మర్మం తెలియగలదా!

పై రుబాయిలో 3 వ పాదము తప్ప మిగిలిన పాదాల అంత్య ప్రాసలలో మారగలదా, ఇవ్వగలదా, తెలియగలదా అనే మూడు కాకు స్వరాలు ఉన్నాయి. వీటిని చదివినప్పుడు మనకి అర్థమవుతుంది. ఇవి వ్యతిరేకార్థంలో ఉన్నాయని.




ఇందులో కంఠ స్వరమును బట్టి మారలేదనీ, ఇవ్వలేదనీ తెలియలేదనీ అనే విషయాలు మనకు అర్థమవుతుంది. ఇలాంటి స్వరములను కాకువు అని వ్యాకరణ పరి భాషలో అంటారు.

**పెన్నా విమర్శ :**

పెన్నా శివరామకృష్ణ విమర్శ సాహిత్యాన్ని క్రింది విధాలుగా విభజించవచ్చు. అవి ప్రక్రియ పర విమర్శ, జీవిత కావ్య విమర్శ, వచన రచన విమర్శ, వచన ఖండికల విమర్శ, పీఠిక విమర్శ.

ప్రక్రియ శబ్దాన్ని Genre అన్న ఆంగ్ల పదానికి సమానార్థకముగా ఉపయోగిస్తారు. పెన్నా హైకూ, నానీ రెక్కలు, గాథలు, గజల్స్ రుబాయి వచన కవిత్వం వంటి వివిధ ప్రక్రియలను వివిధ వ్యాసాలలో విశ్లేషణ చేసారు. చారిత్రక విమర్శకు బాసటగా నిలిచేది కవి జీవిత సమన్వయ విమర్శ. ఈ అంశములో గుంటూరు శేషేంద్ర శర్మ, కె. శివారెడ్డి, సి.నా.రె., గోరటి వెంకన్న, ఎన్. గోపి వంటి ప్రముఖుల రచనలను, వారి జీవితాలను సమన్వయం చేస్తూ విమర్శ చేసారు. వచన, రచన విమర్శలో కథానిక, నవలా, వ్యాస రచనకు కావల్సిన వంటి వాటిని వివరించారు. వివిధ కవులు రాసిన కవితలను పెన్నా సమర్థించారు. పెన్నా వివిధ రచనలకు పీఠికలను రాసారు. దీనిని ముందు మాటల విమర్శగా చెప్పవచ్చు.

పెన్నా స్వభావ రీత్యా ఏదో ఒక మూస ధోరణి వెళ్ళటం ఇష్టం ఉండదు. అందుకే ఏదో ఒక ప్రక్రియలో కవిగా, రచయితగా, పేరు తెచ్చుకోవటం కంటే వివిధ ప్రక్రియలలో తనదైన ముద్రను కలిగి ఉండాలనుకున్నారని చెప్పవచ్చు.

సాహిత్య ప్రకారం, భావజాలం ప్రకారం పెన్నా ఏ సాహిత్య సంఘాలలో సభ్యుడు కాకపోవడం, రాజకీయ స్పర్శ లేకపోవడం వలన పెన్నాకు రావాల్సినంత పేరు రాలేదనీ చెప్పారు.

# డా. తిరుమల రామచంద్ర గారి ఆత్మకథ – ఒక పరిశీలన

డా॥ వీపూరి వేంకటేశ్వర్లు, కర్నూలు, ఫోన్ : 988 558 5770

ఆధునిక వచన సాహిత్య ప్రక్రియలలో ప్రసిద్ధి చెందిన ప్రక్రియ **"జీవిత చరిత్ర"** (ఆటోబయోగ్రఫీ). ఇది పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఏర్పడింది. జీవిత చరిత్ర, స్వీయచరిత్ర ఒకటికాదు. ఒక వ్యక్తి చరిత్రను ఇతరులు రాస్తే జీవిత చరిత్ర. తన చరిత్రను తానే రాసుకుంటే **స్వీయచరిత్ర.** దీనికి ఆత్మకథ, ఆత్మ చరిత్ర, అనుభవాలూ – జ్ఞాపకాలూ, గతస్మృతులు అనే పేర్లు కూడ ఉన్నాయి. స్వీయచరిత్రను రాసుకోవడం కత్తిమీద సాము వంటిది.

స్వీయచరిత్ర ఒక వ్యక్తి జీవితానుభవాల సంపుటి. దీనిని చదివితే తోటి మానవుల కష్టసుఖాల పట్ల సానుభూతి, అవగాహన కలుగుతాయి. మనం ఎలా ప్రవర్తించాలో తెలుస్తుంది. ముఖ్యంగా జీవిత సత్యాలను తెలుసుకోవడానికి స్వీయచరిత్రను చదవాలి. స్వీయచరిత్ర అంటే మానవుల చరిత్ర, దేశచరిత్ర, సమాజ చరిత్ర. ఒక రకంగా స్వీయచరిత్ర అంటే మానవ ప్రవృత్తుల సింహాలోకనం, సమాహార స్వరూపం. కనుక ఒక సంఘంలో – ఒక కాలంలో ఏయే పరిస్థితులు – ఏయే పరిణామాలు తెస్తాయో, వాటి క్రమబద్ధత ఏ విధంగా ఉంటుందో తెలుసుకోవాలంటే మేధావులైన వారి స్వీయచరిత్రలు ఉపయోగపడుతాయి. సాంఘిక ఆర్థిక రాజకీయ మత నైతిక సాంస్కృతిక పరిణామాలన్నిటికీ ప్రాతిపదికమైన మానవ జీవిత సంబంధాలు స్వీయచరిత్ర ద్వారా ప్రతిపాదితమైనట్లు తక్కిన ప్రక్రియల ద్వారా ప్రతిభావంతంగా, ప్రభావశీలంగా ఆవిష్కృతం కావు. ఎందుకంటే ఇందులో ప్రత్యక్ష కథనం కాబట్టి ఇవి పాఠకులపై జరిపే ప్రభావం అనల్పంగా ఉంటుంది.

తెలుగులో స్వీయచరిత్ర రచనకు 'నేనే ఆద్యుణ్ణి' అని కందుకూరి వారు చెప్పుకోవటం విశేషం. కందుకూరి తర్వాత ఆ స్థాయిలో తగిన జీవిత చరిత్రగా, అందరి ఆదరణకు పొందిన స్వీయచరిత్రగా ముఖ్యమైనది శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి **"అనుభవాలూ – జ్ఞాపకాలూనూ"**. ఆ తర్వాత చెప్పుకోదగిన స్వీయచరిత్ర డా. తిరుమల రామచంద్రగారి **"హంపీ నుండి హరప్పా దాకా".** అయితే వీరు ఈ ఆటోబయోగ్రఫీలో కవర్ చేసిన తన జీవితభాగం ఆయన బ్రతికిన దానిలో మూడవ వంతు కూడా లేదు. కాని ఇంత ఆత్మ నివేదన ప్రవణంగా ఏ రచనా రాలేదు. కరుణం, శృంగారం, సుకుమార హాస్యం వంటి వాటితో నిండిన ఈ గ్రంథం పాఠకులను పూలతోటలో విహరించేటంతటి సంతోషాన్ని కల్గిస్తుంది. ఈ గ్రంథంలోని అరవై ఒక్క అధ్యాయాలు అరవై ఒక్క కథలుగా చదివిస్తాయి. వీరు తన స్వవిషయాలను చాలా సృజనాత్మక భావుకతతో, ప్రతిభతో ఆవిష్కరించడం వారి వంటి ఉపజ్ఞాప్రాభవులకు మాత్రమే సాధ్యం.


తిరుమల రామచంద్రగారు ఏ పుస్తకానికైనా పరిచయ వాక్యాలు కూర్చేటప్పుడు, ఆ పరిచయాన్ని 'మనవి మాటలు' అనేవారు చివరన తనను 'భాషా సేవకుడు' అని అభివర్ణించుకునేవారు. అంతటి సౌజన్యమూర్తి దురదృష్టవశాత్తు తన స్వీయ చరిత్రను పుస్తక రూపంలో చూసుకోకుండానే దివంగతులైనారు. కాని మృత్యుశయ్యలో కూడా ఈ గ్రంథాన్ని గురించే కలవరించారు. ఈ పుస్తకం రావడానికి ఎవరు తోడ్పడతారా? అని ఉత్సుకతతో ప్రతీక్షించారు. అయితే వారు లోకాంతరగతులైన రెండు నెలలలో అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ (అ.జో.వి.భొ) వారి సహకారంతో ఈ పుస్తకం రూపుదిద్దు కొంది. డా.అక్కిరాజు రమాపతిరావు (మంజుశ్రీ) 'మనస్విమాటలు' పేరుతో మొదటి ముద్రణలో, 'మనవి మాటలు' పేరుతో రెండవ ముద్రణలో రెండు ముందుమాటలను వ్రాశారు. జి.వి.అమరేశ్వరావు అందమైన రేఖాచిత్రాలను సంతరించి, సుందరంగా ముఖచిత్ర రూపకల్పన చేశారు. ఇలా తిరుమల రామచంద్రగారి 'హంపీ నుంచి హరప్పా దాకా' గ్రంథం వెలుగులోకి వచ్చింది. ఈ మేలి గ్రంథంతో తులతూగగలిగిన గ్రంథాలు ఒక శతాబ్దంలో ఇరవైదాకా వెలువడితే అది చాలా గొప్ప సంగతే అవుతుంది. సాహిత్య ప్రక్రియలన్నింటిని కలిపి లెక్కించినా ఒక శతాబ్దిలో ఇటువంటి మహోత్తమ గ్రంథాలు ఇరవై ముప్పై కన్న ఎక్కువ పరిగణనలోకి రావు. ఎందుకంటే ఈ రచన నవరసభరితమైన ఆధునిక వచన మహాకావ్యం. ఇతిహాసం భారతీయ సంస్కృతిలోని మేలిమిని సాక్షాత్కరింపజేస్తున్న సుందరపురాణం. చారిత్రాత్మక స్వీయ చరిత్రాత్మక కథనం. ఒక నవల కన్నా వేగంగా, ఆకర్షకంగా, ఉత్తేజభరితంగా, చదివించే ఈ రచన ఎంతో విలక్షణమైనది, విశిష్టమైనది.

మొదటి అధ్యాయం **'గుండ్రాయి చెప్పిన గాథ'**లో అనేక చారిత్రక విషయాలను విశ్లేషించారు. రామచంద్ర గారి పూర్వీకులు విజయనగర సామ్రాజ్యంలో, తాడిమర్రి పాలకుల వద్ద గురువులుగా వ్యవహరించిన తీరును, రామానుజ మతాన్ని, తమ ఇంటి పేరైన తిరుమల నామ ప్రాధాన్యాన్ని ఆకట్టుకునే శైలిలో వివరించారు.

రెండవ అధ్యాయం **'కమలాపురం'**లో కమలాపుర స్థలనామ విశేషాన్ని తెల్పి, మొదటి అధ్యాయంలోని సగం విరిగిన ఇనుపగుండు గాథను ఫిరంగి గుండని తేల్చిపారేశారు.

నాలుగవ అధ్యాయం **'పాడుపట్టణమైన విజయనగరం'**లో విజయనగరం ఇప్పటి లండన్ నగరం కన్నా విశాలమైనదని, కమలాపురం విజయనగర సార్వభౌముల అంతఃపురాలకు దగ్గరగా ఉన్న ప్రాంతమని, విద్యా దృష్టిలో చూస్తే పూర్వమిది గొప్ప విద్యా

పీఠమని, మహా వాగ్గేయకారులు, విద్వద్వరులు నివసించిన ప్రాంతమని, అయితే బహుమనీ సుల్తానుల రెండు లక్షల సైన్యం ఓవర్ టైం కూడా చేసి, విజయనగరాన్ని ఆరు నెలల పాటు ధ్వంసం చేసారని, అంతటి మహానగరంలో కమలాపురం వంటి ఊళ్లు ఇప్పుదుండటమే గొప్పవని ఆ ఊరి నుంచే విజయనగర శిథిలాలు ప్రారంభమవుతాయని చెప్పి, వాటిని విశ్లేషిస్తారు. తర్వాత ధార్వాడ నుంచి వచ్చిన మోడీ వేసేవాళ్ళ అపూర్వ వినోదాలను – విచిత్రాలను ఆకర్షణీయమైన మాటలతో చెప్పి, చివరకు అంతటి కళాకారులకు దక్కినవి వారం రోజుల తిండిగింజలు, పదిహేను రూపాయలని, మరి ఇప్పటి ఇంద్రజాలికులు పెద్దపెద్ద ఆడంబరాలతో లక్షలు గడిస్తున్నారని వాపోతారు.






అయిదవ అధ్యాయం **'బసివి నాగమ్మ'**లో "మన ఆచారాలు అన్నీ మంచి ఉద్దేశంతో ప్రారంభమై చెడ్డ పరిణామంలో ముగుస్తాయి. బసివి పద్ధతి మన దేశంలో వేల సంవత్సరాల నుంచి ఉంది. ఈ సంసార బంధంలో చిక్కుపడక తనను భగవంతుని సేవకు జీవితమంతా అంకితం చేయడం దీని ఉద్దేశం. పూర్వం మగవారు ఇలాంటి సేవ చేసేవారు. వారిని ఏకాంగి, ఏకాంగి వీరుడు అనేవారు. దైవసేవ కోసమే కాదు, రాజసేవ కోసం, తన లక్ష్యసిద్ధి కోసం ఇలా అంకితమయ్యేవారు. అలాగే మహిళలు అంకితమయ్యేవారు. దీనికి గొప్ప ఉదాహరణ గోదాదేవి. తన వివాహం భగవంతునితోనేనని రంగనాథునికి జీవితం అర్పించి ఆయనలో ఐక్యమైంది.

ఈ పాత సంప్రదాయం శైవవైష్ణవ మతాలకు పాకింది. వీరశైవ మత ప్రవర్తకుడు బసవేశ్వరుడు. అతడు పరమేశ్వరుని వాహనమైన వృషభనంది అవతారమని తదనుయాయుల విశ్వాసం. **"వృషభ శబ్దం ప్రాకృతంలో బసవ అయి కన్నడంలో చేరింది. బసవని లాగే పరమేశ్వరునికి కింకరుడై జీవితాన్ని తదారాధనకు వినియోగించేవాడు బసవుడు. ఆ విధంగా వివాహాది సంసార జంజాటం మాని పరమశివ కైంకర్యానికి జీవితాన్ని అంకితం చేసిన మహిళ బసవి – బసివి. పిల్లలు కలగని వారు తమకు పిల్లలు పుడితే ఒక సంతానాన్ని బసవిగా భగవత్కైంకర్యానికి వదులుతామని, జబ్బుపడిన బిడ్డపడే తీరని బాధను చూచి ఓర్చుకోలేని తల్లిదండ్రులు జబ్బు కుదిరితే నీ సేవకే బసివిగా వదులుతామని మొక్కుకోవడం కూడా కొన్ని కులాలలో చిన్నతనంలో ఉండేది"** అని దేవదాసీ – బసవి (బసివి) వ్యవస్థ యొక్క మహత్తర ఉద్దేశాన్ని కూలంకషంగా వివరించారు.

తర్వాత సంఘంలోని స్వార్థపరులు ఊరికే ఉండరని, మంచిని పాడుచేస్తారని, ఆ విధంగానే దేవదాసి – బసివి పద్ధతి పాడయి పోయిందని, దేవునికి చెందిన బసివి – దేవ దున్నపోతులాగే ఉమ్మడి గ్రామానికి ఉమ్మడి ఆస్తి అయిందని, క్రమంగా మోతుబరుల మనిషి అయిందని, వ్యభిచారంతో జీవించే వ్యక్తి అయినదని ఆవేదన చెందుతారు. చివరలో బసివి నాగమ్మను గురించి చెబుతూ ఆమెను తలచుకుంటే తన వేద, పురాణ మహిళలందరూ గుర్తుకు వస్తారని, ఆమె పవిత్రతను – పాతివ్రత్యాన్ని కొనియాడుతారు.

పదకొండవ అధ్యాయం **'తెనాలి రామన మంటపం'**లో తన తాతగారికీ, నాయన గారికీ, పినతండ్రి గారికీ శిథిలాలలోని ప్రతి రాతిముక్క పుట్టుపూర్వోత్తరాలు తెలుసునని చరిత్రకెక్కని ఎన్నో విషయాలను వారు చెప్పగలిగేవారని, హంపీ శిథిలాలలో పాడుపడిపోయిన భువనవిజయ సభామంటపం ఎదుట దాదాపు అరమైలు దూరంలో ఒక గుట్టమీద నాలుగు స్తంభాల ఒక చిన్న మంటపమున్నదని, దానికి తెనాలి రామన మంటపమని పేరని తెల్పి, తన తాతగారి ద్వారా తెలుసుకున్న ఆ వృత్తాంతాన్ని విశదీకరిస్తారు.

పదమూడవ అధ్యాయం **'అంజనంలో కనిపించిన పట్టణద ఎల్లమ్మ'**లో పట్టణద ఎల్లమ్మ అంటే – పట్టణపు ఎల్లమ్మ అని, ఈమె విజయనగరం రక్షణ దేవతని, శత్రువుల ఆక్రమణ సమయంలో – ప్రాణభయంతో అందరూ కట్టుబట్టలతో పారిపోయారని, వారు భూమిలోనో, విశాలమైన గోడల మధ్యనో దాచుకున్న డబ్బు తన చిన్నతనంలో చాలామందికి దొరికినట్లు వ్యాపిస్తూండేవని, ఎల్లమ్మ రాత్రంతా అదృశ్యంగా శిథిలనగరమంతా తిరుగుతుంటుందని, ఆ నిధులను రక్షిస్తుంటుందని, అలాంటి నిధులు పిడతలలోనో, వాడలలోనో దాచినవి కొందరికి దొరికేవని, తనకిలాంటి గుర్తున్నటు వంటి రెండు మూడు సంఘటనలను వివరిస్తారు. అందులో భాగంగానే మార్కాపురం నుంచి వచ్చిన సీతానగరం రామాచార్యులనే మంత్ర శాస్త్రవేత్త, తన తాతగారైన నరసింహ తాతాచార్యుల గారితో అంజనం వేయడానికి ఒక రాత్రిపూట ఒక వ్యక్తిని

ఎన్నుకొని, అతని కంటికి ఏదో రాచి, ఒక తమలపాకులో ఒక చుక్క అంజనం వంచి, ఏవో మంత్రాలు చదివారని. అంజనం రాచుకున్న వాడికి, ఆ అంజనం చుక్కలో నిధులతో పాటు, పట్టణద ఎల్లమ్మ కన్పించి, భయపెట్టగా అతడు ముందుకు పడిపోయాడని. మాంత్రికుడు తక్కిన మంత్రాలతో పాటు వైష్ణవ సంప్రదాయపు అభీతిస్తవం పఠించాడని. తర్వాత కొంతకాలానికి పట్టణద ఎల్లమ్మ గుడి పరిసరాలలో పురాతత్వశాఖవారే తవ్వకాలు కొనసాగించారని, అపూర్వమైన వస్తువులు – వజ్ర వైడూర్యాలూ దొరికినట్లు విన్నానని ముక్తాయింపునిస్తారు.

ఇరవయ్యో అధ్యాయం **'నిద్రలో నడక'**లో రామచంద్రగారి సమాశ్రయణ వృత్తాంతాన్ని పరమ సుందరంగా వర్ణించారు. గొప్ప సంస్కారంతో గాని, త్రికరణ పూర్వకమైన దాసభావం కలగదని, తిరుమలనంబి, భగద్రామానుజుల వారి వృత్తాంతాన్ని ప్రస్తావించారు.

ఇరవై ఒకటవ అధ్యాయం **మహాతపస్విని కొండమ్మవ్వ**లో **"కొండమ్మవ్వ దయామయి. ఆర్తులను ఆదుకొనేది. జబ్బుపడిన పిల్లలకు, మహిళలకు సేవచేసి, సేదతీర్చే చల్లని మాటలు మాట్లాడేది. గొప్ప మనస్విని. విధివంచనతో కాపురానికి వచ్చి కాంక్షలు తీరీతీరని వయస్సులోనే వైధవ్యం పైనపడింది. పిల్లలు లేరు. విడిపోతే ఆస్తులలో చీలికలు వస్తాయని అత్తింటివారు ఆమెను పుట్టింటికి పంపలేదు. అత్తింటిలోనే ఎనిమిది పదుల ఆయుస్సు గడిపింది. తన బావగారి కుమారుణ్ని తన కుమారుడిగా భావిస్తూ, అతని పిల్లలను తన మనుమలుగా భావిస్తూ, ఒక చీదరింపు లేక సంతోషంతో, అందరినీ వాత్సల్య గౌరవాలతో చూస్తూ జీవయాత్ర గడిపింది. తన ప్రవృత్తిని మానవత్వం వైపు, జగత్కుటుంబ భావనవైపు మళ్ళించి, ధన్యురాలయింది"** అని కొండమ్మవ్వను గురించి పేర్కొని, ఆమె త్యాగజీవితాన్ని కొనియాడుతారు.

ఇరవైమూడవ అధ్యాయం **'భవతీ భిక్షాందేహి'**లో 'పూర్వం చాలామంది విఖ్యాతులైన పండితులు – హైకోర్టు న్యాయమూర్తులైన పలువురు వీధిదీపాల క్రింద చదువుకొని, మాధుకరమెత్తి చదువుకొని గొప్పవాళ్ళయారని. ఇప్పుడు పాశ్చాత్య దేశాలలో చదువు కొనసాగించడానికి వెళ్ళిన విద్యార్థులు అక్కడి వ్యాపార సంస్థలలో కార్యాలయాలలో కొన్ని గంటలపాటు పనిచేసి డబ్బు సంపాదించి అదనపు ఖర్చులకు వినియోగించుకొంటున్నారని. ఈ కాలంలో ఉద్యోగం చేసేవాళ్ళు పై వారి అనుగ్రహం కోసం తమ విధ్యుక్తధర్మాల నిర్వహణ కన్నా ఎక్కువగా ఈ పనులు చేస్తుంటారని. వాళ్ళను మనం ఉద్యోగం బిచ్చగాళ్ళని అందామా?' అని మాధుకర వృత్తి ప్రాశస్త్యాన్ని తెలియజేస్తారు.

ముప్పై నాల్గవ అధ్యాయం **'అమ్మమాట'**లో **"మానవుని మనసు కష్టాలు విచ్చినప్పుడు కాని నీతి ప్రవణం కాదనిపించింది. ఆ జీవితం చూస్తుంటే మా అమ్మతో ఆ మాటే అన్నాను. ఆమె అరగంటసేపు ఆపద్ధర్మాలను గురించి నాకు వివరించింది. ఆపత్కాలంలో మానవుని ధర్మబుద్ధి వికసించి వివేకం జాగృతమవుతుందని అది ఆపద గడిచిన తర్వాత గూడ కొనసాగితే మనస్సు నిజంగా పరిపక్వం అయినట్లని అన్నది"** అని తన తల్లి మాటలలోని నైతిక సారాంశాన్ని పాఠకులకు అందించారు.

చివరిదైన 61వ అధ్యాయంలో **'డెయిలీ టెలిగ్రాఫ్'**లో "నేను కళ్ళు తెరిచే వేళకు రాత్రి ఎనిమిది కొట్టింది. అప్పుడు లక్ష్మీబాయి గారి ఇంటికి మారడం ఎందుకులే – అని అనుకున్నాను. రాత్రి సత్రం పంచలోనే కప్‌బోర్డ్ ఎదుట అందరితో పాటే ఉత్తరీయం పరచుకొని పడుకున్నాను. ఉదయం లేచాను. పని పునరావృత్తం అయింది. అవును. ఈ పునరావృత్తి – రొటీన్ జీవికే కాదు, సృష్టికీ తప్పదా? భూమి తిరుగుతూనే ఉంది. సూర్యుని చుట్టూ, తన చుట్టూ చంద్రుణ్ణి తిప్పుకుంటూ! సూర్యుడు కూడా తిరుగుతాడట! ఈ భూచక్రానికే తప్పనప్పుడు నేనెంతటివాడిని? అయినా నేను నష్టపడింది లేదనే అనిపించింది. దేశం తిరిగాను; వయస్సు గడిచినా అనుభవం కలిగింది గదా" అనుకుని లక్ష్మీబాయి గారి ఇంటికి బయలుదేరాను. అప్పుడు ఒక సూక్తి గుర్తుకువచ్చింది.

**"యస్తు సంచరతే దేశాన్ – యస్తు సేవేత పండితాన్ ।**
**తస్య విస్తారితా బుద్ధిః – తైలబిందు రివాంభసి" ॥**

ఎవడు దేశాలు తిరుగుతాడో, ఎవడు పండితులను సేవిస్తాడో, వాడి బుద్ధి నీటిలో పడిన నూనె సుక్కలాగ విస్తారిస్తుంది. నాకవి రెండూ ఎంతవరకు అబ్బినాయో బేరీజు వేసుకుంటూ నడిచాను. నూరేళ్ళూ ఇలా నడక తప్పదేమోనని అనిపించింది" అని తన అనుభవాలను ఇలా ఒక మంచి శ్లోకంతో ముగించారు.

రచయిత రామచంద్ర గారు ప్రతి అధ్యాయంలో ఇలా ఆకట్టుకొనే అంశాలను, సందర్భోచిత సుప్రసిద్ధ శ్లోకం ద్వారా ఉటంకించి తన అనుభవాలను వింగడించారు. పాఠకులకు కనువిందు చేశారు. వారి మనస్తత్వ పరిశీలన, మానవ స్వభావ చిత్రణ, మనస్తత్వ ప్రతిపాదన చాలా అద్భుతమైనవి. ఆలోచిస్తే **"హంపీ నుండి హరప్పా దాక రామచంద్రాయణమైన మధురం, మధురాక్షరం"** అని మంజుశ్రీ గారన్నమాట అక్షరసత్యం. ఎందుకంటే ఇందులో రచయిత వైయుక్తిక విషయాలే కాక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సంబంధమైన పలు విషయాలు కన్పిస్తాయి. ఇవన్నీ చరిత్రకు సంబంధించిన విషయాలే! కనుక ఒకరకంగా ఈ గ్రంథాన్ని చారిత్రక రచనా విభాగానికి చెందిన ప్రక్రియగా పేర్కొనవచ్చు.

ఏది ఏమైనా స్వీయ చరిత్రను వ్రాసి మెప్పించటం చాలా కష్టం. ఎందుకంటే రచయిత తన జీవితంలోని సంఘటనలను ఉన్నది ఉన్నట్టుగా చెప్పాలి. రచయిత రామచంద్ర గారు తన వ్యక్తిగత కుటుంబ విషయాలు, సామాజిక విషయాలు, సంఘటనాత్మకంగా ఒక క్రమపద్ధతిలో వివరించటంతో పాటు సమాజంలో అన్న పరిస్థితులను హేతుబద్ధంగా ఆలోచించి, సోపపత్తికంగా నిరూపించి ఈ విషయంలో కృతకృత్యులయ్యారు. పాఠకులను మెప్పించారు.

కథ

# ఎప్పుడొస్తావు నాన్నా!!??

**ఎం.ఆర్. అరుణ కుమారి,** చిత్తూరు. ఫోన్ : 81215 23835

**నాన్నా!!**

**బాగున్నావా? నేను బాగా ఉన్నాను నాన్నా!** బాగా చదువుకుంటున్నాను. ఇవాళ మా స్కూలు యానివర్సరీ నాన్నా! నాకు ఎన్ని ప్రైజులు వచ్చాయో తెలుసా? ఇదిగో చూడు నాన్నా. స్పోర్ట్స్ లో, చదువులో, ఎస్సే రైటింగ్ లో, ఎలక్యూషన్ లో .... అసలు స్కూల్లో ఏ పోటీ పెట్టినా నాకే ఫస్ట్ ప్రైజ్ కదా నాన్నా! కల్చరల్ ప్రోగ్రామ్స్ లో నా డాన్స్, నా పాట ఉండి తీరాల్సిందే! అదంతా నీకు చూపించడానికి అమ్మ ఫోటోలు తీయించి ఆల్బమ్ చేయించి పెడుతూనే ఉంటుంది. మరి ఇవన్నీ చూడడానికి ఎప్పుడు వస్తావు నాన్నా?

నాన్నా! నీకు తెలుసా? మా క్లాస్ లో పిల్లలకు, నా ఫ్రెండ్స్ కే కాదు వాళ్ళ అమ్మానాన్నలకు కూడా నన్ను చూస్తే చాలా జెలసీ అట. అందుకే వాళ్ళు అలాంటి మాటలతో పొడుస్తున్నారని... పట్టించుకో వద్దని...అమ్మమ్మ, తాతయ్య... ఏడుస్తున్న అమ్మను ఓదారుస్తుంటారు. అమ్మను ఓదారుస్తూనే అమ్మమ్మ తనూ కళ్లనీళ్లు పెట్టేసుకొనేది. మా స్కూల్లో ఏ ఫంక్షన్ కు, పేరెంట్స్ మీటింగ్ కు వచ్చినా... ఇంటికి తిరిగి వచ్చాక అమ్మ బాధపడుతూనే ఉండేది. ఒక్కోసారి రానని కూడా అనేది. తాతయ్యను వెళ్లమనేది.

**"నేను వెళ్లడానికి ..నువ్వు వెళ్లడానికి తేడా లేదటమ్మా? నువ్వు కూడా వెళ్ళక పోతే అభి బాధపడదూ? పోనీ ఇద్దరం వెళ్దాం పద ."** అనేవారు తాతయ్య

నేను డాన్స్ చేస్తానని, పాట పాడతాను అని తెలిస్తే అమ్మమ్మ కూడా వచ్చేది. అవును నాన్నా! చాలామంది వాళ్ళు నన్ను మెచ్చుకుంటూనే..... అభినందిస్తూనే.. గులాబీ పక్కన ముల్లులా... ఓ మాట అనేసేవారు. ఆ ముల్లు మాకు బాగా గుచ్చుకొనేది. మా ఆనందమంతా నీళ్ళు చల్లిన పాలపొంగులా అణగారిపోయేది.

"వాళ్ల నాన్న లేకపోయినా అభి ఎంత యాక్టివ్ గా ఉంటాడో చూడండి. గుడ్ బాయ్ !"

నాన్నా! నాన్న లేకపోతే పిల్లలు యాక్టివ్‌గా ఉంటారో లేదో తెలీదుగానీ నేను మాత్రం బాగా చదవడానికి, క్లాసులో ఫస్ట్ ర్యాంకు తెచ్చుకోవడానికి, అన్ని పోటీల్లో పాల్గొని ఫస్ట్ ప్రైజులు తెచ్చుకోవడానికి నువ్వే కారణం నాన్నా! ఆ సీక్రెట్ ఎవరికీ తెలియదు.

నిజానికి మొదట్లో నేను ఏ పోటీలో పాల్గొనడానికి ఆసక్తి చూపే వాడిని కాదు. చదువులో కూడా రానురాను యావరేజ్ అయిపోయాను. అందరు పిల్లల్లా చురుగ్గా కాకుండా నేను చాలా స్తబ్దుగా వుండేవాడ్ని. నన్ను చూసి అమ్మ, అమ్మమ్మ, తాతయ్య చాలా బాధ పడేవారు.



"నేను బతుకుతున్నదే వీడి కోసం. వీడిలా అయిపోతున్నాడు ఏమిటి?" అని అమ్మ బాగా ఏడ్చేది. అమ్మ ఏడుస్తుంటే నాకు బాధగానే ఉండేది కానీ ఆమెను ఓదార్చే మెచ్యూరిటీ, వయసు నాకు లేవు. నేను మనసులోనే బాధపడుతూ మౌనంగా మరింత ముడుచుకు పోయేవాడిని. అప్పుడు తాతయ్య మెల్లమెల్లగా అయినా అమ్మను మందలించేవారు.

"వాడి కోసమే నువ్వు బతుకుతుంటే.. వాడిని ఎలా పెంచాలి? నువ్వు ఏడుస్తూ ..వాడిని ఏడిపిస్తూనా? వాడి తండ్రి పులి లాంటి ఆర్మీ జవాన్ అని మర్చిపోతున్నావా? అతను వచ్చి **"నా బిడ్డను ఇలా దద్దమ్మలా పెంచారేమిటి?" అని అడిగితే ఏం జవాబు చెప్తాం నువ్వైనా? మేమైనా? పులిబిడ్డ పులి లానే పెరగాలి కదా!"**

రోజూ సాయంత్రాలు నన్ను పార్కుకు తీసుకెళ్లేవారు తాతయ్య. అక్కడ పిల్లలతో కలిసి ఆడుకుంటాను అని. కానీ నేను వెళితే కదా. పార్క్‌లో జారుడు బండ, ఉయ్యాల, సీ-సా...ఏదీ నన్ను ఆకర్షించేది కాదు. నాన్నల చేతుల్లో... నాన్నలతో ఆడుకుంటూ నవ్వే పిల్లలను చూస్తూ కూర్చునేవాడిని తాతయ్య పక్కన బెంచీ మీద. తాతయ్య తన ఫ్రెండ్స్ తో కాసేపు మాట్లాడాక తిరిగి ఇంటికి వచ్చేసేవాళ్ళం.

**"వీడు... వీళ్ళ నాన్న పైన దిగులు పెట్టుకున్నాడమ్మా! ఏం చేయాలో తెలియటం లేదు. పార్కులో కూడా తన ఈడు పిల్లలతో.. ఎవరితోనూ కలవడు. ఆడుకోడు. నా ఫ్రెండు నీకు తెలుసు కదా రాఘవ! ఓసారి సైకియాట్రిస్ట్ దగ్గర చూపిద్దాం అంటున్నాడు."** తాతయ్య అమ్మతో అన్నాడు.

అవును నాన్నా! నాకు నిన్ను చూడాలని చాలా ..చాలా కోరిక! నువ్వంటే ఎంత ఇష్టమో... నువ్వు రాలేదని అంత దిగులు.

బడిలో, పార్క్ లో, ఇళ్ల దగ్గర ,రోడ్డులో ...నా వయసు పిల్లలు, నాకన్నా చిన్నవాళ్లు, పెద్దవాళ్లు కూడా వాళ్ళ నాన్న వేలు పట్టుకొని

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (24) హైదరాబాద్ ఫిబ్రవరి : 2022



నడుస్తూ.. బండిమీద నాన్నలను హత్తుకుని నవ్వుకుంటూ... కబుర్లు చెప్పుకుంటూ వెళ్తుంటే అలా చూస్తుండిపోయేవాడ్ని. నాన్నలు తమ పిల్లల్ని ఎత్తుకొని ముద్దులాడుతుంటే మనసులో బాధ నా కళ్ళలో నీటి పొరలయ్యేవి. తండ్రి పరిష్వంగ సుఖము అనుభవించకుండానే.. అసలు తండ్రిని చూడకుండానే నా బాల్యం గడచిపోయిందని నాకిప్పటికీ బాధే!

**"నాన్న కావాల"**ని ఎంత ఏడ్చేవాడ్నో తెలుసా నాన్నా! నువ్వు లేవని.. అందుకే రాలేదని నా స్నేహితులు కూడా హేళన చేస్తుంటే బాధ ఎక్కువై కోపం, ఉక్రోషం వచ్చేసేవి. అదంతా ఇంట్లో అమ్మ మీద చూపేవాడ్ని. ఏం చేస్తున్నానో తెలియకుండా ఇల్లు పీకి పందిరేసేవాడ్ని. ఆట వస్తువులు, బొమ్మలు.. వస్తువులు.. ఇల్లంతా విసిరికొట్టేవాడ్ని. ఫ్లవర్ వాజులు, గాజు బొమ్మలు నేలకేసి కొట్టి పగలగొట్టే వాణ్ని. ఉన్మాదిలా అరిచేవాణ్ణి.

**"నాన్న కావాలి ...నాకు నాన్న కావాలి.."** అని గట్టిగా ఏడ్చేవాణ్ని. ఒకోసారి జ్వరం వచ్చేసేది.

అమ్మ... అమ్మమ్మ ...నన్ను పట్టుకొని, నాకు సర్దిచెప్పలేక...బాగా బాధపడేవారు. తాతయ్య ఆ సమయంలో నన్ను గదమాయించినా.. తర్వాత తల పట్టుకొని మౌనంగా బాధపడుతూ కూర్చునేవారు.

**"మా బిడ్డ జీవితం ఇలా అయిందని ఏడవాలా? నీ బిడ్డ ఇలా అవుతున్నాడని ఏడవాలా?"** అమ్మమ్మ ...అమ్మ ని పట్టుకుని ఏడ్చేది.

**"మేమేం పాపం చేశామని మాకీ శిక్ష దేవుడా?"** అని అమ్మమ్మ రోజూ దేవుడి పటం ముందు దీపం పెడుతూ బాధ పడడం నేను వింటూనే ఉండేవాడిని.

ఆ సమయానికి నేను నీ ఫోటో ముందు నిలబడి **"ఎప్పుడు వస్తావు నాన్నా? త్వరగా రా నాన్నా! ఐ లవ్ యు నాన్నా!"** అని చెప్తూ ఉండేవాడ్ని.

**"లాభం లేదు శశీ! రాఘవ చెప్పినట్లు సైకియాట్రిస్ట్ దగ్గరికి వెళదాం. లేకపోతే ఏమైపోతాడో...?"** తాతయ్య తన బాధను, భయాన్ని తనలోనే దాచుకుని పైకి గంభీరంగా ఉండేవారు.

సైకియాట్రిస్ట్ దగ్గరకు చాలాసార్లు వెళ్ళాము. డాక్టర్ అంకుల్ చాలా బాగా మాట్లాడేవారు. కొన్నిసార్లు తాతయ్య తో, కొన్నిసార్లు నాతో, కొన్నిసార్లు అమ్మతో, కొన్నిసార్లు అమ్మ, నాతో కలిసి మాట్లాడేవారు. ఆ అంకుల్ అప్పుడు ఏం చెప్పారో, నన్నేం అడిగారో, నేనేం చెప్పానో.. అదంతా నాకు గుర్తులేదు కానీ ఆయన చివరగా చెప్పిన మాటలు మాత్రం నా మనసులో ఇప్పటికీ శిలాక్షరాల్లా ముద్రించుకుపోయాయి.

**"నువ్వు ...అమ్మ, తాతయ్య చెప్పినట్లు చక్కగా నడుచుకొని.. బాగా చదువుకొని.. ఆడుకొని.. ర్యాంకులు, ప్రైజులు తెచ్చుకున్నావనుకో! అందరూ నిన్ను "శభాష్" అని మెచ్చుకుంటారు కదా! అదంతా మీ నాన్నకు.. మీ అమ్మ.. తాతయ్య చెప్తుంటారు కదా ..అదే ఉత్తరాలు రాస్తుంటారు కదా ! అది విని మీ నాన్న త్వరగా వచ్చేస్తారు. నువ్వు అన్నింట్లో ఫస్ట్ ఉంటే నాన్నకు హ్యాపీ కదా! నాన్న వస్తే నీకు హ్యాపీ కదా! అభీ! ఒకటి గుర్తు పెట్టుకో! మన బలహీనతనే మన బలంగా మార్చుకోవాలి. అప్పుడు మనమే విజేతలమవుతాము."**

ఇప్పుడు నీకు తెలిసిందా నాన్నా! నా విజయ రహస్యం. అవును నాన్నా! అప్పటి నుండి నేను బాగా అంటే బాగా మారిపోయాను. అమ్మను, అమ్మమ్మ, తాతయ్య లను తర్వాత ఎప్పుడూ విసిగించనూ లేదు. నా పట్ల ఉదాసీనంగా.. ఒకింత జాలిగా ఉండే నా టీచర్లు.. నన్ను మెచ్చుకునేలా ...' నోటితో పొగుడుతూ నొసలుతో వెక్కిరించే' వాళ్లు అసూయపడేలా నేను ఎదుగుతూ వచ్చాను. నాన్నా! నువ్వు త్వరగా రావాలని ఒక చిన్న స్లిప్ టెస్ట్‌లో కూడా నాదే ఫస్ట్ మార్కులు వచ్చేలా పట్టుదలగా చదివేవాడిని. ప్రోగ్రెస్ కార్డు ఇచ్చిన ప్రతిసారి, %ప్రైజ్ వచ్చిన ప్రతిసారి.. నీ ఫోటో ముందు నిలబడి...

**"నాన్నా! చూసావా !నేను ఫస్ట్ వచ్చాను కదా. మరి నువ్వు ఎప్పుడు వస్తావు?"** అని ప్రశ్నించే వాడిని.

మరీ చిన్నప్పుడు ఫోన్ రిసీవర్ తీసుకొని **"నాన్నా! ఎప్పుడు వస్తావు?"** అని అడిగేవాడిని.కొంచెం పెద్దయ్యాక నీతో మాట్లాడాలని మారాం చేసేవాడ్ని.

**"నాన్న దగ్గర ఫోన్ ఉండదు. నాన్న దేశ సరిహద్దుల్లో ఎక్కడెక్కడో తిరుగుతూ ఉంటాడు. నీతో మాట్లాడమని... ఫోన్ చేయమని ..నాన్నకు ఉత్తరం రాస్తాలే!"** దాదాపు ఇవే మాటలు చెబుతూ ఉండేవారు అమ్మ, తాతయ్య.

మాకు దసరా, సంక్రాంతి, వేసవి సెలవులు ఇచ్చినప్పుడు **"ఇప్పుడు సెలవులు కదా! మరి నాన్నకు సెలవులు ఇవ్వలేదా? నాన్న ఎప్పుడు వస్తారు?"** అని తాతయ్యను అడిగేవాణ్ణి.

**"నాన్న దేశాన్ని రక్షించే పెద్ద పనిలో ఉన్నాడు కదా! అందుకని ఎక్కువ సెలవు ఇవ్వరు. అయినా నీ కోసం సెలవు తీసుకుని**

**వస్తాడు!"** అని బుజ్జగించే వారు. బయటకు తీసుకెళ్లి స్వీట్స్, కేకులు, బొమ్మలు కొనిచ్చేవారు. ఐస్ క్రీం, ఫ్రూట్ సలాడ్ తినిపించేవారు. స్వీట్లు దాచిపెట్టి... 'నాన్న వచ్చినప్పుడు తినిపిస్తా' అనేవాణ్ణి.

**"నాన్న వచ్చేవరకు అవి పాడైపోతాయి కదా! అయినా నాన్నే నీకు బోలెడు మిఠాయిలు, బొమ్మలు, బట్టలు తెస్తారు. ఆ మిఠాయి నువ్వు నీ ఫ్రెండ్స్ కు కూడా ఇద్దువు గాని!"** అమ్మ ఈ మాటలు ఎన్ని వందలసార్లు అనేదో నేను లెక్కపెట్టలేదు. ఎందుకంటే రాత్రిళు ్ళ నాకు అమ్మ పాడే జోల పాట కూడా అదే !

**"నాన్న వస్తారు! నీకు బొమ్మలు, బట్టలు తెస్తారు!"** గద్గద స్వరంతో గుండెలోని నీ పైన ప్రేమనంతా మాటల్లో పాటగా పలికించేది.

ఆ లాలి పాట వింటూ... వింటూనే ..పెద్దవాడినైపోయాను. పెద్దవాడయ్యాక కూడా నిద్రలో, మెలకువలో.. కలవరింతల్లో, పలవరింతల్లో.. నువ్వొస్తావన్న మాట అమ్మ నోట వింటూనే ఉన్నాను.

**"ఎప్పుడు వస్తావు నాన్నా!"** అని నేను చిన్నప్పుడు అమాయకంగా, ఆశగా, ఆతృతగా అడిగేవాడిని. ఇప్పుడా అమాయకత్వం లేదు ఆశ, నమ్మకం తప్ప! మరి నేను పెద్దవాడినైపోయాను కదా నాన్నా! పెద్దయ్యాక చాలా విషయాలు తెలుసుకున్నాను. ఆర్మీలో కూడా ఏడాదికోసారి అందరికీ దొరికే సెలవులు నీకు మాత్రమే ఎందుకు దొరకలేదో, నువ్వు ఎందుకు రాలేదో.. అన్న ఆలోచనకు సమాధానం ... నన్ను చాలా పీడించింది.

కళ్ళల్లో, కడుపులో ..పెట్టుకొని చూసుకోవాల్సిన ఇంటికోడలు.. నిండు చూలాలు ..అమ్మను నిర్దాక్షిణ్యంగా ఇంట్లో నుంచి గెంటేసిన .. పెదనాన్న, పెద్దమ్మలు.. ... నిస్సహాయ స్థితో, నిర్లక్ష్యమో.. పట్టించుకోని నానమ్మ, అత్తయ్యలు...వీళ్ళనంతా.. ఒకసారి చూడాలని నాకు చాలా ఆశ!! అవును నాన్నా! నువ్వు వచ్చాక.. నీతో కలిసి వెళ్లి ..వారిని కలవాలి ... 'ఇదిగో మా నాన్న వచ్చాడు!' అని గర్వంగా వాళ్ల ముందు నిలబడాలని నాకు చాలా కోరిక .నా కోరిక తీర్చడానికి 'ఎప్పుడొస్తావ్ నాన్నా!' అని ఆర్తిగా అడుగుతూనే ఉ న్నాను కదా నాన్నా!

నానమ్మ ఇంకా బతికే ఉందో లేదో తెలీదు గానీ పాపం అమ్మమ్మ చనిపోయింది.

**"ఏ మనిషైనా ...ఏడేండ్లు ఆచూకీ లేకపోతే.. ఆ మనిషి చచ్చినట్లే లెక్క అంటారు. ఎన్నేళ్ళాయా... ఇంకా నీ కూతురు ని ముత్తయిదువ గానే ఉంచుతావా?"** అని బంధువులు మొహం మీదే అడుగుతుంటే వినివిని కుమిలిపోయింది. కూతురు దుస్థితికి వగస్తూ.. పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు, బంధువుల ఇండ్లకూ.. అమ్మ, అమ్మమ్మ వెళ్ళేవారే కాదు. తప్పనిసరైతే తాతయ్య వెళ్ళి వచ్చేవారు.

అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క గారాల కూతురు ...పెళ్లి అయిన రెండేళ్లకే ...ముండా ..ముత్తైదువా కాకుండా..



జీవితంలో ఏ సుఖసంతోషాలు, ఆనందాలు అనుభవించకుండా మోడులా నిలిచిన కూతుర్ని చూస్తూ.. చూస్తూ.. వేదన పడి..పడీ.. ఇక పడే సత్తువ లేకుండా వెళ్ళిపోయింది హఠాత్తుగా గుండెపోటుతో. నిజానికి ఆమె మనసులో బాధను, దుఃఖాన్ని అదిమి, అదిమీ... ఇక చోటులేక గుండె బద్దలై పోయి ఉంటుంది.

అమ్మమ్మ మరణం అమ్మను కుంగదీసింది. అమ్మ కోసం, నా కోసం... తాతయ్య గుండె దిటవు చేసుకున్నారు. యాభై ఏళ్ల పాటు తనతో నడిచిన జీవన సహచరి ఎడబాటు తట్టుకోవడం ఎంత కష్టమో! అయినా ఆయన గుండె నిబ్బరమే మాకు శ్రీరామరక్ష అని ఆయనకు తెలుసు. అందుకే ఆయన ఆ బాధను తట్టుకొని నిలబడ్డారు.

ఆయన కన్నా ...ఆయన కూతురు ఇంకా గొప్పదని నా భావన. పెళ్లయి రెండేళ్లు! ఆ రెండేళ్లలో భర్తతో గడిపింది మహా అయితే ఆరు నెలలే! అయినా ఆమె ఇప్పటికీ భర్త కోసం నిరీక్షిస్తూనే ఉంది. వస్తాడన్న ఆశను, నమ్మకాన్ని రవంత కూడా సడలించలేదు.

**"చిన్న వయసు! జీవితంలో ఏం అనుభవించావని? మళ్ళీ పెళ్లి చేసుకో!"** అని శ్రేయోభిలాషులు ఎన్ని విధాలుగా చెప్పినా అమ్మ ఒప్పుకోలేదు.

పిల్లాడ్ని తాము పెంచుకుంటామని ..పెళ్లి చేసుకోమని అమ్మమ్మ, తాతయ్య కూడా బతిమిలాడారట. అయినా అమ్మ ఒప్పుకోలేదు.

**"ఆయన వస్తారు ! ఆయన వస్తారు!"** అంటూనే ఉంది ఆశగా. తన ఎదురు చూపుల్ని గుమ్మానికి తోరణాలు చేస్తూనే ఉంది. తన నమ్మకం అనే మొక్కకు పూసి వాడిపోయిన నిరాశాపూలను తుంచేస్తూ .. కొంగొత్త ఆశల చిగుళ్లు తొడిగిస్తూనే ఉంది. నీ అడుగుల సడి కోసం ఆమె గుండె చప్పుడు చేస్తూనే ఉంది. అది నిశ్శబ్దం అయ్యే లోపు నువ్వు తప్పక రావాలి నాన్నా! తాతయ్యకూ వయసైపోతోంది.



ఆయన మనశ్శాంతిగా వెళ్లడానికి... అమ్మమ్మ ఆత్మశాంతిగా ఉంచ డానికి... నువ్వు రావాలి నాన్నా!

బీటెక్‌లో నేను యూనివర్సిటీ ఫస్ట్ వస్తాను నాన్నా! నాకు గోల్డ్ మెడల్ వస్తుంది. దాన్ని..ఏ ప్రముఖ అతిథి చేతో కాదు.. నీ చేతితోనే తీసుకుంటాను. చెప్పు నాన్నా! వస్తావు కదూ! ఎప్పుడు వస్తావు నాన్నా? దేశంకోసం జీవితంలోని సకల సుఖసంతోషాలు, యవ్వనం.. త్యాగం చేసిన యోధునివి నువ్వు. ఐ లవ్ యు నాన్నా!

నాన్నా! నీ ఫోటో బాగా పాతబడి పోతే.. ఫోటోలోని నీ మిలిటరీ దుస్తులు మాసిపోయినట్లు అనిపిస్తుంటే నాకేం బాగా అనిపించలేదు. ఇప్పుడు టెక్నాలజీ బాగా డెవలప్ అయింది కదా నాన్నా! ముందులా నెగటివ్ ఉంటేనే కాదు ఫోటోనుండి కూడా ఫోటో ప్రింటు తీయవచ్చు. నీ ఫోటో తీసుకెళ్ళి కొత్త ప్రింట్ చేయించి మంచి ఫ్రేమ్ వేయిద్దామని స్టూడియోకి తీసుకెళ్ళాను. అక్కడ అతను ఎన్ని కాపీలు అని అడిగితే అనుకోకుండానే పది అన్నాను. ఇంటికి తెచ్చాక **"ఎందుకురా ఇన్ని కాపీలు చేయించావు? అందరికీ పంచుతావా ఏమిటి?"** అని తాతయ్య సరదాగా అడిగారు.

ఎవరో ..ఎవరో ఏమిటి ఫోటో లో నుండి నువ్వే చెళ్ళున చర్నాకోల తో కొట్టినట్లు ఒక ఫీలింగ్ కలిగింది నాన్నా!

ఏదో ఒక తెలియని అనిశ్చితి.. అశాంతి!

**"పంచుతావా? పంచుతావా?"**... చెవుల్లో సముద్రపు అలల్లా ఘోష!

ఒక రోజంతా తీవ్రంగా ఆలోచించాక నేనేం చేయాలో స్ఫురించింది.

**"ఇంతవరకు మీరు ఎందుకు ఇలా చేయలేదు? అసలు నాన్న కోసం మీరేం చేశారు?"** అని ప్రశ్నించాను. తాతయ్య , అమ్మ నివ్వెరపోయారు.

ఆ ప్రయత్నాలు మీ పెదనాన్న చేసి ఉండాల్సింది. ఆయన చేయలేదు. పైగా మీ అమ్మను ఇంటి నుండి వెళ్లగొట్టారు. మీ నాన్న మాకు కొత్త సంబంధం. ఆయన స్నేహితులు తెలీదు. అయినా అప్పుడు ఆయన పని చేస్తుండిన డెహ్రాడూన్ రెజిమెంట్‌కు నా ఫ్రెండ్ రాఘవ తాతయ్యతో కలిసి వెళ్ళాను.

**"ఎదురు చూడడం తప్ప ఏం చేయలేము! మా ప్రయత్నం మేము చేస్తూనే ఉన్నాము. తెలిస్తే తప్పక తెలియచేస్తాం"** అన్నారు అధికారులు. ఇంకేం చేయాలో నాకు తెలియలేదు. మీ నాన్న పేరు తప్ప మీ ఇద్దరికీ ఆయన ఎప్పుడూ లేదు బాధగా చెప్పారు తాతయ్య. ఉన్నాడో ..లేడో కూడా తెలీదు. అటు మిలిటరీ గాని ఇటు ప్రభుత్వం కాని పట్టించుకున్న దాఖలా లేదు. ఉంటే ఈపాటికి ఏదో ఒక సమాచారం వచ్చేది కదా!

**"పట్టించుకునేలా నేను దఖలు చేస్తాను!"** బాధతో, కోపంతో, ఆవేశంతో నా రక్తం మరిగి పోయింది. మొదటిసారి నీ ఫోటో ముందు నిలబడి చిరునవ్వు నవ్వాను.

**"నువ్వు వస్తావు నాన్నా! నిన్ను రప్పించుకొంటాను!"** అంటుంటే నీ కళ్ళు.. నీ పెదాలపై చిరునవ్వు మెరిసినట్లు అనిపించింది.

సరిహద్దు గొడవలో శత్రు దేశానికి ఖైదీగా పట్టుబడ్డ ఒక ఆర్మీ జవాన్ను విడిపించ వలసిన బాధ్యతను విస్మరించిన వారిని.. అతని అతీగతి తెలుసుకోని బాధ్యతా రాహిత్యాన్ని, ఆ జవాన్ కుటుంబాన్ని పట్టించుకోని నిర్లక్ష్యాన్ని.. ప్రశ్నించబోతున్నాను. జిల్లా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో, ఆర్మీ వ్యవస్థతో.. నేను యుద్ధానికి సిద్ధం అయిపోయాను. ఎప్పటికైనా నిన్ను తీసుకురావడమే ..నేను సాధించాల్సిన విజయం! తనను నమ్మి చెయ్యందుకొన్న భార్య... తాను చూడకపోయినా పుట్టిన తన బిడ్డా... తన కోసం ఎదురు చూస్తూ ఉంటారన్న ఆశ ...వాళ్ళను చూడాలన్న నీ కోరిక నీ జీవన జ్యోతిని... శత్రుశిబిర వడగాల్పులు ఆర్పలేవు. ఆరనివ్వని నీ మనోధైర్య పోరాటంలో నువ్వే విజేతవు నాన్నా!

మనమంతా కలుసుకునే రోజు దగ్గర్లోనే ఉంది నాన్నా. మా ఇన్నేళ్ల ఆవేదనను.. ఆగ్రహాన్ని.. ఆవేశాన్ని.. పొందికైన.. మాటలతో పొలైట్‌గా నా వేళ్ళు కంప్యూటర్ మీద టైపు చేయడం ప్రారంభించాయి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (27) UGC Care List Approved Journals
హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# బొమ్మ హేమాదేవి నవలలు - సామాజికాంశాలు

**డా. సయ్యద్ ఆఫ్రీన్ బేగం**, ఫోన్ : 9908028835



నవలలు అనేక రకాలు. కొందరు రచయితలు కొన్ని అంశాలనే ఎన్నుకొని వాటిని మాత్రమే బాగా రాయగలుగుతారు. అన్ని రకాల విషయాలను బాగా రాయగలిగే రచయితలు కొందరే ఉంటారు. అందులో బొమ్మ హేమాదేవి ఒకరు. ఆమె నవలల్లో అనేక రకాల విషయాలు కనిపిస్తూ ఉంటాయి. ఆమె రాసిన **మహానంద, లవ్‌స్టోరీ** నవలలు పరిశీలిస్తే వాటిలో అన్ని విషయాలతో పాటు సామాజికాంశాలు ఎక్కువగా కనిపిస్తాయి. ముందుగా **మహానంద** నవలలోని సామాజికాంశాలను చర్చిద్దాం.

**మహానంద**

ఈ నవలలో సామాజికంగా మహిళలపై జరుగుతున్న వివక్ష ఎక్కువగా కనిపిస్తుంది. మహిళలపై చిన్నచూపు, అణచివేతను మనం ప్రధానంగా ఈ నవలలో చూడవచ్చు. ఓ ఇంటి కథను ప్రధానంగా ఈ నవలలో చిత్రించారు. ఆ ఇంట్లో మగ పెత్తనం ఎక్కువ. భార్య దూరంగా ఉండి భర్త పిలిచిన పిలుపు వినబడకపోయినా భర్తలో అహం పెరిగిపోతుంది. పైగా భార్యలోనే అహం పెరిగిపోతుందని భర్త ఆవేశపడతాడు. ఆ ఇంట్లో ఆడవాళ్లు కట్టడిలో ఉండాల్సిందే. ఏం జరిగినా, ఎంత జరిగినా ఆడవాళు ఆ ఇంట్లో నోరు మెదపరు. ఇలాంటివి సభ్య సమాజంలో జరుగుతున్న అంశాలే.

మగవాళ్లు ఆవేశపడడమే కాదు, ఆడవాళ్లపై చేయిచేసుకోవడం కూడా ఆ ఇంట్లో సర్వసాధారణం. పెద్దవాళ్లు చేసే చర్యలకు పిల్లలు కూడా అలవాటు పడిపోతున్నారు. మగపిల్లలు చిన్నతనంనుండే కఠినంగా మారిపోతున్నారు. ఆడ మగ తారతమ్యాలు ఇప్పటినుండే అలవరచుకుంటున్నారు. సామాజికంగా ఇలాంటి అంశాలు పిల్లలపై ఎలా ప్రభావం చూపుతాయో చక్కగా చిత్రించారు.

ఆ ఇంట్లో ముసలాడు కూడా తన పెళ్లాన్ని కొడతాడు. కనీసం కొడుకు ఎందుకు కొడుతున్నావని మాటవరసకైనా అడగడు. ఆడదై పుట్టినందుకు పడి ఉండాల్సిందే అని తల్లి పట్ల కూడా కొడుకు చూపే వివక్ష. ఆడబతుకులు ఇంతేలే అని ఆ ఇంటి ఆడవాళ్లు అనుకోవడం సాధారణ విషయం. సమాజంలో అనేక చోట్ల ఇప్పటికీ ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి సామాజికాంశాలను పొందుపరిచి నవల ప్రారంభంలోనే చదువరులను ఆకట్టుకున్నారు.

ఆ ఇంటి మనిషైన కృష్ణవేణికి ఇలాంటివి నచ్చవు. ఆ ఇంట్లో జరుగుతున్న ఇలాంటి సంఘటనలను ఎప్పటికప్పుడు ఎదుర్కోవాలని ఆవేషపడి పోతుంది. కానీ ఏం చేయాలో, వాటిని ఎప్పటికప్పుడు ఎలా తిప్పికొట్టాలో అర్థంకాక మథనపడిపోతూ ఉంటుంది. ఇలాంటివి కూడా మనం సమాజంలో చూస్తూవుంటాం.

కృష్ణవేణి చెల్లెలు కార్తీక మాత్రం అక్కయ్య భావాలకు భిన్నంగా ఉంటుంది. సమాజం అంత సులభంగా మారదని, ఉన్నన్ని రోజులు బతికి ఆ తర్వాత వెళ్లిపోయేదానికి ఇన్ని ఆలోచనలు అవసరమా అని వేదాంత ధోరణిలో మాట్లాడుతుంది. ఇలాంటి విభిన్న సామాజికాంశాలను తన నవలలో ప్రవేశపెట్టి పాఠకులను ఆకట్టుకున్నారు రచయిత్రి.

గర్భంతో ఉన్న సుభద్రను పుట్టింటికి పంపించమని ఆమె తండ్రి అడిగాడు. తనకు కట్నం కింద ఇవ్వవలసిన స్కూటర్ ఇంకా ఇవ్వలేదన్న కోపం ప్రదర్శించాడు సుభద్ర భర్త. తన తండ్రిని అడగమన్నాడు. సుభద్ర తండ్రి తన వియ్యంకుడిని అడిగాడు. అతడు ససేమిరా అన్నాడు. సుభద్ర తండ్రికి కూడా కోడలుంది. ఆ కోడలు తండ్రితో కూడా సుభద్ర తండ్రి ఇదేవిధంగా ప్రవర్తిస్తాడు. సమాజంలో పేరుకుపోతున్న కుసంస్కారాన్ని ఈ సన్నివేశం ద్వారా చక్కగా వివరించారు.

గర్భవతిగా ఉన్న సమయంలో ఏ ఆడపిల్లకైనా పుట్టింటికి వెళ్లాలనే కోరిక ఉంటుంది. ఆ కోరిక తీరక పోవడంతో సుభద్ర బాధ పడింది. ఇలా సమాజంలో జరుగుతున్న అంశాలను అందరికి అర్థమయ్యేలా వివరించారు. సుభద్ర పుట్టింటినుండి పండ్లు, కూరగాయల బుట్టలు వచ్చాయి. కనీస కృతజ్ఞతా భావం కూడా చూపించకుండా అదేం పెద్ద ఇదా అన్నట్లు మాట్లాడే వియ్యపురాళ్లు కూడా సమాజంలో ఉంటారని ఈ సన్నివేశం ద్వారా గుర్తు చేశారు.

శారద ఇంటికి వెళ్లిన కృష్ణవేణి పేపర్ చదువుతూ ప్రశాంతంగా ఉన్న శారదను చూసి కన్నీళ్లు పెట్టుకుంది. కారణం అలాంటి అవకాశం తన

ఇంట్లో లేకపోవడం. తన ఇంట్లో ఆడవాళ్లందరు బానిసలుగా బతకాలి. స్వేచ్ఛను మరచిపోవాలి. కోరికలను వదలిపెట్టాలి. కృష్ణవేణి ఇంటికి, శారద ఇంటికి వ్యత్యాసాన్ని చక్కగా కళ్లకు కట్టినట్టుగా చూపించారు. శారదను చూడగానే కృష్ణవేణికి మనసు తేలిగ్గా ఉంటుంది. ఎన్నో బాధలు గుర్తుకు వస్తాయి. ఎన్నో ప్రశ్నలు పుట్టుకొస్తాయి. తన అన్నయ్య చదువుకొని ఉన్నత స్థానంలో ఉన్న ఇంజనీర్. అయినా పెళ్లాన్ని ఎందుకు కొడతాడు అన్న ప్రశ్న కృష్ణవేణి అడిగినా ఇది సమాజంలో ఎందరికో కలుగుతున్న సందేహం. సామాజికాంశంలో భాగమైన ఈ ప్రశ్నను కృష్ణవేణి పాత్ర ద్వారా అడిగించడం రచయిత్రి సమయస్ఫూర్తికి నిదర్శనం. కృష్ణవేణి ప్రశ్నకు సమాధానం పురుషాహంకారమని, స్త్రీల బలహీనతలు అని చెప్పిన సమాధానాలు సమాజంలో అనేకమందిని ఆలోచింపజేస్తాయి.

కృష్ణవేణికి సంబంధం కుదిరింది. కుదిరింది అనడం కంటే కుదుర్చారు అంటే బాగుంటుందేమో. వరుడికి వయసు 40 సంవత్సరాలకు పైగా ఉంటుంది. పైగా రెండవ వివాహం. ధనవంతుడు కావడం వలన కృష్ణవేణి కుటుంబ సభ్యులకు ఈ పెళ్లి చేయడానికి అభ్యంతారాలు లేవు. పైగా వరుడు అసలు కట్నం అవసరం లేదనడం వలన ఇంకా పెళ్లికి తొందరే గానీ అభ్యంతారా లేముంటాయి. ఆస్తిపాస్తులుండి, కట్నం వద్దన్న సంబంధాన్ని ధనవంతులైన ఆడపిల్లల తల్లిదండ్రులే ఎగిరి గంతేసి చేసుకుంటుంటే ఇక మధ్యతరగతి వాళ్ల సంగతి ఏం చెబుతాం. డబ్బుల సంగతి ఎలా ఉన్నా కనీసం ఆడపిల్ల ఇష్టాయిష్టాలను కూడా తెలుసుకోకుండా సంబంధం కుదుర్చుకోవడం శోచనీయం. ఇలాంటి సంఘటనలు సమాజంలో అనేకం జరుగుతున్నాయి. వాటినే తన నవలా వస్తువుగా మలచుకోవడం విశేషం.

ఇక రెండవ కూతురు కార్తీ పెళ్లి గురించి ఆ ఇంట్లో జరిగిన చర్చ మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అన్న మాటలు గుర్తుకు వస్తాయి. తోడబుట్టిన చెల్లి పెళ్లి చేయడానికి అన్నయ్య మాట్లాడిన మాటలు సమాజంలో వింటున్నవే. అలాంటి అన్నయ్యలు, తల్లిదండ్రులు సమాజంలో కనిపిస్తూనే ఉంటారు.

పెళ్లి గరించి భయపడుతూ పుట్టింటిని విడిచి వెళ్లడానికి ఆడపిల్లలు బాధపడుతూ ఉంటారు. కానీ ఇక్కడ కట్టడిలో బతుకుతున్నందున చేసుకోబోయేవాడి ఇంట్లో నైనాస్వేచ్ఛ, సంతోషం దొరుకుతాయని కార్తీ ఊహించుకోవడం పాఠకులకు ఆసక్తి కలిగించే అంశం. సుభద్ర తన ఆడపడుచులిద్దరికీ పెళ్లి చూపులు జరగబోతున్నందుకు సంతోషించడం, మగవాళ్ల ముందు ఎలా తలదించుకొని ఉండాలో, ఎలా వినయంగా ఉండాలో నేర్పించడం లాంటివి సమాజంలో అడుగడుగున కనిపించే అంశాలే. పెళ్లి చూపుల తంతు, ఆడపిల్లలు సిగ్గుపడడాలు, పెద్దవాళ్లు ప్రశ్నించడాలు సామాజిక అంశాలే కదా..

నలభై సంవత్సరాలు దాటిన వ్యక్తి పెద్దమ్మాయిని, మామూలు వయసులో ఉన్న వ్యక్తి చిన్నమ్మాయిని చూడడానికి ఒకేసారి వచ్చారు. పెళ్లి చూపులు అయిపోయాయి. కానీ పెళ్లి చూపులకు వచ్చిన వ్యక్తులు తాము చూడడానికి వచ్చిన అమ్మాయిలు కాకుండా వాడు చేసుకోవాలనుకున్న అమ్మాయి వీడికి, వీడు చేసుకోవాలనుకున్న అమ్మాయి వాడికి నచ్చారు. అది ఇక్కడ కొసమెరుపు. అదలా ఉంచితే ఆ విషయాన్ని కూడా ఆనందంగా స్వీకరించి పెద్దలు పెళ్లికి అంగీకరించడం ఆలోచింపచేసే అంశం. అందుకు కారణం పేదరికమా? దిగజారుడు తనమా? ఈ సన్నివేషం చాలామందికి చెంపపెట్టు. ఇలాంటి అనేకమైన సామాజికాంశాల సమాహారమే **మహానంది** నవల. ఇందులో రచయిత్రి అందించిన అనేక అంశాలు పాఠకులను ఆకట్టుకుంటాయి.

**లవ్‌స్టోరీ**

బొమ్మ హేమాదేవి సామాజాకాంశాలను ఏర్చి కూర్చి పాఠకులకు అందించిన మరో కానుక ఈ **లవ్‌స్టోరీ** నవల. వరుసనే ఆడపిల్లలే పుడుతూవుంటే ఒక్క మగపిల్లాడైనా పుట్టాలని కోరుకునేవారిని సమాజంలో అక్కడక్కడ చూస్తూనే వుంటాం. అలాగే వరుసగా మగపిల్లలే పుడుతూవుంటే ఈసారైనా ఆడపిల్ల కావాలని కోరుకునే వారిని కూడా మనం చూసేవుంటాం. ఈ సామాజికాంశాన్ని ఇతివృత్తంగా చేసుకొని ఈ నవలను రూపొందించారు రచయిత్రి బొమ్మ హేమాదేవి.

రాజాబేటీ నాన్న అతిథులతో మాట్లాడుతూ తన కూతురును రాజాబేటీ అని ఎందుకు పిలుస్తున్నారో చెప్పే వాస్తవమైన కథనం అందరినీ ఆకట్టుకుంటుంది. ఆయనకు మొదట ఆడపిల్ల పుట్టింది. ఆ ఇంట్లో అందరు శివభక్తులు కాబట్టి ఆ పాపకు శివాయిని అని పేరు పెట్టుకున్నారు. రెండవసారి అమ్మాయే పుట్టింది. ఆ పాపకు దాక్షాయణి అని, మూడవకాన్పులో పుట్టిన అమ్మాయికి పార్వతి అని పేర్లు పెట్టుకున్నారు. ఇలాంటివి సమాజంలో సహజంగా జరుగుతూనే ఉంటాయి. అలాంటి అంశాలను పొందుపరచి పాఠకులలో ఆసక్తి కలిగించారు.

నాలుగో కాన్పులోనైనా మగబిడ్డ పుట్టాలని ఇంట్లో అందరు మొక్కుకోవడం, తీర్థయాత్రలకు వెళ్లడంలాంటి సమాజంలో కనిపిస్తున్న అంశాలను రచయిత్రి తనదైన శైలిలో ఆవిష్కరించి పాఠకులను ఆకట్టుకున్నారు.

నాలుగవసారి కూడా ఆడపిల్ల పుట్టడం, తీర్థయాత్రలు తిరుగుతూ బృందావనంలో ఉన్నప్పుడు పుట్టడం వలన ఆ పాపకు రాధ అని పేరు పెట్టుకున్నారు. ఇది కూడా మనం సమాజంలో ఎక్కువగా చూస్తున్న అంశమే. ఆడపిల్ల పుట్టకూడదని అందరూ కోరుకుంటున్న తరుణంలో అందరిని ఎదురించి దర్జాగా ఈ లోకంలోకి వచ్చింది కాబట్టి ఆమెను రాజాబేటీ అని పిలుచుకుంటున్నారు. సమాజంలో

జరుగుతున్న ఇలాంటి సహజమైన అంశాలన పొందుపరిచి పాఠకుల కళ్లను అక్షరాల వెంట పరిగెత్తించారు.

రాజాబేటీ పుట్టడమైతే ఆడపిల్లగా పుట్టింది గానీ పెరగడం మాత్రం మగరాయుడిలా పెరిగింది. అన్ని మగ లక్షణాలే. పెళ్లిళ్ళకు పేరంటాలకు వెళ్లదు. మగవాళ్లు ఆడే అన్ని ఆటలు ఆడుతుంది. హార్స్‌రేస్‌లో, కార్‌రేస్‌లో కూడా కప్పులు సాధించింది. ఆడవాళ్లను చూస్తే సిగ్గు పడుతుంది.

ఇదిలావుండగా రాధాపురి జమీందారు కథ రాజాబేటీ కథకు భిన్నంగా ఉంది. ఆయనకు ముగ్గురు కొడుకులు. ఈసారైనా ఆడపిల్ల కలగాలని కలలుగన్నారు. అలా జరగలేదు. నాలుగవసారి కూడా మగపిల్లాడే పుట్టాడు. ఆ పిల్లాడికి జడవేయడం, గాజులు తొడగడం, ఆడపిల్లలకు వేసే బట్టలు వేసేవారు. ఆడపిల్ల లేని ముచ్చటను అలా తీర్చుకునే వారు. ఇంకేం ఆ అబ్బాయికి అన్ని ఆడలక్షణాలే వచ్చాయి. అబ్బాయిలను చూస్తే సిగ్గు పడతాడు. ఆడపిల్ల లాగే సుకుమారంగా తయారయ్యాడు.

మగపిల్లలు లేని తల్లి తండ్రులు తమ ఆడపిల్లకు మగ దుస్తులు వేసి మగబిడ్డ లేదన్న లోటు తీర్చుకోవడానికి ప్రయత్నించడం, ఆడపిల్లలు లేని తల్లి తండ్రులు తమ అబ్బాయికి ఆడ దుస్తులు వేసి ముచ్చట తీర్చుకోవడం సమాజంలో అనేకచోట్ల జరుగుతున్నదే. ఇలాంటి అంశాన్ని తీసుకోవడం వలన నవలలో విభిన్నత కనిపించింది. అంతేకాకుండా తల్లి తండ్రులు చేసే ఇలాంటి పొరపాట్ల వల్ల పిల్లలు ఎలా నష్టపోతారో వివరించింది ఈ నవల.

గోకుల్, రాధ (రాజాబేటి) గుడికి వెళ్లే సన్నివేషంలో సమాజంలో ఎదురయ్యే అంశాలను జోడించారు. హస్తసాముద్రికుడితో భవిష్యత్తు చెప్పించుకోవడం, అతను చెప్పిన విషయాలను జీర్ణించుకోలేక పోవడం సమాజంలో సహజంగా జరిగే అంశాలు. ఐతే ఈ సన్నివేశం ద్వారా ముందు ముందు నవలలో ఏం జరగబోతుందో అన్న ఉత్సుకత కలిగించారు. తనకు వివాహయోగం లేదని హస్తసాముద్రికుడు చెప్పడంతో గోకుల్ బాధ పడడం, రాధ మగరాయుడిలా ఊరడించడం నవలకు తగినట్టుగా మలచుకున్నారు రచయిత్రి. సమాజంలో ఇలాంటివాళ్ల స్వభావాన్ని రాధ పాత్రలో ప్రవేశపెట్టారు.

సమాజంలో జరిగే ఎడబాటు అనే అంశాన్ని రాధ, గోకుల్ పాత్రల ద్వారా చిత్రించారు. గోకుల్, రాధ కలిసి ఉన్నప్పుడు తెలియని లోటు, గోకుల్ బాంబే వెళ్లిన తర్వాత రాధకు అర్థమయింది. దూరమవడంలో ఉన్న వేదన సహజ సిద్ధంగా ఆవిష్కరించారు. అంతేకాదు తన కన్నా చిన్న వయసువున్న అబ్బాయిని వివాహం చేసుకోవచ్చా అనే అంశాన్ని కూడా రచయిత్రి ఈ నవలలో చర్చించారు.


ఈ నవలలో చందు పాత్రధారి కథ ద్వారా సమాజంలో ఉండే రకరకాల మనుషుల మనస్తత్వాలను కళ్లముందు కనిపించేలా రాయడం పాఠకులను వదలకుండా చదివించగలిగింది. చందు అన్నయ్య పెళ్లి చేసుకున్నాడు. సంవత్సరం కాగానే మరణించాడు.

చందు వదిన విధవగా మారింది. అలా ఓ సంవత్సరం తిరిగింది. ఇక్కడినుండి అసలైన సామాజికాంశాలతో నవల ఉత్కంఠభరితంగా సాగుతుంది. ఊరి పెద్దమనుషులు వచ్చి మీ వదిన మీ ఇంట్లో ఉండాలంటే నువ్వు పెళ్లి చేసుకోవాలని చందుకు చెబుతారు. చేసుకోకపోతే వదినను ఇంటినుండి పంపించేయమని చెబుతారు. అందుకు కారణం ఇద్దరు వయసులో ఉన్నవాళ్లు ఒక ఇంట్లో ఉండడానికి వీలులేదంటారు. వదిన మరిది కూడా ఉండ కూడదా అని చందు విస్తుపోతాడు. వదిన మరిదే కాదు అక్కా, తమ్ముడు, తండ్రి కూతురు కూడా ఒంటరిగా ఉండడానికి వీలులేదంటారు. ఇంత నీచంగా మాట్లాడుతున్న వాళ్లను చూసి చందు అసహ్యించు కుంటాడు. అంటే ఇక్కడ రచయిత్రి చందు పాత్ర ద్వారా సమాజంలోని నీచమైన వ్యక్తులను తూర్పారబట్టారు. పెళ్లి చేసుకోవడానికి చందుకు వారం రోజులు గడువిచ్చారు ఆ పెద్దమనుషులు.

చందు పెళ్లిచేసుకోవడానికి అమ్మాయిలను వెతకడం మొదలు పెట్టాడు. అక్కడ కూడా చందుకు చేదు అనుభవాలు ఎదురయ్యాయి. మరికొంతమంది నీచమైన మనుషులు కనిపించారు. వదినతో అక్రమ సంబంధం ఉన్నవాడికి పిల్లనెవరిస్తారని, వదిన ఇంట్లోవుంటే మా పిల్లేం సుఖపడుతుందని, వదినను ఇంట్లోంచి వెళ్లగొడితే పిల్లనిస్తామని ఇలా ఒక్కొక్కరు ఒక్కోవిధంగా మాట్లాడారు, నిందలు వేశారు.

సమాజం వేసిన నిందలు, సూటిపోటి మాటలు చందు తన వదినను పెళ్లిచేసుకోవలసిన పరిస్థితులకు దారి తీసాయి. దాన్ని కూడా ఈ సమాజం భరించలేకపోయింది. వ్యతిరేకించారు. చందు ఇంటి మీద రాళ్లు వేశారు. అతని పొలంలోకి పశువులను పంపారు. ఎద్దులను ఎత్తుకుపోయారు. చివరికి తన భార్యను అత్యాచారం చేసి చంపారు.

ఈ భాగం ఈ నవలకి ప్రాణం పోసింది. ఇలాంటి సామాజికాంశాలతో నవల చివరి వరకు సాగిపోతుంది. పాఠకులందరిని ఆద్యంతం చదివించ గలిగిన ఈ నవల రచయిత్రి బొమ్మ హేమాదేవి అందరిచేత అభినందనలు అందుకోగలిగింది.



ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (30) హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# పద్యమనోహరం - 27

## గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

వరంగల్, ఫోన్ : 994 901 3448



**"కవితల్ వ్రాయుట దొడ్డయన్ తలపుచే గాదర్థ మార్జింపగా దు, విశేషంబగు కీర్తికాసపడి యెందున్ గోరలేవింత, శై శవమాదిన్ గొనలెత్తె చిత్తమునకాంక్షల్ కానగారాదు హే తువు నీవే కలిగించినావని తలంతున్ గోపికావల్లభా!"**

భగవంతుని నిష్కామంగా సేవిస్తూ, ఒక విధమైన వైరాగ్య భావాన్ని మనసు నిండా నింపుకొని తమ జీవితతాన్ని భగవద్ధ్యానంతోనే కొనసాగిస్తూ, చేసే ప్రతి పనిని భగవత్ కైంకర్యం గానే భావన చేస్తూ సర్వం సమాజ సమర్పణం చేసి, నిస్వార్థంగా జీవించేవారు మాత్రమే రాయగలిగిన స్థాయిలో ఉన్న ఈ పద్యం రచించిన మహనీయుడు కీ.శే. గార్లపాటి రాఘవరెడ్డిగారు. ఇది వారు రచించిన ఒక అసంపూర్ణ శతకం. "గోపికావల్లభా!" లోనిది. ఇవికాక గార్లపాటి వారు "పరిదేవనము" "సావిత్రి" (ఖండకావ్యం), "రతి విలాపము"" (ఖండకావ్యం) రచించారు. ఈ రచనలన్నీ వారి అసాధారణ రచనా శక్తికి అద్దం పట్టేవే.

వరంగల్లు జిల్లాలోని తిరుమలగిరిలో 1895లో జన్మించిన గార్లపాటి రాఘవరెడ్డి గారు పై పద్యం ద్వారా కవులకొక ప్రత్యేక సందేశం ఇచ్చినట్లు ధ్వనిస్తున్నది. కవిత్వాన్ని రాసేవాళ్ళలో ఒక వైరాగ్యం ఉండాలన్న భావం ఇందులో కనబడ్డా అది అన్నింటినీ వదిలిపెట్టి నిరామయంగా జాతకాలన్న భావం కాదు. రెడ్డి గారు గోపికావల్లభునికి తన మనసులోని భావాన్ని వ్యక్తీకరిస్తూ "స్వామీ నేను కవిత్వాలు వ్రాయడంవల్ల గొప్పవాణ్ణయిపోతానని గానీ, దీనివల్ల ధనం సంపాదించి పెద్ద ధనవంతుణ్ణయి పోవాలనిగానీ, లేదా ఈ కవిత్వం రాయడం వల్ల విశేషమైన కీర్తి ప్రతిష్ఠలు వస్తాయేమోనన్న ఆకాంక్షతో గానీ, ఇటువంటి ఆశలుగాని కోరికలు లేవు. కేవలం నీవు నా హృదయంలో కవిత్వం రాయాలన్న కోరికలు కలిగించావనుకుంటున్నాను గాని వేరే కారణమే కానరావడంలేదు తండ్రీ! గోపికావల్లభా!" అని తనకు శైశవ కాలం నుండే స్వామిపై చక్కని కవిత్వం రాయాలన్న కోరిక ఉందని అది స్వామి వారిని అర్చన చేసే ఒక మార్గమన్న భావాన్ని కలిగించిందన్నమాట.

గార్లపాటి వారికి హిందీ, ఉర్దూ, సంస్కృతం వంటి పలు భాషల్లో పాండిత్యం ఉంది. ముఖ్యంగా హిందీ వంటి భాషపై మంచి అధికారం ఉన్నవారు గనుక ప్రముఖ హిందీ కవయిత్రి మహాదేవివర్మ కవితలను అనేకం అనువదించి నాటి "కాకతీయ" పత్రికలో ప్రకటించారు. వారిపై ఛాయావాద ప్రభావం అధికంగా ఉన్న కారణంగా ఈ అనువాదాలు చేశారన్నది పెద్దల అభిప్రాయం.

చాలామంది కవుల్లో పలువిధాలైన కోరికలుంటాయి. తమకు కీర్తి కావాలనో, ధనం రావాలనో, మరోవిధంగా తాము అందరికన్నా ప్రత్యేకమైన వ్యక్తులనిపించుకోవాలని ఇటువంటివి ఉంటుంటాయి. కాని సర్వ సమర్పణ భావం కవికి ముఖ్యమన్న భావన వారిలో ఉండటం ఒక సందేశాత్మక ధ్వని ద్యోతకమవుతున్నది. ప్రతి కవికీ తమకీ శక్తినిచ్చిన ఆ సర్వేశ్వరునికే ఇది చెందుతుందన్న ఒకానొక పరిణత మనస్తత్వం కవులకుండాలన్న ఆలోచన రెడ్డి గారిలో ఉండవచ్చు. కవులు భగవద్విశ్వాసంతో తమ అక్షరార్చనను పునీతం చేసుకోవాలన్న కాంక్షను తమపరంగా చెప్పుకున్న కవి శ్రీ గార్లపాటి రాఘవరెడ్డిగారు. వారి "పరిదేవనము" అనే మరొక శతకంలో కూడా ఈ భావాలే దర్శనమిస్తాయి.

కవిసమ్రాట్టుగా తెలుగు నేలపై వెలిగిన విశ్వనాథ సత్యనారాయణ గారు మెచ్చిన కవిత్వ రచనలందించిన గార్లపాటి రాఘవరెడ్డి గారు ప్రసిద్ధకవి శ్రీ కాళోజీ నారాయణ రావుగారు "గురువు"గా సంభావించే ఏకైక వ్యక్తి కావడం వారి ప్రతిభకు పట్టిన దర్పణం. రాశిలో తక్కువైనా వాసిలో ఘనమైన రచనలను తెలుగువారి కందించిన గొప్ప తాత్త్విక కవి కీ.శే. గార్లపాటి రాఘవరెడ్డి గారు.

# మేలిమి 'గింజల'కవిత్వం

**బూడిద అంజనేయులు,** ఫోన్ : 8309943829

సాధారణ మానవుడు ప్రకృతిలోని విషయాలను తన చర్మ, చక్షువులతో మాత్రమే చూడగలడు. కానీ చర్మ, చక్షువులకు అతీతమైన విషయాన్ని దర్శించగలవాడే కవి. అందుకే **"కవయః క్రాంత దర్శనః"** అన్నారు. కవిపై దేశకాలాది విషయాలు, భాషాపరిణామాలు, అనేకం ప్రభావం చూపవచ్చు. కాలక్రమేణా అనేక సాహితీ ప్రక్రియలు వాహిక అవ్వొచ్చు వాహిక ఏదైనా తాను చెప్పదలచుకున్న విషయాన్ని పాఠకుని మనస్సు రంజింపజేసే విధంగా చేయడమే కవి యొక్క అంతిమ లక్ష్యం ఆ కోవలోని వారే శ్రీ గింజల నరసింహ రెడ్డి గారు. **"ప్రజల నాలుకల పత్రాలపై హృదయ ఫలకాలపై ప్రాప్తించని నా కవిత"** అంటారు.

రెండువేల ఏళ్ళనాటి చరిత్ర కలిగిన తెలంగాణ సాహిత్య సరస్వతి అనేక ప్రక్రియల రూపంలో ఇక్కడ ఉద్భవించి ఇతర ప్రాంతాలకు ప్రవహించింది. అటువంటి తెలంగాణాది **"కవిత్వమే కాదు, తెలంగాణలో కవులే లేరు"** అన్న ప్రచారం ఉన్నరోజుల్లో గింజల వారు రచనలు చేయడం ప్రారంభించారు.

1937 డిసెంబర్ 28 న నల్గొండ జిల్లా, నకిరేకల్ లో పుట్టినారు. తెలుగు సాహిత్యంలో M.A తో పాటు B.Ed పూర్తిచేసి ఉపాధ్యాయునిగా, M.E.O గా అనేక బాధ్యతలు నిర్వర్తించారు. ఎన్ని బాధ్యతలు నిర్వర్తించినా కవిత్వం, సమాజ సంస్కరణ ఇతని ప్రాణం.

నరసింహ రెడ్డి గారు 1962లో **"ఊహాకృతి",** 1984లో **"శక్తి ధార"**, 1997లో **"శబ్దధనువు",** 2007లో **"శేషేంద్ర ధనువు"** తర్వాత **"వివేకానంద స్మృతి"** కావ్యాలను వెలువరించారు. పుస్తకాల రాశిలో తక్కువైనా కవిత్వ రాశిలో మేరు పర్వతం వంటివారు. **"ప్రాచీనాంధ్ర కవుల కావ్య శైలి"**, **"ఆధునిక కావ్యశ్రీ మిళితంగా"** పద్యరచన చేయడంలో వారి విశిష్టతను చాటుకున్నారు. చాలాకాలం వరకు గింజలవారు కవిత్వం రాయలేదట. మనసులో అనుకున్నాడంటే సమయం వచ్చినప్పుడల్లా గుక్క తిప్పుకోకుండా వినిపించేవారట. ఆయన శబ్ధచయనం, నూతన పదాల కూర్పు చదివేవారికి నూతన అనుభూతిని, తన్మయత్వాన్ని కలిగించేవిగా ఉంటాయి. ఆయన పద్యాలను చదుతున్నప్పుడు భాషాశైలి **"అపర శ్రీనాథుడిలా"** గోచరిస్తుంది. సాహిత్యాన్ని స్ఫురిస్తే భావవిప్లవమే గానీ భాషా విప్లవం లేని జాషువా ప్రత్యక్షమవుతాడు.

**ఊహలు బయల్వెడలి గుత్తులు గుత్తులు గాగ నిట్లు**

**ఏ లోకమ్మున నేను చరించుచున్నట్టి వాడ!** – అంటూ **"ఊహాకృతి"** లోకి అడుగు పెడతాడు.



**"సాంధ్య మల్లికాస్తబక – స్తోమమ్ములు కురియునట్టి**

**రమ్య లోకముల చీకటిరాత్రుల శయనించగలను..."** అని ఒక్కోసారి కృష్ణశాస్త్రిని మరిపించగలడు.

ప్రాచీనతను పఠిస్తూనే ఆధునికతను ఆవాహన చేసుకున్న వారు కనుకనే –

**"కళావిదులు విజ్ఞానులు – కదలి పోయిరసంఖ్యముగా**

**వారి చరిత్రమ్ము మూగబోయి వినంబడదిప్పుడు...**" అంటాడు.

సమాజంలోని దారిద్ర్యమును చూసినప్పుడు వారి హృదయం కరుణా రసభరితమౌతుంది. వారి అక్షరం పీడిత జనార్తివైపు నిలుస్తుంది. వారి ద్వితీయ కావ్యమైన **"శక్తి ధార"** యందు

**"కార్యోన్ముఖున్ని చేసే – కంఠానికిదే స్వాగతం!**

**ధైర్యోణ్ముఖున్ని చేసే మహితోక్తికిదే స్వాగతం...!"** అంటాడు.

మరొక చోట –

**"శిరశ్శృంగ సరత్ స్వరాపగ తరగల పరుగులెత్తి**

**జల్లు వర్షమున లోకము సంతసించి పోనాదెద..."** అంటూ **"నేను నటించెద"** కవితలో ఓ వంక శ్రీశ్రీ పార్శ్వమును తలపిస్తాడు.

నరసింహారెడ్డి గారి యొక్క ప్రౌఢ శైలిని **"శేషేంద్ర ధనువు"**లో గమనించవచ్చు. తన సాహిత్యంలో సంస్కృత పదాలను ఎంత పొందికగా కూర్చినా భావ వ్యక్తీకరణ విషయంలో అవి అభ్యుదయ భావాలను వెలువరిస్తాయి. వాటి యొక్క అర్థాన్ని గ్రహించాలంటే పాఠకుడు ఒక్కోసారి నిఘంటువులను ఆశ్రయించాలి. **'శింజినులు',**

**'ఋతుపథుండు'**, **'నికషాతిగ','వచస్క','వార్ఘన'**, **'క్షీరపాయి'**, **'అర్ణశవో'**, **'హృదయ పంకేరుహగంధలహరి'** వంటి పదాలను ప్రయోగించాలంటే మామూలు కవులకు సాహసమే.

గింజలవారు శేషేంద్ర శర్మ గారి యొక్క **'హృదయాంతరాల్లోని పీడిత జన పక్షపాతాన్ని'** అర్థం చేసుకున్నారు కాబట్టే వారిని గూర్చి **'శేషేంద్ర ధనువు'** లో **"జడులై ఈతని వాణి పీడిత జన స్వాంతార్తి తాపమ్ముపై"** అంటూ పద్యాలను పరిగెత్తిస్తారు.

**'శబ్దధనువు'** లో

**"రాయప్రోలు విశ్వనాథ శ్రీశ్రీ జాషువా కృష్ణశాస్త్రి తిలక్**

**త్రిపురనేని శక్రధనుస్సును చూపే కావ్య రశ్మి భానుడు..."** అని కవి భక్తిని ప్రకటిస్తాడు.

అంతటి భావుకత ఉన్నవాడు కాబట్టే **"శబ్ద ధనువు"** కు రాసిన ముందుమాటలో **"వినగానే కవిత కొంతైనా ఆకర్షించాలని, దాని భావం తెలిసిన తర్వాత మరింత ఆకర్షించాలి"** అంటారు.

వీరి తర్వాతి రచన **'విశ్వగీతి-వివేకానంద స్మృతి'**. భారత ప్రజలకు స్వామి వివేకానందుల వారు ఎంతటి ఆరాధ్యులో తెలిసిందే! ఆయన గొప్పతనాన్ని వివిధ రూపాల్లో, వివిధ కోణాల్లో దర్శించి శబ్దశిల్ప చాతుర్యంతో 118 పద్యాలస్మృతి కావ్యంగా తీర్చిదిద్దారు.

**"మధుర నాదాలుచేయ నిదురవోవు**
**హృదయ వంశాల మేల్కొల్పు మృదుల పవను**
**దవతరించే జ్ఞాన స్పర్శ నతి మృదులము**
**నిడెదువర్తన గమనుడు ఇదిగో స్వామి"** అంటూ కీర్తించారు.

అంతేనా! అంతటితో ఆగక **"గానోర్మల్ ప్రవలించినట్లు, కవితాస్వాదు ప్రభాదృశ్య సంతానమ్ముల్ స్ఫురియించినట్లు"** అంటూ ఆయన వాక్పటిమను ఈయన పద్యపటిమలో చూపిస్తారు.

నరసింహారెడ్డి గారి కవిత్వాన్ని ఏ కోణంలో చూసినా ఆయన **"మహాకవి గానే"** గోచరిస్తారు. సాక్షాత్తు శేషేంద్రశర్మ గారే **"నీ కంజలినిం ఘటించి చరితార్థుడనై సుకృతంబు పొందెదన్"** అన్నాడంటే ఆయన పాండిత్యం ఎంతటిదో అర్థమవుతుంది.

విశ్వనాథ సత్యనారాయణ అంతటి కవిపుంగవులచే ప్రశంసించ బడిన కావ్య నిర్మాణ సామర్థ్యం కలిగినవాడు, కవితా రీతులు లోతుగా తెలిసినవారు రెడ్డి గారు. అంతటి గొప్ప కవిని గన్న తెలంగాణము, నల్గొండ జిల్లా చరితము ధన్యము.

ఇటీవలి కాలంలో వారి శిష్యుడు "కదిరె కృష్ణ" గారు "సత్కవితా ఝరి" పేరుతో వారి కవిత్వ విమర్శ చేసి మరుగున పడి ఉన్న వారి సాహిత్యమును నూతన, వర్తమాన పాఠక లోకానికి పరిచయం చేసారు.

## నిజ నిర్ధారణ

ఇపుడు
ఆ నాలుగు గోడలు
ఆకాశమయ్యాయి .
నిశబ్దం గాలివలె ప్రవహిస్తున్నది .
వాళ్ళిపుడు రెండు పక్షులుగా మారిపోయారు.
ఆమె ఇన్నాళ్లు ఎన్నో ప్రశ్నలను
మోస్తున్నది .
ఆ ప్రశ్నలన్నింటికి అతడు సమాధానామవుతాడనే
నమ్మకం కలిగింది.
అతని ఎదపై మెల్లగా వాలి
కళ్ళలోకి చూస్తుంటే
ఆమె హృదయ అన్వేషణను అర్థం చేసుకుంటూ ..
అతను తన కనురెప్పలను ఒంచుతూ
నేనున్నాను అన్నట్టుగా ధైర్యమిచ్చాడు.
అంతలో ఆమె –
"నాకో సందేహం ...!!?"
ఏంటో అడుగు.
"హక్కులు అంటే ఏమిటి ..!?"
నీ అస్తిత్వం కోసం నువ్వు స్వేచ్ఛగా జీవించగలగడం ...
అవి ఇతరుల నుండి పొందేవి కావు .నీలోనే ఉండేవి .
"మరి ఆడవాళ్ళ హక్కులు
మగవాళ్ల అధీనంలోనే ఉంటాయా ..!?"
అతనిలో మౌనం ప్రహహిస్తున్నది .....
సిగ్గుతో తల దించుకున్నాడు.
ఆమె అతని తలను ఎత్తుతూ
"మరి నేనెందుకు చదువుకోలేదు ."
మగవాడు ఆధిపత్యం చేలాయించేది
ఆడవాళ్ళ బతుకు పైననే కదా "
కనపడని పంజరంలో
కట్టేయబడ్డ హక్కులెన్నో ...
ఇపుడు
అతను ,అతను లాంటి ఎందరో
హృదయాలు వర్షిస్తున్నాయి.
ఆమె ఓదార్పు కాదు
ఆమె ఒక సానుభూతి కాదు

**- రామ్ పెరుమాండ్ల**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (33) హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

గ్రంథాంతరంగం 09

## జనమంచి శేషాద్రిశర్మగారి
# షష్టిపూర్త్యుత్సవ సన్మాన సంపుటము

శ్రీ ఘట్టమరాజు, బెంగుళూరు, ఫోన్ : 9964082076

షష్టి, సప్తతి, సహస్ర చంద్రదర్శన పూర్తుల సందర్భంగా మహాకవులకు, పండితులకు, ఆచార్య పుంగవులకు వారి శిష్యులు, అభిమానులు, సాహిత్యవేత్తలు గౌరవపురస్సరంగా అభినందన గ్రంథాలు మహోత్సాహంతో ఘనంగా సమర్పించడం కద్దు. అంతేకాదు, యశోధనులైన మనీషుల శతవార్షిక స్మారక గ్రంథాలు వెలువరించడమూ ఆనవాయితే. రాజకీయనాయకుల, సమాజ సేవకుల, కోటీశ్వరుల అభినందన సంచికలు ప్రచురించి స్వామికార్యం, స్వకార్యం తీర్చుకొని ధన్యాత్ములైన సందర్భాలూ లేకపోలేదు. మన తెలుగులో ఇటీవల కొత్తరకం స్వాభినందన పుస్తకాలు పత్రికల రూపంలో వెలువడుతున్నాయి. కొందరు పేరు మోసిన, మోస్తున్న, మోయాలని అర్రులు చాస్తున్న రచయితలు పత్రికల్లో యథాశక్తి పేజీల్ని కొని, మిత్రులతో, అభిమానులతో ప్రశంసాపూర్వకమైన రచనలు రాయించుకొని పరమానంద భరితులవుతున్నారు. షష్టి, సప్తతి పూర్తుల మాట అటుండనివ్వండి. మరి కొంతమంది రచయితలు విరాళాలు సేకరించి, చేతిచమురు వదలించుకొని సంప్రదాయాలేవీ పాటించకుండా ఏనకేన ప్రకారేణ అభినందన గ్రంథాలు ప్రచురింపచేసుకుని ఇష్టపూర్తి సాధించు కొంటున్నారు. శాంతమ్ పాపమ్!

అభినందన గ్రంథ సంప్రదాయం మన తెలుగులో దాదాపు నూరేళ్ళ క్రితమే ప్రారంభమయింది. గిడుగు రామ్మూర్తిగారి సప్తతి గ్రంథం, వావిళ్ల వేంకటేశ్వరుల షష్టిపూర్తి గ్రంథం, కట్టమంచి, రాళ్ళపల్లి, నార్లవార్ల షష్టిపూర్తి అభినందన గ్రంథాలు ఇంకెందరి మహానుభావులవో తెలుగు సాహిత్య భండారాన్ని సమృద్ధం చేశాయి, చేస్తున్నాయి కూడా. తెలుగులో అభినందన గ్రంథాల గురించి ఇంతవరకూ ఎలాంటి పరిశోధనా గ్రంథమూ ముద్రితమైనట్లు కనబడదు, వినబడదు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఒక యువకుడు డా. సి. హెచ్. లక్ష్మణచక్రవర్తి పర్యవేక్షలో తెలుగులో షష్టిపూర్తి సంచికల మీద పిహెచ్.డి. పట్టాకై పరిశోధన చేస్తుండడం హర్షణీయం.

కళాప్రపూర్ణ, అభినవాంధ్ర వాల్మీకి, కావ్యస్మృతి తీర్థః బిరుదాంకితు లైన జనమంచి శేషాద్రిశర్మగారి షష్టిపూర్తి సన్మాన సంపుటాన్ని వావిళ్ల ప్రెస్ అధిపతులు 1942లో కాదు 1943లో ప్రచురించారు. ఈ షష్టిపూర్తి సంపుటానికి సంపాదకులెవరో కాని జనమంచి వారి సన్మాన సంఘాధ్యక్షుల పేరు మాత్రం **"రావుబహదూరు విరూరి పిచ్చయ్య పంతులు బి.ఏ"** గా 'నివేదిక'లో ఉల్లేఖింపబడింది.

మహాకవుల, విద్వాంసుల, విద్యావేత్తల, పరిశోధకుల, చరిత్రకారుల సన్మాన, స్మారకగ్రంథాలు తెలుగులో గణనీయమైన సంఖ్యలోనే వున్నాయి. వీటి లక్షణాలేమిటో తెలుసుకొందాం. అభినందన, స్మారకగ్రంథాల్లో సాధారణంగా రెండురకాలైన రచనలుంటాయి. కవి, పండిత, పరిశోధక మహానుభావుల జీవిత సంగ్రహం, విశేషాలు, వాళ్ల రచనలు ఒక్కొక్క దాని మీద విద్వాంసుల పరిచయాత్మక, విశ్లేషణాత్మక వ్యాసాలుంటాయి. అభినందింప బడుతున్న వ్యక్తికి స్నేహితులు, సన్నిహితులు, కుటుంబ సభ్యులు రాసిన ఆత్మీయ సంబంధాల వివరాలు వుంటాయి. సన్మానితునికి



బంధుమిత్రులు, సమకాలీనులు రాసిన లేఖలు, ప్రత్యుత్తరాలు కూడా వుంటాయి. రెండో రకమైన రచనలు ఏవంటే సన్మానిత వ్యక్తి ఏయే రంగాల్లో కృషి చేశారో, అలాంటి విషయాలకు చెందిన వ్యాసాలు వుంటాయి. పుస్తకం చివర్లో అభినందిత వ్యక్తి జీవిత విశేషాలు, రచించిన పుస్తకాల, విడి రచనల వివరాలు గుదిగుచ్చబడి వుంటాయి. పూర్వమైతే సన్మానింపబడ్డ వ్యక్తి, కుటుంబ సభ్యుల, సహోద్యోగుల, మిత్రవర్యుల ఫోటోలు కొన్నిమాత్రమే వుండేవి. ఈ రోజుల్లో అయితే కొన్ని సన్మాన సంపుటాలు 'ఆల్బమ్' లను తలపింపచేస్తాయి.

**'జనమంచి శేషాద్రిశర్మ గారి షష్టిపూర్త్యుత్సవ సన్మాన సంపుటము'** బహుశా రాయలసీమ రచయితపై వెలువడ్డ మొదటి అభినందన గ్రంథమేమో? జనమంచి శేషాద్రిశర్మ 1882 జూలై 4వ తేదీన నెల్లూరు జిల్లా కలువాయపురంలో జన్మించినా, బాల్యంలోనే తల్లిదండ్రులతో పాటు కడపజిల్లా లోని వెంకటరామపురానికి వలస

వచ్చారు. ప్రాథమిక విద్యాభ్యాసం కడపలో జరిగింది. శర్మగారి జీవితం ఎక్కువభాగం కడపలోనే సాగింది. నెల్లూరు జిల్లాలో పుట్టిన జనమంచి వారు కడపలో స్థిర నివాసం ఏర్పరుచుకొని రాయలసీమ రచయితగా రాణకెక్కారు.

**'జనమంచి శేషాద్రిశర్మగారి షష్టిపూర్త్యుత్సవ సన్మాన సంపుటము'** (1943) ఆయన జీవిత, రచనల పరిచయం చెయ్యడంతో పాటు, మహాపండితుల వ్యాసాలతో వెలువడింది. ఈ అభినందన గ్రంథంలో మొత్తం 320 పేజీలున్నాయి. కళాప్రపూర్ణ జనమంచి వారికి పద్యరూపంలో శ్రీయుతులు పండిత నారునాగనార్య, దోమా వేంకటస్వామిగుప్త, మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, అవధానం చంద్రశేఖరశర్మ, రెడ్డి భీమరావు, సవరము వీరబ్రహ్మనాయుడు, ప్రభృతులు భక్తిప్రసూనాల్ని సమర్పించారు. ఇవి **'విషయసూచిక'** కు ముందే ప్రచురింపబడ్డాయి. అనంతపురం జిల్లా వాస్తవ్యులైన రెడ్డి భీమరావు, బేవినహళ్లి కృష్ణారావు గారలు 'భీమకృష్ణులు' అనే పేరుతో జనమంచి వారి జీవితం, రచనలు స్థూల పరిచయం చేశారు. ఈ ఇద్దరు షష్టిపూర్తి సంచికకు సంపాదకులై ఉండొచ్చునని భావించడానికి ఆస్కారముంది. జనమంచి వారు 11 ఏళ్ల వయసులో (1893) కడపలో నేర్చిన విద్య తృప్తినివ్వనందున బైరాగులతో కలిసి నాలుగు సంవత్సరాల కాలం కాలినడకన విద్యానగరి కాశీ చేరి అక్కడ నాలుగేళ్లపాటు సంస్కృత కావ్యనాటకాదుల్ని నేర్చుకొన్నారు. తర్వాత అనకాపల్లి, కర్నూలు పాఠశాలల్లో పని చేసి 1901 నుంచి 1937 వరకు కడపలోని పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రధాన తెలుగు పండితులుగా కొనసాగారు. శర్మగారు చాలాచోట్ల శతావధానాలు విజయవంతంగా చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు గారి సలహా మేరకు శతావధానాలు చేయడానికి స్వస్తిచెప్పి, గ్రంథ రచనకు ఉద్యమించారు.

శేషాద్రిశర్మగారు పెక్కు సంస్కృత కావ్య పురాణాల్ని తెలుగులోకి అనువదించారు. పైగా తెలుగులో స్వతంత్ర రచనలు చేశారు కూడా. స్కాంద పురాణంలోని 'హాలాస్యమాహాత్మ్యాన్ని 2300 పద్యాల్లో తెలిగించారు. (1902). వీరి ఇతర అనువాద కృతులు – లలితోపాఖ్యానము, (1906) బ్రహ్మాండపురాణము (1912) శ్రీమద్రామాయణాన్ని నిర్వచనంగా 24,161 పద్యాల్లో సరసంగా అనువదించారు. (1921) 512 పద్యాల స్వతంత్ర కావ్యము 'హనుమద్విజయము' (1925) సర్వమంగళా పరిణయము, ధర్మసార రామాయణము, కలివిలాసము, కౌమారికా ఖండము ఇత్యాది వీరి స్వతంత్ర కావ్యాలు. శర్మగారు రామాయణ, భారత, భాగవతాల్ని సంగ్రహంగా గద్యంలో వెలువరించారు. వీరి వచన గ్రంథాల్లో కడప మండల చరిత్ర, మనుచరిత్ర హృదయావిష్కరణము గమనింప దగ్గవి. జనమంచి వారి కావ్యరచనాశయాన్ని శిష్య పరమాణువులైన భీమకృష్ణ (చిరికెర రెడ్డి భీమారావు, దేవినహళ్ళి కృష్ణారావు) లీవిధంగా సమీక్షించారు– **"శర్మగారు పద్యశ్శత గ్రంథ కల్పనా సమర్థులయ్యు గుక్కపై గోడపై నుబుసుపోకకే నొక్క పద్యమ్ జెప్పిన జాడ కాన్పింపదు. అల్పలాభమున కాసించి జనులకు దాత్కాలిక మనోరంజనము గావించి "బళిభళీ" యనిపించుకొనవలెనను తలంపు వీరికి లేదు. చదివి చదివి దాని యర్థము నెఱింగి, భావము నెఱింగి, సారము గ్రహించి తిన్నగ నాచరణమున కలవాటు పడి సాధించి దాని వలన గలుగు మహా సౌఖ్యానందము నెల్ల ననుభవింప వలెననుటయే వీరి యాశయము."** (పేజి: 20–21)

ఏలూరిపాటి రామభద్రచయనులు జనమంచి వారి అనువాద, మౌలిక కావ్యాల్ని సహృదయతతో విమర్శించారు. **"శర్మగారి కవనము హృద్యతమమైనది. పద్యమును ధారాళముగ బోనిచ్చుటలో వీరద్వితీయులు. సమాస జటిలములగు పదములు వీరి రచన యందు గన్పింపవు. మాఱుమూల పదములు జొప్పించుట వీరి కవితలో లేదు. వీరి భాషాంతరీకరణములో యథామూలముగ బోయినవి శ్రీమద్భాగవత దశమస్కంధ, శ్రీమద్రామాయణ, బ్రహ్మ పురాణ, బ్రహ్మాండపురాణాదులు ఇందు మొదటివి రెండును మూలార్థము నేమాత్రమును విడువక నియమబద్ధముగ రచించినవి. మిగిలినవి మూలార్థమును విడువకున్నను స్వేచ్ఛానువాదములు. మూలము ననుసరించు నియమ ముండుటచే దాండవ కృష్ణ భాగవత రామాయణములందు గొన్ని పద్యముల గలుపుకొనిన గాని యన్వయము పూర్తి కానేరదు. మిగిలిన భాషాంతరీకరణములందీ చిక్కులేదు."** (పేజి: 38)

జమ్ములమడక మాధవరాయశర్మ గారు **"సాహిత్యము – మనము – వికాస పద్ధతి"** యను వ్యాసంలో సాహిత్యాన్ని నిర్వచించి, లక్షణాల్ని, ప్రయోజనాల్ని చెప్పారు. సహృదయతను విశదీకరించారు. వర్తమానకాల సాహిత్య వాతావరణాన్ని ఈ విధంగా చిత్రించారు– **"ఇప్పటి సాహిత్యము సామాన్యముగా వెఱ్ఱితలలు వేసినది. సాహిత్యము పేరిట వాఙ్మయ రచనము చేయువారికి గాని, చేయించువారికి గాని, రచయితలను గౌరవించువారికిని, గౌరవము పొందువారికి గాని భారత సాహిత్య రీతి బాగుగా తెలియదు. సాహితీ నామముతో బ్రతుకుదెరువు సంపాదించుకొనువారు కూడ తమకు తెలిసిన సాహితీ రీతులను సవరించుకొనుట లేదు. సాహిత్యము నాధారముగా చేసికొని, వారును వీరును, గౌరవమును, ఆర్థిక ప్రయోజనమునే ప్రధానముగ భావించుచున్నారు గాని, తమ కెవరికిని సహజ భావము గోచరము కాకపోవుట నంగీకరించుట లేదు. తెలుసుకొను కోరికయు వారలకు లేదు. చెప్పినను వారు వినరు. అట్టివారు తమకు తెలిసినట్లు నటించుటను లోకము మోసపోవు చున్నది. సామాన్యముగా నంతటను ప్రజ్ఞ తగ్గినది. సహృదయులు విరళులయినారు. ఎంతగా విశ్వవిహారము చేయువలయునను భావమున్నను, స్వస్థితిని పర్యాలోచనము చేసికొనుచు**


**విహంగావలోకనము చేయుట యావశ్యకము. విశ్వవిశ్వముపై దృష్టియున్నను స్వస్థితిలో చిత్తమును కేంద్రీకరించుట అపేక్షితము."** (పేజి: 77) ప్రకాండ పండితులైన జమ్ములమడక వారి ఈ మాటలు నేటి రచయితలకు, విమర్శకులకు రోమంథం చేసుకోదగ్గవి.

దీపాలపిచ్చయ్య శాస్త్రిగారి **"ఆముక్తమాల్యద వ్యాఖ్యానములు"** అన్న వ్యాసం 64 పేజీల సుదీర్ఘమైనది. వావిళ్ల రామశాస్త్రిగారి 'ఆముక్తమాల్యద' రుచి వ్యాఖ్యానం, వేదంవారి 'సంజీవినీ' వ్యాఖ్యలోని గుణదోషాల్ని పరామర్శిస్తుంది. పాండిత్య ప్రకర్షతో నిండిన ఈ వ్యాసం అర్థదోషములు, శబ్దదోషములు, అప పాఠములు- అప సిద్ధాంతములు, సాహసపు సవరణలు, అన్వయదోషములు, అలంకార దోషములు, లక్షణ దోషములు, అనే ఏడు శీర్షికలతో రచింపబడింది. దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు వివిధ శీర్షికల కింద 67 దోషాల్ని చర్చించారు. వేదంవారు సంజీవినీ వ్యాఖ్యలో 'అక్కవాడ' పదానికి 'అమ్మలక్కలుండు వీధి' అని ఇచ్చిన అర్థం సరికాదని, పూటకూళ్ళ ఇండ్లుండు వీధియని చెప్పి సముచితార్థం సూచించుట ప్రశంసనీయం. (పేజి: 92) సున్నమెత్తుట అనే పదానికి వేదం వారు 'సున్నము ఎత్తుట, మోయించుట దండ్యులకు ఒక శిక్ష' అని చెప్పారు కాని దీపాల వారు వావిళ్లవారి ప్రతిలో 'సున్నము మెత్తుట' అన్న పదంలో 'ము' లోపించిందని, దాని ఆధారంగా వేదంవారు తప్పు అర్థమిచ్చారని చెప్పారు. తప్పు చేసిన వాళ్ల ముఖాలకు సున్నం పూసి వీధుల్లో వూరేగించడం దండ సంహితలో వున్న సంగతే. (పేజి: 138)

దీపాల పిచ్చయ్య శాస్త్రిగారు వేదంవారి ఆముక్తమాల్యద సంజీవినీ వ్యాఖ్యలోని దోషాల కొన్నింటిని సవరించుట శ్లాఘనీయమే. కాని **"వారు (వేదంవారు) ఒకటికి రెండు మూడు తాళపత్ర ప్రతులను పరీక్షించి సాధుపాఠములను గ్రహింపలేదు. సరిగదా వావిళ్లవారి ప్రతి నుండి యెత్తి వ్రాసికొనుటలో నైనను మెలకువ గలిగి ప్రవర్తింపలేదు."** (పేజి: 139) అని అన్న మాటలు సంయమనం తప్పాయని చెప్పడం సత్యోక్తే.

సత్కవి, వైద్య విద్వాన్ నారునాగనార్యగారు చక్రపాణి దత్త రాసిన 'చక్రదత్త' (వావిళ్ల ప్రెస్, 1926) అనే వైద్య గ్రంథాన్ని విమర్శిస్తూ రాసిన వ్యాసమిది. 'చక్రదత్త' ను తెలుగులోకి అనువదిస్తూ, వ్యాఖ్యానిస్తూ ఔషధవృక్షాల, మొక్కలకు ఇచ్చిన పేర్లు సరికావని చెప్పారు నాగనార్యగారు **'శ్వేతమరీచమ్ అంటే తెల్లావాలు కాదనీ తెల్ల మిరియాలు లేక చలువ మిరియాలు అనీ, నింబ అంటే నిమ్మకాయ కాదనీ వేప అనీ దాదాపు 36 వైద్యకీయ సంబంధ పదాలకు సరైన అర్థం చెప్పారు. పైగా 11 పదాల్ని సంస్కృత మూలమందే వదలి వేశారని వుదాహరణ లిచ్చారు.'** (పేజి: 180- 182)

జనమంచి వారి షష్టిపూర్తి సంచికలో విద్వాన్ శివపురపు వేంకట నరసమ్మ (జెజవాడ) గారి 'భక్తితత్త్వము' అనే వ్యాసం దేచిరాజు లక్ష్మీనరసమ్మ (గుంటూరు) గారి 'సుప్రబోధము' అనే దేశభక్తి గేయం,


873
2915
శ్రీ ॥
19.4.05
కళాప్రపూర్ణ, అభినవాంధ్రవాల్మీకి, కావ్యస్మృతితీర్థ:
జనమంచి శేషాద్రిశర్మగారి
షష్టిపూర్త్యుత్సవసన్మానసంపుటము.

చెన్నపురి:
'వావిళ్ల' ప్రెస్సున
ముద్రితము.
1942.

శివపురపు వేంకటనరసమ్మగారు జనమంచి వారికి అభినందనా పూర్వకంగా సమర్పించిన 'పంచరత్నాలు' గమనార్హాలు. బాలకవి సవరము వీరబ్రహ్మము నాయుడుగారి 'తెలుగుతల్లి' గురించి రాసిన ముత్యాలసరాలు కూడా చదవదగ్గవే. అనుబంధములో ప్రకటించిన ఈయుణ్ణి వేంకట వీరరాఘవాచార్యులవారి 'మహారాజకవి ముక్తా పీడుడు' అనబడే పరిశోధన వ్యాసం అమూల్యమైనది.

జనమంచి శేషాద్రిశర్మ గారి వ్యక్తిత్వం, కృతిత్వం గురించి కట్టమంచి రామలింగారెడ్డి గారిలా అన్నారు- **"వీరి కవిత్వమునకు వీరి వినయాతిశయము శోభను గలిగించుచున్నది. కవిత్వ పాండిత్యములకును, సౌజన్యమునకు నిత్య సంధి లేదనుట మన మెఱింగిన విషయమే. వీరెవ్వరినిగాని యధిక్షేపించినట్లు, ఎవ్వరితో గాని వాదమునకు బూనుకొన్నట్లు గానరాదు. సౌజన్యము వీరి కలంకారము. ప్రఖ్యాతికై ప్రాకులాడు వారు కారు. మధునాపంతుల వారి 'ఆంధ్ర రచయితలు' (1950) నుంచి ఉద్ధృతం"** (పేజి:268)

**'జనమంచి శేషాద్రిశర్మగారి షష్టిపూర్త్యుత్సవ సన్మాన సంపుటము'** కొండంత కవిని అద్దంలో కొంచెంగా చూపించే అభినందన గ్రంథం.

(ఈ విలువైన పుస్తకాన్ని నాకు పంపిన మిత్రులు డా. మూల మల్లికార్జున రెడ్డి డా. భూతపురి గోపాలకృష్ణశాస్త్రి (కడప) గార్లకు కృతజ్ఞతలు)

**నివాళి**

## ప్రముఖ కథా రచయిత "శ్రీవిరించి" అస్తమయం



**శ్రీ విరించి** అనేది డా. ఎన్.సి. రామానుజాచారి కలం పేరు. ఆయన 1935లో జన్మించారు. పొలిటికల్ సైన్స్‌లో MA, పారిశ్రామిక మరియు వాణిజ్య చట్టాలలో BL మరియు Ph.D. తులనాత్మక తత్వశాస్త్రం మరియు మతంలో ఆయన పట్టభద్రులు. శ్రీవిరించి 1958 నుండి థియోసాఫికల్ సొసైటీలో సభ్యులు మరియు 1979 నుండి ప్రపంచ ప్రధాన కార్యాలయం, అడయార్‌లో సంఘం యొక్క పనితో క్రియాశీలక నిర్వాహక కార్యకర్త అయ్యారు .వారు థియసాఫికల్ సొసైటీ యొక్క భారతీయ విభాగానికి అధ్యయనాల డైరెక్టర్, అలాగే జాయింట్ జనరల్ సెక్రటరీ (ప్రాపర్టీ అడ్మినిస్ట్రేషన్) గా ఉన్నారు. వారు థియోసాఫికల్ విషయాలపై మరియు మానవ నాగరికత మరియు సంస్కృతిపై గొప్ప రచయిత, మరియు వక్త. శ్రీవిరించి గారు తెలుగు మరియు ఆంగ్లంలో అనేక కథలు వ్రాసారు 1951 నుండి రచనలు చేస్తున్న ఆయన చాలా కాలం పాటు తెలుగు స్వతంత్రతో పాటు భారతి, ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, యువ, మరియు వివిధ పత్రికలలో అనేక కథలనూ వ్యాసాలను ప్రచురించారు. ఆయన కథల శైలిపై సాహిత్య విమర్శలో లోతైన ఆసక్తిని కలిగి ఉండేవారు తెలుగులో 100, ఇంగ్లీషులో 50 పైగా విమర్శనాత్మక వ్యాసాలు రాశారు. "ది హిందూ" మరియు "ఇండియా టుడే–తెలుగు" కోసం కాల్పనిక మరియు సంస్కృతి పుస్తకాల సమీక్షకులు గా వందలాది గ్రంథ సమీక్షలు చేసారు 'ఇండియన్ షార్ట్–స్టోరీ– ఆరిజిన్స్, ఎవల్యూషన్ అండ్ ఎక్స్‌పెరిమెంట్స్ (1984–86)'లో ఇంటెన్సివ్ స్టడీస్ కోసం రెండు సంవత్సరాల పాటు భారతప్రభుత్వ ఫెలోషిప్ ను పొందారు. భారతదేశం సంస్కృతి విభాగం ఆయనను సత్కరించింది. ఆయన సెంట్రల్ సాహిత్య అకాడమీ మరియు నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాకు అనువాదకులు .వారి ప్రచురించబడిన –కథా సంకలనాలు : మధ్యమావతి, కొత్తనక్షత్రం (1982); అర్థం, కరణి కన్నీరు, మెట్లులేని నిచ్చెన (1995), కనకపు గట్టు (1997)బీ గంధపు చుక్క (2000) – తెలుగులో అన్నీ; ఆంగ్లంలో సెవెన్ టోన్స్ (1991). సముద్ర శిఖర్ (హిందీ). శ్రీవిరించి 2000 సంవత్సరంలో తెలుగు యూనివర్సిటీ, హైదరాబాదు నుండి అవార్డు, అలాగే "డాక్టర్ దాశరధి రంగాచార్య, శ్రీమతి కమలా సాహిత్య పురస్కారం" (2004) వంటి పలు పురస్కారాలను అందుకున్నారు. అయన మృతితో తెలుగు కథాప్రపంచం ఒక మంచి రచయితను కోల్పోయింది.

---




**బురదలోన ఉంటున్నా తరగదు పద్మం విలువ**
**తాటాకున పడివున్నా తగ్గదు పద్యం విలువ**
**అసలు సిసలు పసవుంటే అవరోధించేదెవరు–**
**అరసికులేమంటున్నా చెరగదు గానం విలువ**
**మూర్ఖులు ముంచేస్తున్నా మునగదు జ్ఞానం విలువ.**

**(ప్రపంచ పదులు**
**– డా. సి. నారాయణ రెడ్డి)**

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (37) హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# కాశీయాత్రా చరిత్ర – తెలంగాణ సంస్కృతి

**యం. రేణుక,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 8331 903 650




ఏనుగుల వీరాస్వామయ్య కాశీయాత్రా చరిత్రలో ప్రస్తావించిన తెలంగాణ అంశాలలో కొన్నిట వ్యాసంలో పొందుపరుస్తున్నాను. ఈ పుస్తకంలో ఉన్న చరిత్ర దాదాపు 195 సంవత్సరాల క్రితం నాటిది. కాలానుగుణంగా ప్రతి ప్రాంతం ఏదో మార్పుకు గురౌతూనే ఉంటుంది. ప్రతి ప్రాంతంలో సంస్కృతి ఎంతో కొంత ప్రాచీన సంస్కృతిని మోస్తూ కొత్త పోకడలకు గురౌతూనే ఉంటుంది. ఇప్పుడున్న ప్రాంతాల గురించి ఎక్కడైన విన్నటువంటి ఆనవాళ్ళు, చూసినా జాడలు ఎదురైన కొంత ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిస్తాయి. వీరాస్వామయ్య యాత్రా చరిత్ర చదువుతున్నప్పుడు కూడా ప్రతి పుటలో ఎన్నో ఆసక్తికరమైన అంశాలు ఎదురవుతాయి. ఆశ్చర్యకరమైన విషయాలు తెలిస్తాయి. ముఖ్యంగా తెలంగాణ గురించి చదువు తున్నప్పుడు తెలిసిన కథని ఆసక్తికర శిల్పంలో అమర్చినట్లనిపించింది.

వీరాస్వామయ్య వర్ణించిన కాలం నాటి తెలంగాణ మనకు సమీప గతం. దాదాపు ఆ కాలం నాటి చరిత్ర అందుబాటులో ఉన్నదే, ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు చెప్పిందే. వీరు అందరికి తెలిసిన చరిత్రతో పాటు మనకు తెలియని చరిత్రను కూడా నిక్షిప్తం చేశారు. రెండువందల సంవత్సరాల క్రితం నాటి రాజకీయ చరిత్రతో పాటు, ఆనాటి సాంఘిక చరిత్రను తన రచనలో నిక్షిప్తం చేశారు.

ముఖ్యంగా ఆనాటి గ్రామచరిత్రను తనుకున్న పరిమితులకు అనుగుణంగా తాను విన్నవి, కన్నవి లిఖితబద్ధం చేశారు. తాను ప్రయాణం చేసిన మార్గాలను, మజిలీలను, అక్కడి ఆహారపు అలవాట్లను, ప్రజల మనస్తత్వాన్ని, వేషధారణను ప్రస్తావించారు. ప్రతి గ్రామంలో ఉన్న పాలన ప్రక్రియను అర్థవంతంగా తెలియజేసాడు. ప్రకృతి అందాలను ఆ అందాల ఆస్వాదనలో ఉన్న ఇబ్బందులను ఈ గ్రంథంలో పదిలపరిచాడు. స్థానిక, సాంఘిక చరిత్ర రచనకు నేటి చరిత్రకారులకు ఉపయుక్తంగా ఉండేలా వీరి రచన సాగింది. వీరు తన గ్రంథంలో తెలిపిన ఆనవాళ్ళు దాదాపు అన్నీ ఇప్పటికీ ఉన్నాయి. పాలన వ్యవహారాలు కూడా కొంత నేటి కాలం వారు పోల్చుకునేలానే ఉంటాయి.

1830 మే 18 వ తేదిన మంగళవారం రాత్రి 9 గంటలకు వీరాస్వామయ్య చెన్నై నుండి కాశీయాత్ర ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఆంధ్రప్రదేశ్ మీదుగా అనేక ప్రాంతాలను దాటుకుంటూ వచ్చి కృష్ణానది తీరప్రాంతాన్ని ఆనుకుని ఉన్న హయిదరాబాదు రాజ్యానికి (తెలంగాణకు) జూన్ 24వ తేదిన చేరుకున్నారు. కృష్ణ తీరానికి 3 కోసుల దూరంలో ఉండే పెంటపల్లిలో ఆయన తొలి మజిలీ చేశారు.

పెంటపల్లి మొదలుకుని తెలంగాణలో అనేక ప్రాంతాలను దర్శిస్తూ వీరస్వామయ్య ప్రయాణం కొనసాగింది. పెంటపల్లి నుండి పానగల్లు, వనపర్తి, చినమంది, చోళపురము, మనోజిపేటకు అక్కడి నుండి గణపురం, జడచర్ల, బాలనగరము/నాగనపల్లె, జానంపేట/ఫరుక్కునగరం, పాలమాకుల, షాపురము, షంసాబాదుకు ఆ తరువాత హయిదరాబాదు షహరుకి (బేగంబజారు), సికిందరాబాదుకి, మేడ్చల్‌కి, బిక్కనూరుపేటకు, కామారెడ్డిపేటకు, మల్లుపేటకు, ఇందలవాయికి, డిచ్చుపల్లికి, జగనంపల్లెకు, ఆర్మూరుకు, బాలకొండకు, దూదుగాంకు, నిర్మలకు, నేరేడుకొండకు, వొడ్డూరుకు, విచ్చోడాకు, ఆదిలాబాదుకు, అట్నూరుకు, ధనోరాకు, కాయరాకు క్రమంగా తన ప్రయాణం కొనసాగించాడు. అప్పటి హైదరాబాద్ రాజ్య సరిహద్దు ప్రాంతం వోణి గ్రామం గుండా కాశీకి పయణమయ్యాడు. కృష్ణనది దాటొచ్చి తెలంగాణలో అడుగుపెట్టి, వరదా (వార్ధా) నది దాటుకుని హైదరాబాద్ రాజ్యాన్ని వదిలి నాగపూర్ రాజ్య పరిదిలోకి వెళ్లారు. వీరు దాదాపు 47 రోజులు తెలంగాణాలో (హైదరాబాద్ రాజ్యం) ఉన్నారు.

వీరు ప్రయాణం చేసిన ఊర్లు ప్రసిద్ధమైన ప్రాంతాలుగా, సాధారణ గ్రామాలుగా ఇప్పటికీ ఉన్నాయి. చోళపురము, మనోజిపేట, మల్లుపేట వంటి ప్రాంతాలు పల్లెలుగా ఉన్నాయి. వీరాస్వామయ్య చెప్పిన ఊర్లపేర్లలో కొన్ని ఊర్ల పేర్లకి ప్రస్తుతం వాడుకలో ఉన్న పేర్లకి మార్పులు కనిపిస్తున్నాయి. కొన్ని స్వల్పంగా కనిపిస్తే మరికొన్ని గుర్తుపట్టలేనంతగా మార్పు చేసుకున్నాయి. పెంటపల్లి అనే ఊరు పెంట్లవెల్లిగా, చిన్న మంది – చిన మందడిగా, గణపురము – ఖిలా ఘన్‌పూర్‌గా, జలచర్ల – జడ్చర్లగా, పాలమాకుల – ఫలమక్కల్‌గా, మేడిచెలాన్ – మేడ్చల్‌గా, బిక్కనూరుపేట – బిక్నూరుగా, కామారెడ్డి పేట – కామరెడ్డిగా, యిూదలవాయి – ఇందలవాయిగా, డిచ్చుపల్లి – డిచ్‌పల్లిగా,

జగనంపల్లి – జక్రాన్‌పల్లిగా, మూకాల – ముప్కాల్‌గా, విచ్చేడ – ఇచ్చేడగా కాలక్రమంలో మార్పుకు గురయ్యాయి. ఇంకా హైదరాబాద్ ప్రాంతంలో ఉన్న చంద్రఘాటు – ఛాదర్‌ఘాటుగా మారింది. చార్మినార్‌ను ఆ పేరుతో పిలవలేదు. నాల్గు దోవలు చేరడానికి గాను కట్టిన యొక గొప్ప స్థూపీ గలిగి నాలుగు ద్వారాలు గలిగిన యొక చావడి అని మాత్రమే ప్రస్తావిం చాడు. ఆనాటి గుళ్ళు, మసీదులు, దేవతార్చనలు, పండుగలు.

ప్రాచీన కాలం నుండి తెలంగాణ అనేక సాంప్రదాయాలకు పట్టుకొమ్మగా ఉంది. జైనము, బౌద్ధం, వీరశైవం, వైష్ణవం, ఇస్లాం, క్రిష్టియన్ వంటి అనేక మతాలు ఈ నేలలో ఇంకా అడుగంటకుండ కొనసాగుతూనే ఉన్నాయి. వీరాస్వామయ్య రెండు వందల సంవత్సరాల క్రితం తన మతధర్మాన్ని అనుసరిస్తూ విశ్వేశ్వరుని దర్శనం కోసం కాశీయాత్ర చేశారు. వీరి ప్రయాణంలో అనేక మతాల వాళ్ళు తారసపడ్డారు. అనేక సంస్కృతులు పరిచయం అయ్యాయి. తెలంగాణలో వివిధ మతాలను, ఒకే మతంలో రకరకాల సంస్కృతులను చూశారు.

హైదరాబాద్ సంప్రదాయంలో ఒకటైన మొహర్రం పండుగ జరిగే పుణ్య సమయానికి తాను అక్కడ ఉన్నందుకు భగవంతునికి కృతజ్ఞత చెప్పుకున్నాడు. తొమ్మిది రోజులపాటు జరిగే ఈ ఉత్సవం చివరిరోజు కంచికి గరుడసేవలా, హైదరాబాదుకు మొహర్రం అత్యంత ప్రముఖమైన పండగని చెప్పాడు. కంచిలో కూడా అన్ని మతాల వారు ఐక్యతతో కూడి గరుడ సేవ చేస్తారని ప్రతీతి. మొహర్రం కూడా మతాతీతమైన ఉత్సవంగా ప్రసిద్ధి. లోకుల ఇష్టసిద్ధిని తీర్చే పరమాత్ముడు ఒక్కడే అని తలచుకుని ఆ ఉత్సవకాలాలలో పరమాత్ముని చైతన్యము ఈ నగరంలో ప్రతిఫలించిందని తెలిపాడు. మొహర్రం పండగ కుతుబ్ షాహిల కాలంలో అప్పటి అధికారి మీర్ మోమిన్ అస్తరబాది చొరవతో హైదరాబాద్ నగరంలోకి ప్రవేశించిం దని చరిత్రకారుల అభిప్రాయం.

వీరాస్వామయ్య జూన్ చివరివారం, జూలై మొదటి వారాల్లో జంటనగరాల్లో బసచేసాడు. తెలంగాణలో జూలై మొదటివారం ఆషాడంలో ప్రారంభం అయ్యే బోనాల ఊరేగింపు గురించి ఎక్కడ ప్రస్తావించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ప్రాంతాలు మారితే కులాల ఆచార వ్యవహారాలు, అనుసరించే విధానాల్లో కూడా మార్పులు వస్తాయని వీరాస్వామయ్య రచన చదివితే స్పష్టం అవుతుంది. తెలంగాణలో ఉండే బ్రాహ్మలు ఉపయోగించే పంచాంగాలలో తిథి, వార, నక్షత్ర, యోగ, కరణాలు, అయః ప్రమాణాలలో అరగడియ వ్యత్యాసం ఉన్నట్టు చెప్పారు. ఇక్కడి వారు శూన్య తిథి, తిథి ద్వయాలు పాటిస్తలేరని అందుకే పంచాగ తిథుల లెక్కలలో వ్యత్యాసం కనిసిస్తుందన్నారు. బ్రాహ్మణులు ఆశీర్వాదం తీసుకునే పద్ధతి కూడా వేరేలా ఉందన్నారు. పంచాంగం చేతపట్టుకోవడం, పంచాంగ శ్రవణం ఇక్కడి ప్రజల అలవాటన్నారు. వీరాస్వామయ్య వర్షాకాలంలో తెలంగాణలో ప్రయాణం చేశాడు. అప్పుడు ఇక్కడ అనుసరిస్తున్న పండుగలు కార్తీక మాసపు వ్రతాలు, శ్రామణ మాసపు ఆచారాలను ప్రస్తావించారు.

దారిలో ఎదురయిన ప్రతి గుడిని, పుణ్యక్షేత్రాన్ని వీరాస్వామయ్య దర్శించాడు. గుడి స్థానిక చరిత్రను, ఇతర విశేషాలను, కట్టడ నైపుణ్యాన్ని పేర్కొన్నారు. దాదాపు వీరు చూసిన ప్రతి గుడి గురించి వీలైనంత పేర్కొన్నారు. ప్రత్యేక సంప్రదాయంతో కొనసాగుతున్న ఇందలవాయి గుడిని చాలా ప్రశంసించారు. ఇందలవాయిని రామస్థలం అన్నాడు. గుడి చక్కగా కట్టకపోయినా అక్కడ మర్యాదలు దక్షిణదేశపు సంప్రదాయాన్ననుసరించి ఉంటాయన్నారు. తెలంగాణ సాంప్రదాయంలో కొంత ఉత్తరభారత సంప్రదాయం ఉంటుందని అంటుంటారు. హోలికి కాముడిని కాల్చడం, దసరా పండగను ఘనంగా చేయడం అందుకు ఉదాహరణలుగా చూపిస్తారు.

ఇందలవాయి నిజామాబాద్ జిల్లాలో ఉంది. ఇది మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతం. ఇక్కడ ఉత్తర భారత సాంప్రదాయం ఎక్కువగా కనిపించాలి. కానీ ఏనుగుల వీరాస్వామయ్య ఇందలవాయి గుడిలో దక్షిణ భారత సాంప్రదాయం కనిపిస్తుందన్నారు. తిరుపతి తరువాత రాజోపచారములతో ఆరాధన నడిచే గుడి ఇదొక్కటే అని తెలిపారు. కుంపటిలో మొలిచిన తామర అంటూ ఒక పోలిక కూడా పోలిక పోల్చారు. ఈ ప్రాంతంలో ఉండే ఇతర మతాల ప్రభావం, సాంప్రదాయాలు వేరేలా ఉండటం వల్ల తనకు తెలిసిన సాంప్రదాయం కనిపించే సరికి ఆయన ఆ పోలిక పోల్చి ఉంటాడు. ఇందలవాయి చీలి జమిందారుని కింద ఉందని, అతని తరఫున ఈ ఊరి పట్టేల్ దేవాలయ నిర్వహణను చూసుకుంటున్నాడని తెలిపాడు.

ఇందలవాయి పక్కనే ఉన్న డిచ్‌పల్లి రామాలయంలో వీరాస్వామి దర్శించిన కాలానికి రాముడు కొలువై లేడు (తరువాత కాలంలో స్థానికంగా ఉన్న ఒక భక్తుడు తనకు సంతానం కలిగితే ఆ గుడిలో విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తానని మొక్కుకుని ఆ మొక్కు నెరవేర్చు కున్నాడు). డిచ్‌పల్లిలో ఉండాల్సిన దేవుడు ఇందలవాయిలో కొలువై ఆరాధనలు పొందుతున్నాడని వీరాస్వామయ్య తాను విన్న, చూసిన స్థితిగతులను చెప్పాడు. జగనంపల్లిలో ఉన్నప్పుడు వేములాడ ప్రస్తావన చేశాడు. జగనంపల్లి నుండి వేములవాడకు నాలుగు మజిలీల దూరమన్నాడు. హైదరాబాద్‌లో ఉన్న మక్కామజ్జీత్ గురించి కూడా ప్రస్తావన చేశాడు. హైదరాబాదులో ఎక్కువ హిందూ దేవాలయాలు లేవనీ అవి ఉన్నా వృద్ధికి రానియ్యరనే ఒక స్వీయ అభిప్రాయాన్ని వీరాస్వామి వ్యక్తం చేశాడు.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4  హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# దర్శకులకు మార్గదర్శకులు డా. టి.వి. నారాయణ

**డా. గుండెడప్ప కనకయ్య,** సీనియర్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయన శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం, నిజామాబాద్.
ఫోన్ : 9949119609

తన కొరకు తానే బతుకకుండా పొరుగు వారి కొరకు బతకడమే నిజమైన బతుకు అని నిజమైన మనిషి బతుకుకు నిఖార్సైన నిర్వచనం ఇచ్చిన వ్యక్తి డా॥ టి.వి. నారాయణ. మన చుట్టూ ఉన్న వారి సుఖం, మనకోసం ఆలోచించేవారినే కాకుండా పరుల సుఖంలోనే నీ సుఖాన్ని చూసుకొమ్మన్నారు. పరోపకారమే పరమావధిగా, అపకారికి ఉపకారం చేయటం మనిషి నిత్య కృత్యం కావాలని కోరుకున్నాడు. సుఖ సంతోషాలను తమలో తాము ఇముడ్చుకొని ఇతరుల దుఃఖాన్ని మనదేనని అనుకొని పంచుకొమ్మంటాడు. అంతేకాదు ప్రపంచానికి దయను పంచి పెట్టుమన్నారు. మనిషి నిగర్వీగా ఉండాలన్నా... కీర్తి ప్రతిష్టలు పొందాలన్నా.... మనిషిలో నిబిడీకృతమై ఉన్న స్వార్థాన్ని విడనాడాలని, స్వార్థరహిత కర్మలోనే పరమార్థం పునికిసలాడు తుంటుందనీ, కామరహిత కర్మలోనే అమరశాంతి సిద్ధిస్తుందనీ, నిష్కామకర్మలోనే మర్మమున్నదనీ ఇలా అనేక అంశాలు ప్రస్తావించారు. నిజమైన మనిషి అభివృద్ధి నిజమైన గెలుపు అనేది మనిషి సంతృప్తి చెందినపుడే సాధ్యమవుతుంది. ఆ గమ్యం చేరుకోవాలంటే మనిషి కర్మ చేసినప్పుడే మనిషి బతుకు శాంతిధామం అవుతుందంటాడు. ఇలా చెప్పుకుంటూ పోతే టి.వి.నారాయణ గారి జీవితమంతా మార్గదర్శక సూత్రాలతోనే నిండి ఉంటుంది. ఆయనను ఒక వక్త అంటారు. మరికొందరు ఒక మహా ప్రవక్త అంటారు. కారణం ఆయన తన జీవితంలో చేసిన అత్యంత గొప్ప ప్రబోధాలు. ఆయన చివరిశ్వాస వరకు ఈ ప్రబోధాలనే తన జీవితం నిండా పండించుకొన్నాడు. ఒక సమున్నత స్థానానికి ఎదిగినవాడు. ఆయన మంచినే ఆలోచిస్తాడు. మంచినే ఆచరిస్తాడు. తద్వారా ఫలితాలు మంచివే సాధిస్తాడు. మంచినే ఆచరించుమంటాడు. మంచి ఫలితాలే సాధించుమంటాడు. పనిచేస్తూనే పరమార్థం వైపుగా వెళ్లుమంటాడు. సోమరితనం వద్దంటాడు. ఎందుకంటే ఆయన పనినే పరమాత్మ అంటాడు. అందుకే ఆయన ఒక మహోన్నత విద్వత్తరంగం, ఒక ఉదాత్త హిమాలయోన్నత శిఖరం.



డా॥ టి.వి.నారాయణ పూర్వీకులు తక్కెళ్లపాడు గ్రామంలో నివసించేవారు. ఆ కారణంగానే వీరి ఇంటిపేరు 'తక్కెళ్ల'గా స్థిరపడింది. వీరి పూర్వీకుల్లో కొందరు సైన్యంలో పనిచేశారు. తండ్రి శ్రీ వెంకయ్య బ్రిటీషు సైన్యంలో పనిచేశారు. ఆ రోజుల్లోనే సైన్యంలో పనిచేస్తూ... యూరోపులోని పారిస్ వరకు వెళ్లి వచ్చిన వ్యక్తి. వెంకయ్య గారికి గొంతుచికిత్స అవసరం పడితే అక్కడ వారు మహిళా డాక్టరుతో గొంతు చికిత్స కూడా చేయించుకొన్నారు. అయినా గానీ ఆయన సైన్యంలో విశిష్ట సేవలందించారు. ఆయన తన సైన్య సేవకు గానూ, యుద్ధనైపుణ్య ప్రదర్శనకు గాను సమర పతకాలు (మెడల్స్) అందుకొన్నారు. అటువంటి శ్రీ వెంకయ్య గారి సంతానమే డా॥ టి.వి.నారాయణ. ఈయన కుటుంబం సమాజంలో ఎటువంటి వ్యతిరేకత పొందిన వారు కారు. పైగా తమ సామాజికవర్గంలో మొదటినుండి గౌరవింపబడుతున్న కుటుంబం. డా॥ టి.వి. నారాయణ సికింద్రాబాద్‌లోని బొల్లారంలో చదువుకొన్నారు. తన తండ్రి వెంకయ్య సైన్య పదవీ విరమణానంతరం చెప్పులు, బూట్లు తయారు చేసే పనిలో స్థిరపడ్డారు. అందులో అపారమైన అనుభవాన్నీ, నైపుణ్యాన్ని సంపాదించారు. ఆ సమయంలోనే ఆయన ఆర్య సమాజ ప్రభావంలో పడ్డారు. అందులో సేవ చేయడం. ప్రారంభించారు. వెంకయ్య ప్రతి విషయంలోనూ ఆయన సూటిగా ఉండేవారు, సత్యవాదిగా నమ్మకస్తునిగా పేరు సంపాదించుకొన్నారు. ఆయన మాటల్ని, సలహాల్ని పదిమంది నమ్మి పాటించి ప్రయోజకులయ్యారు. వెంకయ్య పుస్తక ప్రియుడు. అంతేగాక ప్రధానమైన మూడు మతాల పవిత్ర గ్రంథాలను కూలంకషంగా అధ్యయనం చేశారు.

ఆర్య సమాజ పద్ధతిలో జీవన శైలి కొనసాగించిన కారణంగా ఆయన తన పిల్లలకు 'సంధ్యావందనం' (సంధ్య) ఆచరించే పద్ధతిని నేర్పించారు. వెంకయ్య సహృదయ తత్వం గల వాడిగా సమాజంలో కొనసాగుతున్న సమయంలో ఆయన టి.బి. వ్యాధి బారినపడ్డాడు. సరియైన వైద్యం అందక ఆయన యువకునిగానే కన్నుమూశారు. అప్పుడు విద్యార్థి నారాయణ వయస్సు 14 సంవత్సరాలు. ఆ

వయసులో 9వ తరగతి చదువుతున్నారు. తల్లి నరసమ్మ కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించి పిల్లల విద్య మీద దృష్టి నిలిపింది. భర్త ఉన్నప్పటి నుండి ఆమె ఏదో ఒక పనిచేస్తుండేది. ప్రధానంగా ఆమె బీడీ ఫ్యాక్టరీలో పనిచేసి కుటుంబాన్ని సంరక్షించింది.

ఆ తల్లికి 1925 జులై 26వ తేదీన జన్మించిన టి.వి.నారాయణ కుటుంబంలో రెండవ సంతానం. ఆయన జనవరి 11, 2022 నాడు పరమపదించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్యసమాజ విస్తరణను సోమదేవ శాస్త్రి చేపట్టారు. ఆ సమయంలో తమదైన శైలిలో ప్రచారం చేసారు. నిజాం పరిపాలనలో ధార్మిక సంస్కృతీ వికాసంలో దేశంలో అన్ని ప్రాంతాల కంటే వెనుకబడ్డ తెలంగాణాలో సోమదేవశాస్త్రి ఆర్ష విజ్ఞానాన్ని ప్రచారం చేశారు. హోమాది కార్యక్రమాల ద్వారా పదిమందిని సమకూర్చుకోవడం, వారికి సనాతనమైన వేద ధర్మం గొప్పతనం తెలిసేట్టుగా మంత్రార్థాలు వివరించడం చేస్తుండేవారు. ఆయన గొప్ప సంస్కృత విద్వాంసులైన కారణంగా, హిందీ, తెలుగు భాషల్లోనూ మంచి పాండిత్యం ఉన్న కారణంగా ఆయా భాషల వారికి సంస్కృతంలోని మానవీయ, తాత్త్విక, సాంస్కృతిక విలువలతో కూడుకొన్న అనేక అంశాలు వారి బోధనల్లో ఉండేవి. ఆ కారణంగా ఎందరో ఆర్య సమాజం వైపు మొగ్గు చూపారు. ఈయన సమక్షంలో టి.వి. నారాయణ శిష్యునిగా చేరాడు. టి.వి. నారాయణ ప్రప్రథమ గురువు సోమదేవ శాస్త్రి. సంస్కృతంలోని వేదాల, ఉపనిషత్తుల తత్త్వసారాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేశారు. ఆర్యసమాజ మందిరంలో శాస్త్రి వారి ఉపన్యాసాలు. నిరంతరం కొనసాగేవి. వారు ఆర్య సమాజ స్థాపకులైన మహర్షి దయానందుల వారి సత్యార్థ ప్రకాశంలోని అనేక అంశాలు బోధించేవారు. అందులోని సామాజిక సమానత్వ ప్రతిపాదనలన్నీ వైదిక సిద్ధాంతాలే అన్న సత్యవాక్యాలు వేదాలలోనివే అని ప్రబోధించేవారు. కులవర్ణ భేదాలతో ఉన్న హిందూ సమాజాన్ని, ఏకతా పథంలో నడపడానికి ఈ ఆర్య సమాజ శాస్త్ర ప్రబోధాలు బాగా పనిచేశాయి.


ఈ ప్రబోధాల వల్లనే టివి నారాయణ గారి భవిష్యత్తు వికాసానికి ఆర్య సమాజమే పునాదిగా నిలిచింది. చిన్నతనంలో నాటుకొన్న ఈ భావాలే నారాయణ వ్యక్తిత్వ వికాసానికి దోహద పడ్డాయి. ప్రప్రథమంగా టి.వి. నారాయణ బొల్లారంలోని ఆర్య సమాజంలో తన అధ్యయనాన్ని ప్రారంభించారు. ఆ చదువుల ప్రారంభంలో ఒక పవిత్రత కనిపించింది. ఓంకారంతో ప్రారంభించడం, ధ్యానంలో కూచోబెట్టడం, వైదిక ప్రార్థనలు చేయించడం, వీటన్నిటి తర్వాత ఏర్పడే చెక్కుచెదరని మానసిక స్థితి, చెవుల్లో మోగుతున్న ఓంకార నాదం... ఇలా ఇవన్నీ ఆయనను ప్రభావితం చేశాయి. ఆర్యసమాజంలోనే వారు యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం యోగా నేర్చుకొని ఆచరించారు. పదిమందికి వీటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. సంధ్యా వందనాలు, యజ్ఞ హోమాలను నిర్వహించారు. సత్సంగం వంటి వైదిక కార్యక్రమాలలో పాల్గొనటమే గాక అనేక కార్యక్రమాలను నిర్వహించారు.

టి.వి. నారాయణ నిత్య అధ్యయన శీలి. ఆయన వేదాలు చదివి, భగవద్గీతను అధ్యయనం చేసి, ఉపనిషత్తులను అవపోసన పట్టి వాటన్నింటిపైనా సాధికారికమైన జ్ఞానాన్ని సంపాదించారు. తద్వారా ఆయన వేద విజ్ఞానిగా అపూర్వ గౌరవాన్ని పొందారు. మహర్షి దయానంద సరస్వతి సత్యార్థ ప్రకాశ్ గ్రంథంపై వారు సాధికారికమైన వ్యాఖ్యానం చేసేవారు. వారి ప్రసంగాలలో ఆ గ్రంథంలోని అనేక నిర్వచనాలు అందించేవారు. దానివల్ల వారి ప్రసంగాలకు ప్రామాణికత ఏర్పడింది. ఆర్య సమాజ ప్రభావంతో ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉన్నా, ఆదర్శ భావాలను మనస్ఫూర్తిగా ఆహ్వానించి, సమాజ సంస్కరణలను కోరిన సంస్కర్తగా దార్శనికునిగా, అభ్యుదయ భావాలను అనుష్టించిన ప్రగతిశీలురుగా నిలిచారు. సామాజిక దురాచారాలను రూపుమాపి నీతిమంతమైన వ్యవస్థ నిర్మాణం చేయాలని వారు ఆర్య సమాజ భావాలతో ప్రబోధించారు. మహిళలకు ఆర్య సమాజం మహోన్నత స్థానాన్నిచ్చిందని, సమాజ సముద్ధరణంలో దేశసేవలో స్త్రీలు సమర్థవంతమైన పాత్రను పోషించాలని, జాతీయభావాలతో దేశ ప్రగతికి భాగస్వామ్యాన్ని అందించాలని మహిళల సభల్లో తెలియజేస్తూ.... మహిళలను చైతన్య పరిచేవారు. ఈ నా ప్రబోధాల చేత ప్రభావితం అయిన స్త్రీలు ప్రజాస్వామ్య పరిరక్షణలో సముచితంగా వ్యవహరించాలని కోరేవారు. సంస్థాగతంగా సమస్యలు ఉత్పన్నమైనపుడు స్త్రీలకు సమాన న్యాయం చేసేవాడు. అలాగే పురుషులను కూడా రెట్టింపు సాహసోపేత నిర్ణయాలను తీసుకోవాలని, సందర్భోచిత పాత్రను పోషించాలని జ్ఞానబోధ చేసేవారు. ఇలా ఆర్యసమాజ భావాల ద్వారా ఒక సాంస్కృతిక జాతీయాభ్యుదయ భావాలను వ్యాపింప చేసి, భాగ్యనగరంలోనే గాక ఆంధ్రదేశమంతటా ముఖ్యంగా తెలంగాణాలో ఆర్యసమాజానికే వన్నె తెచ్చిపెట్టిన మహామనీషి డా॥ టి.వి. నారాయణ. ఆర్యసమాజంలో ఒక విద్యార్థిగా జీవనం ప్రారంభించిన టి.వి. నారాయణ, కార్యకర్తగా, కార్యదర్శిగా ఎదగటం, తద్వారా 1999లో ఆంధ్రప్రదేశ్ ఆర్య ప్రతినిధి సభకు అధ్యక్షులు కావటం, ఆయన తన జీవితంలో చేసిన కృషి ఫలితమే. అందుకే ఈ సమాజంలో దర్శకులకే మార్గదర్శకులుగా నిలిచిన గొప్పవ్యక్తిగా ఆయనను అభివర్ణించవచ్చు.

**(డా॥ టి.వి.నారాయణ తేది జనవరి 11, 2022 నాడు పరమపదించిన సందర్భంగా)**

# వైవిధ్యభరితం - 'రాజశేఖర చరిత్రము'

**డా. బడిగె ఉమేశ్,** అసోసియేట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు. **ఫోన్ :** 9494815854




**"ఈ కావ్యం ఇంత చిన్నదైనా మన సాహిత్యంలో దీనికొక ప్రత్యేకమైన స్థానం, దీని రచయితకొక శాశ్వతమైన కీర్తి ఉన్నాయి. అనంతర కవులకు కావ్యాలకు కథా ప్రణాళికలకు ఈ రాజశేఖర చరిత్ర ప్రస్ఫుటమైన నమూన"** అని ఆరుద్ర (సమగ్రాంధ్ర సాహిత్యం రెండవ సంపుటి, 29) కొనియాడారు. సాధారణంగా ప్రబంధ కవులు శృంగార వర్ణనలకే పరిమితమైయ్యారు కానీ సమకాలీన సాంఘిక అంశాలను పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఆ విమర్శలకు ఆచరణాత్మకమైన సమాధానమన్నట్లుగా మహాకవి మాదయగారి మల్లన రాజశేఖర చరిత్రము అనే ప్రబంధాన్ని రాశాడు. ఈయన తన కావ్యంలో ఆసక్తి, ఆలోచన, స్ఫూర్తి కలిగించే ఎన్నో విశేషాలను తెలిపారు. ఇది మూడు ఆశ్వాసాల కావ్యం. దీనిని నాదెండ్ల అప్పనమంత్రికి అంకితం ఇచ్చారు. ఇందులో మల్లన ప్రస్తావించిన కవిత్వ లక్ష్యాన్ని, పేదరికపు బాధను, కుల ప్రస్తావనను, విద్యా విలువను పేర్కొన్నాడు.

మల్లన కవి ఈ ప్రబంధంలో వర్ణనల విషయంలో అతిశయం ప్రదర్శించలేదు. ఎంతో హృద్యంగా, ఆహ్లాద భరితంగా చెప్పాల్సిన విషయాల్ని సుస్పష్టం చేశారు. కావ్య ప్రారంభంలోనే కవిత్వానికి ఉండాల్సిన లక్షణాల్ని తెలిపి తమ ఔచిత్యాన్ని చాటుకున్నారు.

**చెప్పఁదగుఁ గవిత రసముల్**
**చిప్పిల నప్పప్ప బళిబళీయన లేదా**
**యెప్పుడుఁజేయకయుండుట**
**యొప్పుఁజుమీ! సుకవియెంతయుచితజ్ఞుఁడొకో! (1.8)**

కావ్యంలో రసాలు తొణికిసలాడాలి. విన్న శ్రోతలు అప్పప్పా! బళిబళీ! అని ప్రశంసించేటట్టు కవిత్వం చెప్పాలి. ఎవరైనా అలా చెబితేనే బాగుంటుంది. కవిత్వాన్ని శక్తిమంతంగా రాయలేకపోతే మిన్నకుండడం మంచిది కదా! అని పద్య భావం. కవిత్వం రాయకపోవడం అధర్మమూ మహాపాపమూ కాదు. రాయకపోతే ఎవడూ మరణ దండన విధించడు. చచ్చిపోడు. కుకవిత్వం రాస్తే మాత్రం అది అతడికే కాదు అందరికీ నరకమేనని బుద్ధిమంతుల భావన.

ప్రబంధయుగంలో అంగళ్ళలో రతనాలు రాసులుగా పోసి అమ్మారు. ప్రభువులు మహాకవులకు విశేష సత్కారాలు చేశారు. వారి దృష్టి ఎంతసేపు ఎత్తైన మేడలమీద, గోడలమీద ఉన్నది తప్ప సామాన్య ప్రజల గోడును పట్టించుకునే స్థితి ప్రబంధ కవులకు లేదు. వారికి పేదరికం అంటే తెలీదు. పేదల గురించిన అవగాహనే లేదనే విమర్శ ఉంది. దీనిని మాదయగారి మల్లన బద్దలు కొట్టారని చెప్పాలి. మల్లన ప్రబంధకవి అయినా, రాజుల కొలువుకూటంలో సత్కారాలు పొందినా సామాన్య ప్రజల కష్టాలను మరవలేదు. జీవిత సత్యాన్ని విస్మరించలేదు.

కవి అంటే కష్టజీవికి అటుఇటు ఉండేవాడని శ్రీశ్రీ అన్నంత కాకపోయినా మల్లన కొంతమేరకు తన కాలపరిధిని దాటి ఆలోచించారు. పేదరికం ఎన్నో ఇబ్బందుల్ని కలిగిస్తుందని కవి ఈ కావ్యం ద్వారా తెలిపారు. ప్రబంధ వాఙ్మయం పేదరికాన్ని ప్రతిసారీ వాపోలేదుగానీ, పేదరికాన్ని తొలగించడానికి కావాల్సిన దారులు వెతికింది. ధార్మికమైన వైభవం ద్వారా మానవుడు అద్వితీయమైన సుఖసంపదలు అందుకునే అవకాశం ఉంది. ప్రబంధకవులు పేదరికం గురించి ఏమాత్రం తెలియనివారు కారు. పైగా దాన్ని స్పృశించని వారూ కాదని మాదయగారి మల్లన 'రాజశేఖరచరిత్రము' అనే కావ్యాన్ని చదివితే తెలుస్తుంది. వెరసి ప్రబంధయుగ గౌరవాన్ని కూడా కాపాడిన మహాకవి మల్లన. ఈయన తమకావ్యంలో సమకాలీన సామాజికాంశాల్ని ప్రస్తావించి అందరిని మేల్కొలిపారు. కవులు, కళాకారులు ఎవరైనా పేదరికం వల్లే రాజుల్ని ఆశ్రయిస్తారు. మామూలుగా లక్ష్మీదేవిని అందరూ పూజిస్తారు. ఆమె వైభవాన్ని కూడా పొగుడుతుంటారు. కానీ ఆమె కంటే ఆమె అక్క గారైనటువంటి (పేదరికం) పెద్దమ్మను గురించి పట్టించుకోవడం చాలా తక్కువని గమనించిన సందర్భాన్ని గుర్తు చేసే పద్యాన్ని చూడండి.

**కులనిర్మూలనకారణంబు, ప్రతిభా కుట్టాక, ముద్వేగ కో**
**పలతాదోహద, మూజవంజవసుఖ ప్రత్యూహ, మాతృవ్యధా**
**జ్వలన జ్వాలిక, కామినీ నయన వీక్షాపాత సంరోధి, ని**
**త్యలఘుత్వాశ్రయభూమి, లేమి యదియాహా! యేమిగావింపదో** (3.14)

పేదరికం వల్ల అందరిలోన మనం నిశ్శబ్దంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎంతటి ప్రతిభావంతుడుకైనా ధనం లేకపోతే చదువుకోలేని పరిస్థితి దాపురిస్తుంది. ఆనాటి నుంచి ఈనాటి వరకు గురువు దగ్గరికి చేరి చదువుకోవాలంటే, ఆయనకు గురుదక్షిణ ఇవ్వాలంటే బుద్ధిమంతుడికి పేదరికం చాలా అడ్డంకి. దీనివల్ల మానసిక ఒత్తిడి కలుగుతుంది. ఈ మానవజన్మ ఎత్తినందుకు ఏదో సుఖపడాలని ఆశపడతాం. కానీ లేమి వల్ల మనం కోరుకున్నది తినలేం, తాగలేం, చూడలేం అని అంటాడు కవి. లేమి అనేది మనలో దుఃఖాగ్నిని రేపుతుంది. నాలుగు రూకలుంటే మనవైపు అందరూ చూస్తారు. కాని పేదరికం ఉంటే అసలు చూడరు. ఏ విషయానికైనా మనం చిన్నగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పేదరికం మనల్ని ఒక చోట దాక్కునేలా చేస్తుంది. లఘువుగానే ఉండేట్లు చేస్తుంది తప్ప గురువుగా వుండనీదని కవి పేదరిక ప్రభావాన్ని కళ్లకు కట్టించారు.

మరోపద్యం ద్వారా మల్లన వ్యక్తిత్వవికాసాన్ని పెంపొందించే ప్రయత్నం కూడా చేశారు. మనిషిని దారిద్ర్యం ఎంత చుట్టుముట్టినా స్థితప్రజ్ఞత ఉండాలని, ఎంత కష్టమొచ్చినా నిలబడి గెలవాలని ఉద్బోధించిన పద్యాన్ని చూద్దాం.

**అట్టి దారిద్ర్యదోషసంప్రాప్తుఁడయ్యుఁ**
**జిత్తవీథినొకింతయుఁజింతలేక**
**నియమపరతనిజాచారనిరతుఁడగుచు**
**నడవఁదత్కాంతమదినొక్కనాఁడువిసివి. (3.17)**

కష్టాలు ఎంత పీడించినా అరుణుడు తన మనసులో కాసింతయినా చింతిల్లేవాడు కాదు. చింతను దరిజేరనివ్వకుండా, నియమనిష్ఠలతో తన సదాచారాల్లోనూ సన్మార్గాల్లోనూ నిరతుడై జీవయాత్ర సాగించాడు. కాని భార్య మాత్రం విసిగిపోయి కొన్ని మాటలు అన్నది. ఎవరు ఎన్నిమాటలు అన్నకూడా కష్టాలు వచ్చినప్పుడు సంయమనం పాటించాలి తప్పా మతితప్పి ప్రవర్తించడం మంచిది కాదని కవి చెప్పాడు. కావ్యంలోని రాజు, రాణి ధనవంతులైనప్పటికి పేదల గురించి పట్టించుకోవాలని ఆకాంక్షించారు. పేదల దుఃఖాన్ని గుర్తించాలని కవి ఈ కావ్యం ద్వారా నొక్కి వక్కాణించారు.

తెలుగు సాహిత్యంలో పదహారవ శతాబ్దం ప్రబంధాలకు స్వర్ణ యుగంగా భాసిల్లింది. మనుచరిత్ర, ఆముక్తమాల్యద, పారిజాతాపహరణం, రాజశేఖరచరిత్రము, వసుచరిత్ర మొదలైనవి ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించిన ప్రబంధాలు. వీటిలో శృంగార వర్ణనలతో పాటు సమకాలీన సాంఘిక అంశాల్ని కూడా అక్కడక్కడ ప్రస్తావించారు. ప్రత్యేకించి మాదయగారి 'రాజశేఖర చరిత్రము' కావ్యంలో అది కాస్త ఎక్కువగా కనబడుతుంది.

ఈ ప్రబంధంలో కులప్రస్తావన కూడా ఉంది. ప్రస్తుతం మనం కులరక్కసితో కొట్టుమిట్టాడుతున్న సమాజంలో బతుకుతున్నాం. మా కులం గొప్ప అంటే మా కులం గొప్పనే ఆలోచనతోనే ఉన్నాం. దేనికి విముక్తి ఇచ్చినా కులానికి విముక్తి ఇవ్వలేనమనే చట్రంలోకి నెట్టివేయబడ్డాం. అసలు మనం ఇదే కులంలో పుడతామని, పుట్టాలని ఎవరు ఊహిస్తారు. ఒకవేళ అలా అనుకున్నా అది సాధ్యమేనా? ఇదంతా భగవంతుడి సృష్టే తప్ప మనుషుల చేతిలో ఏముంటుందన్న సత్యాన్ని అద్దం పట్టించే పద్యం చిత్తగించండి.

**కులమునఁబడునో!బహువి**
**ద్యలఁబడునో! బుద్ధిఁబడునొ! తరుణీ! యేలా**
**వలవని దురాశ లెందుం**
**గలుగదువో బ్రతుకు పూర్వకర్మము దక్కన్ (3.24)**

ఓ ఇల్లాలా! జన్మం అనేది ఉన్నత వంశంలో సంభవిస్తుందో! అనేక విద్యలతో నడుస్తుందో! బుద్ధి వైభవంతోనే సాగుతుందో! ఎవడు ఎక్కడ ఎలా జన్మిస్తాడో! ఏ సంపదతో పుడుతాడో ఎవడికి తెలుసు! కోరదగని, సాధ్యంకాని దురాశలు ఎందుకు చెప్పు? పూర్వజన్మలో చేసుకున్న కర్మల ఫలంగానే తప్ప ఎవరికీ ఎక్కడా ఏ జన్మం, ఏ జీవితం లభించునో సుమా! అని పద్య భావం. ఈ ధర్మ సందేశాన్ని గమనించక కొందరు నేడు కులమూ, కులమూ అని విర్రవీగుతున్నారు.

కొందరు ధనవంతుల్ని చూసి లేదా గొప్ప విద్యావంతుల్ని చూసి వీరికేం మంచి జీవితం అనుకుంటారు. కానీ కష్టాలనేవి ధనవంతులకైనా పేదలకైనా సమానమన్నది జగమెరిగిన సత్యం. దీని గురించి కవి ఆనాడే ప్రస్తావించారు.

**కం.ఏరికి బుద్ధి బలంబులు**
**కారణములు గావుసువ్వె! కలరే ధాత్రిన్**
**నేరిచిబ్రతికినవారలు**
**నేరకచెడ్డట్టివారు? నీరజనేత్రా! (3.25)**

ఈ బతుకులనేవి హాయిగా వైభవంగా సాగడానికి ఎరికైనా సరే విద్యాబుద్ధులు కారణాలు కావు. విద్య, బుద్ధి, బలం ఇవి ఉన్నంత మాత్రాన వారివారి బ్రదుకులు సుఖంగా సాగుతాయని చెప్పలేం. ఈ భూగోళంలో విద్యావంతులైన వారందరూ సుఖసంతోషాలతో రాణించారా? విద్యావంతులు కాని వారందరూ చెడిపోయారా? నేరిచి బదికినవారూ నేరక చెడినవారూ ఉన్నారా? నేరిచి చెడినవారూ ఉన్నారు. నేరక హాయిగా బదికినవారూ ఉన్నారనడం ఎవరి అదృష్టం వారిదని పద్య సారాంశం. ఇలా మాదయగారి మల్లన ప్రతిభను, పేదరికాన్ని, కులాన్ని, విద్యను మొదలైన సమకాలీనాంశాలను సూక్ష్మబుద్ధితో పరిశీలించారు. అలాగే ఈ కావ్యంలో రాజుల పరిపాలన విధానాన్ని, రాజ్యవైభవాన్ని, ప్రేమ వ్యవహారాన్ని, పెళ్ళి

సంప్రదాయాన్ని మొదలైన విషయాల్ని సందర్భోచితంగా వర్ణించారు. కె.వి.ఆర్. నరసింహం గారన్నట్లు **"ఈతని కవిత్వమునకు ముఖ్య లక్షణములు రెండుగాఉగన్పట్టుచున్నవి. ఒకటి ఔచిత్య పరిజ్ఞానము. రెండవది సంయమనము. శృంగార వర్ణనములను కవులు వెఱ్ఱి తలలు వేయు నక్కాలమునఁ గూడ నీతఁడు తన శృంగార వర్ణనలను లజ్జా వినయ సంభరితములుగనే వర్ణించియున్నాడు."** (ఆంధ్ర ప్రబంధములు–అవతరణ వికాసము, 186). ఈ భూమిక నుండి కూడా మాదయగారి మల్లనని అధ్యయనం చేయాలి. భావవాదాన్ని నమ్మినా భౌతికవాద వాస్తవికాంశాల ప్రస్తావనని మల్లనలో గుర్తించాలి.

ఇలా వైవిధ్యభరితమైన అంశాలన్నీ పాఠకులకు గొప్పవిజ్ఞానాన్ని, ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. అంతేకాదు నూతన ఆలోచనలకు, పరిశోధనలకు దారి తీయిస్తుంది. మల్లన రాసిన ఈ ప్రబంధం వివక్షకు గురైందని అనిపిస్తుంది. ఇది అంతుచిక్కని ప్రశ్న. దీని కారణాలుగా వెనకబడిన ప్రాంతం కవి అనా? లేదా అష్టదిగ్గజాల్లో అంత గుర్తింపు లేని కవి అనా? అనే ప్రశ్నలు స్ఫురించే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికి ఇంతమంచి కావ్యానికి ఆదరణ కరువవడం చింతనీయం. అయితే 2018లో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం 'పాఠకమిత్ర' పేరుతో వ్యాఖ్యానం రాసి మళ్ళీ ఆధునిక పాఠకలోకానికి పరిచయం చేసి, గొప్ప ఉపకారం చేశారు. వీరు కావ్యంలోని ప్రతిపద్యానికీ, అక్కడక్కడున్న వచనానికీ పదవిభజన, అన్వయక్రమం, కొత్తపదాలకు అర్థాల్ని పేర్కొని, తాత్పర్యాన్ని కూడా పొందుపరిచారు. ఇది సాధారణ పాఠకులకుకూడా హాయిగా అర్థమవుతుంది. ఈ కావ్య సౌందర్యాన్నీ, ప్రాముఖ్యాన్ని తెలుసుకోవడానికి ఈ వ్యాఖ్యానం దారిదీపంగా తోడ్పడుతుంది. విజ్ఞులైన పాఠకులకు ఈ ప్రబంధం విందు భోజనమే. ఆరగించడమే మరి ఆలస్యం.

పుస్తకం లభించేచోటు: అమరావతి పబ్లికేషన్స్, గుంటూరు. 9291530714.

**ఆధార గ్రంథాలు :**

1. మాదయగారి మల్లన 'రాజశేఖరచరిత్రము', వ్యాఖ్యాత: బేతవోలు రామబ్రహ్మం, అమరావతి పబ్లికేషన్, గుంటూరు, 2018.


2. 'ఆంధ్ర ప్రబంధములు – అవతరణ వికాసము', కె. వి. ఆర్. నరసింహం, ఆంధ్ర యూనివర్సిటీ ప్రెస్, వాల్తేరు, 1985.

3. సమగ్ర ఆంధ్ర సాహిత్యం, (రెండవ సంపుటి) ఆరుద్ర, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 2017.

---

## సత్సంగం

### శిష్యులకు ఋషుల సత్సంగమూ, వారి సేవ



సత్సంగమంటే అవ్యక్తమైన సత్‌తో కలిసి ఉండటమనే అర్థం. అది అందరికీ సాధ్యం కాదు. అందువల్ల వారు అభివ్యక్తమైన సత్‌తో, అంటే గురువుతో, కలిసి ఉండాలి. ఆలోచనలు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. కాబట్టి ఋషులతో గడపాల్సిన అవసరం ఉంది. ఋషి ఇటువంటి మానసిక స్థితిని దాటి, ప్రశాంతంగా ఉంటాడు. ఆయన సమీపాన ఉండటం వల్ల ఇతరులకి కూడ ఆ స్థితే సంప్రాప్తిస్తుంది. లేకపోతే, ఆయన సామీప్యాన్ని కోరుకోవటంలో అర్థం లేదు. ఇతరులకి తెలియకుండా అవసరమైన శక్తిని గురువు అనుగ్రహిస్తాడు. ఇక సేవ అంటావా, ముఖ్యంగా ఆత్మనిష్ఠ కోసమే అది. సేవలో, గురువు దేహం సుఖంగా ఉండేట్టూ, ఆయన నివాసం శుభ్రంగా ఉండేట్టూ చూడటం కూడా ఇమిడి ఉన్నాయి. గురువుతో సంపర్కం అవసరం. కాని అది ఆధ్యాత్మిక సంపర్కమే. గురువుని అంతరంగంలోనే గ్రహించగలిగితే, శిష్యుడు ఎక్కడికి వెళ్ళినా ఫరవాలేదు. ఇక్కడున్నా, ఎక్కడున్నా ఫలితం ఒకటే అని గ్రహించాలి.

సత్ అంటే అహం ప్రత్యయసారం. అంటే ఆత్మలకు ఆత్మ. సాధువు అంటే అదే. సర్వాంతర్యామి. ఆత్మ లేకుండా ఎవరైనా ఉండగలరా? అందువల్ల సత్సంగానికి బయట ఎవ్వరూ ఉండరు.

గురువుకు భౌతికంగా సమీపంలో ఉండటం వల్ల ప్రయోజనం లేదు. మనస్సే ముఖ్యం. సంపర్కాన్ని పెట్టుకోవలసింది, మనస్సే. సత్సంగం వల్ల మనస్సు హృదయం లోకి వెళ్ళిపోతుంది.

అటువంటి సాంగత్యం భౌతికమూ, మానసికమూ కూడా. బయటకు కనబడే గురువు మనస్సుని లోపలికి తోస్తాడు. అతడు సాధకుని హృదయంలో కూడా ఉంటాడు. అందువల్ల, అంతర్ముఖుడైన వాని మనస్సుని హృదయంలోకి లాగుతాడు.

సత్‌తో అంటే సత్యంతో కలిసి ఉండటమే సత్సంగం. సత్‌ను ఎరిగినవాడినీ, గ్రహించిన వాడినీ కూడా సత్ అనే అంటారు. సత్‌తో గాని, గ్రహించినవానితో గాని కలిసి ఉండటమనేది తప్పనిసరి అందరికీ. సత్ అంటే ఆత్మే. ఆత్మే సత్ అని తెలియకపోవడం వల్ల, ఆ జ్ఞానం కల ఋషి యొక్క సాంగత్యాన్ని వెతుక్కుంటాం. అదే సత్సంగం. అంతర్దృష్టి కలుగుతుంది. సత్ సాక్షాత్కరిస్తుంది.

# భారత వీర!!

చక్కని మాటతీరు వినచక్కని స్పందన వచ్చు! వచ్చినన్
చక్కగ జీవితాల ఘన శక్తులు నిండును! నిండు మాటతో
చిక్కని మైత్రి చేకురును! చేకుర గల్గును చేతనత్వమే
చక్కని మాట చాటు! మన శక్తిని, భారత వీరపుత్రుడా!

భారత మాత పుత్రివయి, బంగరు బాలిక రూపమెత్తి, నీ
ధీరత ధాత్రి జూపి, మన దేశపు కీర్తిని విశ్వమంతటన్
చేరగ, వారసత్వమగు చిన్మయ శక్తివి నీవు! నీవెగా
వీర రసాకృతీ ద్యుతివి! వేల్పువు! భారత వీరపుత్రికా!!

వీరుల గన్న తల్లి! యరి వీర భయంకర శత్రుసేనపై
పోరెడు శౌర్యమూర్తులను పొల్పుగ దీర్చిన తల్లి! శక్తులొ
ధీర వరాగ్ర తేజులకు దీధితులద్దిన తల్లి! దివ్యమౌ
భారత పుణ్యభూమి! యిదె పావని! భారత వీరపుత్రుడా!!

కత్తిని బట్టి శాత్రవుల కంఠము ద్రుంచు శివాజి యుక్తులన్
మొత్తము నింపుకొమ్ము! ధర ముక్తిని గూర్చెడు దివ్యశక్తివై
చిత్తము దేశభక్తిమయ చెల్వము లొల్కెడు శిల్పమట్లుగా
నుత్తమ దీప్తిరేఖవవు యోధుడ! భారత వీరపుత్రుడా!!

వరలుము ఝాన్సిలక్ష్మి వలె! వారసురాలిగ ఖడ్గమెత్తు! యీ
యరులను సంహరించు! పరమార్థము జన్మకు గల్గునప్పుడే!
మురియును దేశమాత రసమోహన ముగ్ధ విలోలయయ్యి,యీ
ధరణిని బ్రోచు శక్తివవ ధన్యత! భారత వీరపుత్రికా!!



**అవుసుల భానుప్రకాశ్**
పద్య సారస్వత పీఠం, తెలంగాణ,
ఫోన్ : 96032 04507

# సైనికా! నీకు శాల్యూట్!!

సరిహద్దుల్లో సైనికుడా
కంటిమీదకునుకు కుదరదంటావు
దేశమంతా నీ కుటుంబం
వారి సుఖమే
నీ సౌఖ్యమంటావు
నీ తుది శ్వాస
మాకు అశ్రునయనం !!

సరిహద్దుల్లో సైనికుడా
సరిపోల్చలేరు సరితూగలేరు
శత్రుగుండెల్లో శరమైపోతావు
సుడిగుండాల సమస్యల్లో
ఫిరంగివై దూసుకుపోతావు !!

సరిహద్దుల్లో సైనికుడా
మరణమైనా మరుచూపులేదు
ప్రాణదానమీయడానికి పరుగులు తీస్తావు
జనులచిరునవ్వుకోసం
జాగారం చేస్తావు
దేశమే తల్లంటావు !!



సరిహద్దుల్లో సైనికుడా
గుండెధైర్యం కండబలం
శత్రు శేషమంతరించడానికి
చివరిక్షణం చిరునవ్వుతో
స్వీకరించు సైనికుడా !!

సరిహద్దుల్లో సైనికుడా
పిరికితనం పరిత్యజించి
పరవశించి పంచుతావు
త్యాగాలకు తలమానికవు
తరరాలకు తారకవైనావు !!

**జి. శైలమ్మ**
కుప్పం, 9618361905

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (45) UGC Care List Approved Journals
హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# తెలుగు శాసన సాహిత్యంలో మొరిపిరాల శాసన ప్రాశస్త్యం

డా. భూక్యా రాజారాం నాయక్, ఫోన్ : 9494815854

సాహిత్యం ఒక సామాజిక చైతన్య రూపం. శాసన సాహిత్యం చరిత్ర, సంస్కృతికి ఆధారం. ఆ కాలంనాటి సాంఘిక విషయాలు అనేక శాసనముల వలన తెలుస్తున్నాయి. పూర్వ కాలంలో రాజులు, వారి సామంతులు, వారి ఆస్థాన కవులు, పండితులు, మహనీయులు నాటి చరిత్ర సంస్కృతిని శాసనాలపై చెక్కి నిక్షిప్తం చేసారు. ప్రాచీన కాలం నుండి మనదేశంలో మహనీయులు కొందరు ఆలయాలు, స్థూపాలు, ఆరామాలు, తటాకాలు మొదలైనవి నిర్మిస్తూ ఆ సత్కార్యాలను తమ సమకాలికులకే కాక తమ తరువాతి తరం వారికి కూడా ఉపయోగపడాలన్న తలంపుతో ఆ విషయాలను శిలలపైనో, రాగిరేకులపైనో రాయించి పెట్టారు. అవే నేటి కాలానికి గతకాలపు సాక్షాలు. పన్నెండవ శతాబ్దంలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని మొరిపిరాల గ్రామంలో వేయబడ్డ శిలా శాసనం గురించి విశ్లేషించడమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం.

తెలుగు సాహిత్య చరిత్రలో క్రీ.శ 11 వ శతాబ్దం నన్నయ కాలం నాటి వరకు దాదాపు 269 శాసనాలు లభించాయి. నాటినుండి నేటివరకు కూడా తెలుగు వారి గత కాలపు చరిత్రను తెలియజేసే శాసనాలు అనేకం లభిస్తూనే ఉన్నాయి.

నన్నయకు పూర్వం లభించిన శాసనాలలో ప్రధానంగా తెలంగాణలో లభించిన శాసనాలు క్రీ. శ 9వ శతాబ్దంలో వేయబడిన 'కొండపర్తి శాసనం'. ఇది వరంగల్లు సమీపంలోని కొండపర్తి గ్రామంలో ఉంది. తెలుగు శాసనాలలో ముఖ్యంగా చెప్పుకోదగిన శాసనం 'కొరవి శాసనం'. ఇది క్రీ.శ. 935 లో ప్రస్తుత మహబూబాబాద్ జిల్లాలోని కొరవి గ్రామంలో వీరభద్రాలయంలో ఉంది.

నన్నయ్య తర్వాత కాలంలో వచ్చిన శాసనాలలో తెలంగాణలో లభ్యమైన శాసనాలు జనగామ జిల్లా గూడూరు గ్రామంలో లభ్యమైన 'గూడూరు శాసనం', మహబూబాబాద్ జిల్లా మాటేడు గ్రామంలో క్రీ. శ. 1120 కాకతీయుల కాలంలో వేయబడిన మొదటి గద్యాత్మక శాసనం 'మాటేడు శాసనం', హుజురాబాద్ మండలంలో కొణిశేల గ్రామంలో క్రీ. శ 1157లో వేయబడిన 'ఉప్పరివిల్లి శాసనం', క్రీ.శ 1171లో వేయబడిన 'నగునూరు శాసనం', క్రీ.శ 1181లో వేయబడిన 'మొరిపిరాల శాసనం', క్రీ. శ 1203లో వరంగల్లు జిల్లాలో వేయబడిన 'కొండపర్తి శాసనం', క్రీ.శ. 1215లో వేయబడిన 'పిల్లలమర్రి శాసనము', క్రీ.శ. 1221లో వేయబడిన 'అలంపురం శాసము' మొదలగునవి తెలియవస్తున్నవి. ఈ శాసనాల్లో పదమూడవ శతాబ్దాంతము వరకు తెలంగాణలో వ్యవహరించబడిన తెలుగు భాష కన్పిస్తుంది.




మొరిపిరాల శాసనం

'మొరిపిరాల శాసనం' వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మొరిపిరాల అనే గ్రామంలో ఉంది. ఇది జిల్లా కేంద్రమైన వరంగల్‌కు దక్షిణాన దాదాపు 45 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ మొరిపిరాల గ్రామానికి దక్షిణ భాగాన ఊరికి దగ్గరగా లింగాలకుంట అనే చిన్నపాటి చెరువు ఉంది. ఈ లింగాలకుంట చెరువు కట్టపైన పన్నెండవ శతాబ్దంలో వేయబడిన శాసనం, శిల్పాలు అనేకం ఇక్కడ ఉన్నాయి. ఈ కట్టకు ఆనుకుని చెరువు లోపలి భాగంలో ఈ మొరిపిరాల అనే శిలా శాసనం ఉంది.

కాకతీయుల కాలంలో వేయబడిన శిలాశాసనాల్లో ఈ "మొరిపిరాల శాసనం" ప్రస్తావన ఉంది. ఈ శాసనం క్రీ.శ 1181 ప్లవ నామ (ప్రస్తుత 2021 తెలుగు ప్లవనామ సంవత్సరం కావడం గమనార్హం) సం.లో వేయబడిందని శాసనం ద్వారా తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతి పెద్ద నగరం వరంగల్ జిల్లా. ఈ ప్రాంతాన్ని పన్నెండు నుండి పద్నాలుగు శతాబ్దాల కాలంలో పరిపాలించిన కాకతీయులు ఈ శాసనాన్ని వేయించారు.

ఈ మొరిపిరాల శాసనం ఆ కాలపు శిష్టవ్యావహారికం అనదగిన వచనములో రాయబడి ఉంది. పన్నెండవ శతాబ్దంలోనే ఈ గ్రామంలో వీధిబడుల్లోపి బాలబాలికలకు ఇటువంటి చక్కటి తెలుగు రాయడం, చదవడం నేర్పే వారని 'తెలుగు సాహిత్య చరిత్ర' (డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి ఎం.ఏ. తెలుగు ప్రథమ సం.రం. పు:43) గ్రంథం ద్వారా తెలుస్తుంది. అయితే ఈ శాసనం పన్నెండవ శతాబ్దంలో కాకతీయులు ఉపయోగించిన ఆనాటి తెలుగు లిపిలో రాయబడి ఉంది.

కాకతీయుల కాలంలో పేర్కొనబడిన అనేక శాసనాలలో ఈ మొరిపిరాల శాసన ప్రస్తావన కూడా ఉంది. ఆ కాలంలో అపార

జ్ఞానం కలిగిన పండితులు ఈ ప్రాంతంలో ఉండేవారని, స్త్రీలను కూడా చదువుకోవడానికి ప్రోత్సహించేవారని, ఈ శాసనం శిష్టవ్యవహారిక భాషలో రాయబడిదంని శాసనాలను గురించి తెలుపబడిన వివిధ గ్రంథాల ద్వారా తెలుస్తుంది.

**మొరిపిరాల శాసనంలో రాయబడిన అంశాలు**

కాకతీయ పాలకులు శక సం.1103 అంటే క్రీ.శ.1181 అంటే మొదటి రుద్రదేవుని పాలనాకాలం (రుద్రదేవుడు 1158–1195)

కాకతీయులకు సామంతులుగా ఉన్న ప్రోలిరెడ్డి, విరియాల వంశంవాడు, ప్రోలేశ్వర దేవాలయంతో పాటు ఎన్నో గుడులు కట్టించాడు. బావి తవ్వించాడు. వ్రిత్తులను దానం చేసాడు. దేవునికి మామిడితోటనిచ్చాడు. కొలిపాక సోమనాథదేవునికి ఇష్టభృత్యుడైన కోటిరెడ్డి భార్య వల్లుసాని. కొడుకు బాలిరెడ్డి. ఈ శాసనం చివర ప్రోలిరెడ్డి నియమించిన కరణం (అకౌంటెంట్) మలపరాజు సంతకంతో శాసనం ముగుస్తుంది.

**"ఈ శిలాశాసనం నాలుగువైపులా దాదాపు అడుగున్నర మందంతో, నాలుగున్నర అడుగుల పొడవుతో పిల్లర్ ఆకారాన్ని పోలి నాలుగు వైపులా అక్షరాలతో చెక్కబడి ఉంది".** మొదటి వైపు 19 వరసలు, రెండవవైపు 22 వరసలు, మూడవవైపు 22 వరసలు, నాలుగోవైపు 24 వరుసలు అక్షరాలు చెక్కబడి ఉన్నవి.

**మొదటి వైపు**

1. (స్వ) స్తి శ్రీజ్జ9యాభ్యు (దయలి) చ్ఛ
2. (శలి) క వళ 9 ములు 1103
3. ప్లవ సంవత్సర మాఘ
4. సుద్ధ ద్వాదసి సోమవార
5. మున మేషలగ్నము
6. పునర్వ్వసు నక్షత్రము
7. నవగ్రహాములు యే
8. కాదశస్థులై ఉండగా
9. శ్రీ కొలిపాక సోమనా
10. థా దేవర కిష్టబ్రిత్యు
11. ం డైన కేతి (రె) డ్డికి పున్య
12. చ (వ) తియైన వెలుసాని
13. కి సుపుత్రుండైన బాలి రె
14. డ్డికి ధమ్మ్ర్వవత్నియైన బొ
15. ల్లసానికి వంశ వర్ధ్దనులై
16. న కొడుకులం బడి సె వా
17. రెవ్వరనిన బీమిరెడ్డి మారి
18. రెడ్డి కేతిరెడ్డి బాచిరెడ్డి ప్రోలి
19. రెడ్డి మల్లి రెడ్డి యనంగా జ

**రెండవవైపు**

1. న్మించిన వారిలోనం బ్రోలిరెడ్డి
2. అత్యంత ధర్మ్మవరుడును
3. ఆథిక పున్యాధికుండును
4. నై జన్మించి తనకుం బరమ
5. పతివ్రత యైన మాచమా
6. ం బిక ధర్మ్మపత్ని కాం జేకొని వం
7. శ కరులైన సుపుత్రులం బ
8. డసి ధర్మ్మార్త్థ కామమోక్షంబు
9. లును చతుర్వ్విధ పురుశార్త్థ ంబు
10. లంద చిత్తంబు నిలిపి క్రితము
11. గ త్రేత ద్వాపర కలియుగంబుల స్తి
12. రంబైన దైంవం బీశ్వరుండ తనకుం
13. బరమ శ్వామిగాం దలంచి చతు
14. ర్దశ భువనాధీశ్వరుండును నంది
15. వాహనరుదుండును పార్వ్వతిమ
16. నోన్నయన వల్లభుండును శ్రీ రామ
17. రావణ ధనంజయ వరప్రసాదుండు
18. ను నారాయన ప్రియు(డు)నుం ద్రయ
19. త్రింశాధి దేవతారాధ్యుండను గౌరీ
20. కుచకలశ కుంకుమ చందన పహా
21. వంకాంకిత వక్షస్తల శరీరుండు
22. నుం తినేత్రుండును శ్రీ కైలాసని

**మూడవ వైపు**

1. వాసుండైన ప్రోలేశ్వర దేవర(కు)
2. ప్రతిష్ట సహి(తం)బుగా దేవాలం
3. (బు) లెత్తించి బాగీరతి సమాన
4. (ంబు) గా భావి మెప్పించె యిందు స్తాన
5. (నము) నేసి పాపవిముక్తులగుదురు
6. బ్రహ్మ హత్యా గురుతల్పక దోషం
7. బుంను భ్రూనహత్యా మహాపాత
8. కదోషంబులు సెరుచు యీశ్వ
9. ర సమీపంబుగాన (గా)(రి)చుతమి
10. సమానంబుగాం దలంచి దోష
11. విముక్తులగుదురు శ్రీ ప్రోలేశ్వ (ర*)
12. దేవర వర నివేద్యానకు చింత
13. చెఱ్వు వెనుకమఱ్ఱు ఖ 1 దక్షి
14. ణము పాటిమీంద వెలినొల
15. వు మఱ్ఱు దేవరకు కుంట 1.
16. నంక దేవకు చింతలచెఱ్వు మోగ

17. వాతనీరు పాదిక 1 వెలివొలపు మ
18. (ఋ) ౯ 10 యాౖవిత్తికి యుపద్రవ
19. వంబు సేసినవారు బ్రహ్మ హత్యా
20. ది దోషులగుదురు శైవద్రోహు
21. లగుదురు శ్వమిద్రోహు (ల*) గుదురు
22. గాన వీరి సంగతి బోవగాదు??

**నాలుగోవవైపు**

1. ------------------------
2. ----- లగు విల్మనల్లిల్లు 1 ల
3. మావిండి తోంట 1అందు మావి (డి)
4. తోంటలోని మా (వి) (డి) దేవ ధనంబ
5. దాని ఫలంబులెవ్వరు - దిన్నాగో
6. గోమాంశంబు దిన్న వారు యా
7. దేవాలయంబును వృత్తి యు
8. ప్రోలిరెడ్డి చేత శాసన బద్దంబుగా
9. -జియ్యలు వడపె యూవ్రిత్తి
10. కుపద్రవంబు సేసినవార నివద్రో
11. హులు శ్రీ మతు వియ్యాౣల బేతియ
12. బంటు కొల్లిపాక ప్రోలిరెడ్డి కొడ్కు
13. దేవిరెడ్డి బేతయ తిఅవి బ్రహ్మలోక
14. ప్రాత్పుండైయ్యె గాన వీరి కెల్ల కు
15. ల శ్వాములు వియ్యాౣలవార ప్రోలిరెడ్డికి దైవం
16. బెల్ల యీశ్వరుండకాన (దప్పున యుంచి)
17. యిష్టార్థౣ సిద్ధియుం(నెయ్యెడ) మ వీరి
18. పుత్ర మిత్ర కలత్ర బాంధవుల
19. కు మనోరథసిద్ధి అయురామదే
20. వన్కి బేతయ పెట్టిన వ్రిత్తి వెలిమ 10
21. బమ్మిచెనగ వానిది పా1 నల్లకట్టమ 1
22. విరియాలవారి యింట కరనముగా
23. ప్రోలిరెడ్డి నిల్పిన మలపరాజు వ్రాంశు
24. స్వస్తి శ్రీ శ్రీ శ్రీ.

(ఇన్స్క్రిప్షన్స్ ఆఫ్ ఇండియా ఆఫ్ ఆంధ్రప్రదేశ్ : వరంగల్ డిస్ట్రిక్ పు : 107)

స్వస్తి జయాభ్యుదయ శక సం.లు 1103, ప్లవనామ సం.ర మాఘమాసం శుద్ధ ద్వాదశి సోమవారంనాడు పునర్వసు నక్షత్రంతో కూడిన మేషలగ్నంలో, నవగ్రహాలు ఒకేదశలో ఉన్నపుడు, కొలిపాక సోమనాథ దేవరకు ఇష్టభృత్యుడైన కేతిరెడ్డికి, వెలుసాని(వల్లుసాని)కి పుత్రుడు బాలిరెడ్డికి, భార్య బొల్లసానికి వంశవర్ధనులైన కొడుకులు భీమిరెడ్డి, మారిరెడ్డి, కేతిరెడ్డి, బాచిరెడ్డి, ప్రోలిరెడ్డి, మల్లిరెడ్డి అనే కొడుకులు కలిగారు.

వారిలో ప్రోలిరెడ్డి ధర్మపరుడు, పుణ్యాధికుడు. అతని భార్య మాచమాంబిక. వారికి వంశోద్ధారకులైన పుత్రులు కలిగారు. చతుర్విధ పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాలమీద మనసు నిలిపి, కృత, త్రేత, ద్వాపర, కలియుగాలలో స్థిరమైన దైవం ఈశ్వరుడని నమ్మి, చతుర్దశ భువనాధీశ్వరుడు, పార్వతీమనోనయనవల్లభుడు, శ్రీరామ, రావణ, ధనంజయులకు వరాలిచ్చినవాడు, నారాయణప్రియుడు, త్రయత్రింశాధి (33) దేవతారాధ్యుడు, గౌరీదేవి కుచకలశాలమీద పడిన కుంకుమ, చందనాలంటిని వక్షస్థల శరీరుడు, త్రినేత్రుడు, శ్రీకైలాసనివాసుడైన ప్రోలేశ్వర దేవరకు దేవాలయాలు కట్టించి, ప్రతిష్ఠలు చేయించి, గంగసమానమైన నీటినిచ్చె బావిని తవ్వించాడు. ఆ నీటితో స్నానం చేసినవారు పాపవిముక్తులౌతారు. బ్రహ్మహత్య, గురుతల్పక దోషాలు, భ్రూణహత్య (పసిపిల్లలను చంపడం) మహాపాతక దోషాలను నశింపచేస్తాడు ఈశ్వరుడు.

ప్రోలేశ్వరదేవర నైవేద్యానికి చింతచెరువు వెనుక మర్తురు (1న్నర ఎకరం) ఖ (ఖండుక అంటే పుట్టిపండే పొలము) 1, ఊరికి దక్షిణాన పాటి(గడ్డ) మీద వెలిపొలము (ఖుష్కి నేల) 5 మర్తురులు, దేవరకు 1కుంట, సంకదేవునికి చింతలచెరువు మొగవాత (ముందర) పాదిక (1/4భాగం) ఖుష్కి1, హా వెలిపొలము 10 మర్తురులు, ఈ వ్రిత్తికి (తరతరాలు అనుభవించేటట్లు చేసిన దానానికి) ఉపద్రవం కలిగించేవారు బ్రహ్మహత్యాదోషులౌతారు. శైవద్రోహులౌతారు. స్వామిద్రోహులౌతారు. కావును వీరితో (ఎవరు) కలిసిపోవద్దు.

విల్మనల్లిల్లు 1 (అర్థం తెలియదు). మామిడితోట 1, తోటలోని పండ్లు దేవునిధనం కనుక ఎవరు తిన్నా గోమాంసం తిన్నంత తప్పు. ఈ దేవాలయానికి ఈ వృత్తి ప్రోలిరెడ్డి చేత శాసనబద్ధం చేయబడ్డది. ఈ దానానికి చెడిపినవారు శివద్రోహులౌతారు. శ్రీమత్ విర్యాల బేతియ బంటు కొల్లిపాక ప్రోలిరెడ్డి కొడుకు దేవిరెడ్డి, బేతయలు బ్రహ్మలోకప్రాప్తులైనారు (మరణించారు) కనుక వీరికందరికి స్వాములు విరియాల ప్రోలిరెడ్డికి దైవమైన ఈశ్వరుడు.. ఎల్లపుడు ఇష్టార్థసిద్ధి, వీరి పుత్ర, మిత్ర, కళత్ర, బాంధవులకు మనోరథసిద్ధి (కలుగాలని) ఆయురామదేవునికి బేతయ పెట్టిన వ్రిత్తి వెలిమ10 బమ్మిచెనగ (అర్థం తెలియదు).. వానిది పా(దిక)1 నల్లకట్టమ 1 విరియాల వారింట్లో ప్రోలిరెడ్డి నియమించిన మలపరాజు శాసనం వ్రాలు (రాత)...

(శాసనంపై రాయబడి ఉన్న వాక్యాలు వాటి అర్థాలు ప్రముఖ శాస్త్ర పండితుల ద్వారా పరిష్కరించిన విదంగా దాదాపుగా సరైన పూర్తి సమాచారం.)

ఈ శాసనంలో ప్రధానంగా కాకతీయ రాజుల సామంతులు అయిన విరియాల వారి వంశవృక్షం మరియు ఈ గ్రామంలో ప్రోలిరెడ్డి కట్టించిన ప్రోలేశ్వర దేవాలయం, మామిడితోట, బావి తొవ్వించడం, మెదలగు వారు చేసినటువంటి అనేక దానధర్మాల విశేషాలు పేర్కొనబడినవి. కొలిపాక సోమనాథ దేవాలయానికి

కోటిరెడ్డి సేవకుడుగా ఉండేవాడని, విరియాల వంశంవారి బంధువులు కట్కూరులో మరియు వరంగల్ దగ్గర కొండపర్తిలో విరియాల వారి అల్లుడు చౌండసేనాని ఉండేవారని చారిత్రక విశ్లేషకుల ద్వారా తెలుస్తుంది.

**జనవ్యవహారంలో శాసనంపై చెప్పుకునే కథనాలు**

మొరిపిరాల అనే గ్రామం జిల్లా కేంద్రమైన వరంగల్ నుండి ఖమ్మం వెళ్లే 563 నంబర్ జాతీయ రహదారికి వరంగల్ నుండి దాదాపు 45 కిలోమీటర్ల దూరంలో ఉంది. జాతీయ రహదారికి కుడి వైపున 1.5 కి.మీ. దూరంలో ఈ గ్రామం ఉంది ఈ గ్రామానికి తూర్పు, ఉత్తరాన మైలారం రిజర్వాయర్ ఉంది, పడమరన కాట్రపల్లి గ్రామం సరిహద్దుగా ఉంది, దక్షణాన లింగాల కుంట అనే చెరువు ఉంది, ఈ లింగాల కుంట చెరువు కట్టపైన ఒక శిలాశాసనం, శివలింగం, ఆంజనేయస్వామి చిత్రాలు చెక్కబడిన విగ్రహాలు ఉన్నాయి. ఈ శివలింగం ఆధారంగానే ఆ చెరువుకు 'లింగాల కుంట' అనే పేరు వచ్చిందని చెబుతారు. ఈ శిలాశాసనంపై అనేకమైన మౌఖిక కథనాలు అనాదిగా చెప్పబడుతూ ఉన్నాయి.

మొరిపిరాల గ్రామం అంతకుముందు ఈ లింగాలకుంటకు పై భాగాన అంటే హా కుంటకు పడమరన ఉండేదని, అది కాలక్రమంలో ఉత్తరదిశలోకి మారిందని అంటారు. అయితే అంతకు ముందు ఊరు అక్కడే ఉండేదని చెప్పబడే ఆధారాలు ఇక్కడ అనేకం ఉన్నాయి. ఆ కాలంలో వేయబడిన ఊరి బొడ్రాయి, కూలిపోయినా ఇండ్ల గోడలు, కాల్చిన ఇటుకలు (దాదాపు అడుగున్నర పొడవు, అడుగు వెడల్పు, నాలుగు అంగుళాల మందంతో కూడిన కాల్చిన ఇటుకలు), ఇంటిపైన కప్పే కాల్చిన మట్టి పెంకలు, ఇంటి ముందు నాటుకునే బండరాళ్లు ఇప్పటికీ ఉన్నాయి. అక్కడ ఏదో కీడు జరిగి ఉంటుందని అందుకే తర్వాత కాలంలో లింగాలకుంటకు ఉత్తర దిక్కున ఊరు మారిపోయి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఆ కాలంలో వేయబడిన శిలాశాసనం, శివలింగాలు, విగ్రహాలు ఇప్పటికీ సజీవ సాక్ష్యాలుగా ఇక్కడ ఉన్నాయి. ఈ మధ్య కాలంలో గ్రామస్తులు ఆ కట్టపైన చిన్నపాటి గుడి కట్టి శివలింగాన్ని, ఆకాలంలో వేయబడిన విగ్రహాలను ప్రతిష్టించారు. ఇప్పటికీ గ్రామస్తులు బతుకమ్మలు ఆడేటప్పుడు, ప్రత్యేక సందర్భాలలో ఆ విగ్రహాలకు పూజలు నిర్వహిస్తుంటారు.


శివుని గుడి ప్రక్కన కోనేరు బావి ఉండేదని, ఆ కోనేరు లోపలి భాగంలో చుట్టూ నాలుగు వైపులా మెట్లు ఉండేవని దానినే దేవతల బాయి అని అంటారని, దానికి దగ్గరలో మామిడి చెట్లు, ఒక పెద్ద మర్రి చెట్టు కూడా ఉండేదని గ్రామస్తులు చెబుతారు. పాటిగడ్డ (పాత ఊరు) దగ్గర ఉన్న ఊరి బొడ్రాయికి ఎదురుగా తూర్పు దక్షిణ భాగంలో ఒక కుంట ఇప్పటికీ ఉన్నది దీనినే లక్ష్మీదేవి కుంట మరియు దేవరకుంట అని అంటారు. అక్కడ భైరవుని విగ్రహం ఉండేదని, దానితో పాటు అక్కడి ఉన్న మరి కొన్ని విగ్రహాలు, బొడ్రాయి పురాతన ఆనవాళ్లను కొన్నింటిని తీసుకొచ్చి లింగాలకుంట చెరువు కట్టపై కొత్తగా నిర్మించిన శివుని గుడి దగ్గర పెట్టారని గ్రామస్తులు చెబుతున్నారు.

శిలాశాసనం గురించి మాత్రం మౌఖిక కథనాలు అనేకంగా చెప్పబడుతున్నాయి. శిలా శాసనానికి నాలుగు వైపులా రాయబడి ఉన్నందున దానిని "లెక్కల బండ" అంటారని, ఆ విగ్రహాల కింద ధనం, భాండాగారం ఉందని దానిని దొంగతనంగా అనేకులు తీయడానికి ప్రయత్నించి విఫలం అయ్యారని స్థానికులు చెబుతారు.

ఈ శాసనాన్ని ఎవరో చదివి అందులో రాయబడిన విషయాలు చెప్పారని, **'ఈ శిలా శాసనం వేయబడిన సమయంలో ఆ చెరువుకు పడమరన ఒక రావిచెట్టు ఉండేదని, ఆ రావిచెట్టు కొసకొమ్మ నీడన ధనం దాయబడి ఉందని'** ఈ శిలా శాసనాన్ని చదివిన పండితుడు ఎవరో చెప్పగా విన్నామని గ్రామస్తులు అనేక కథనాలుగా చెబుతున్నారు.

ఏది ఏమైనప్పటికీ ఈ మొరిపిరాల శిలాశాసనం క్రీ.శ 1181 ప్లవనామ సంవత్సరంలో వేయబడిన నాటి నుంచి నేటి (ప్లవనామ సంవత్సరం-2021) వరకు ఎనిమిది వందల నలభై సంవత్సరాలు కావస్తున్నట్టుగా మనకు తెలుస్తుంది. ఈ ఊరు దాదాపుగా పది, పదకొండు శతాబ్దాల క్రితం నుంచే ఇక్కడ ఉన్నదనే విషయాన్ని ఈ శాసనం మనకు తెలియజేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆ కాలంలోనే గ్రామాలలో వీధిబడుల ద్వారా విద్య నేర్పబడిందనే విషయం మనకు దీని ద్వారా అర్థం అవుతుంది. ఇంకా ఆధ్యాత్మిక స్పృహను కూడా ఆనాటి సమాజం కలిగి ఉందనే విషయం ఈ శాసనం ద్వారా వెల్లడవుతుంది. శివుడిని పూజించే వారని, గ్రామంలో పండితులు ఉండేవారని తెలియవస్తుంది.

అందుకే గతకాలానికి రేపటి తరానికి మనం సాక్షులం కాబట్టి గతకాలానికి సంబంధించిన వారసత్వ సంపద, చరిత్ర, చారిత్రకమైన ఆదారాలు కనుమరుగై పోకుండా రేపటి తరానికి అందించవలసిన బాధ్యత మనపై ఉందనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఈ అరుదైన శాసనాలను ప్రత్యేకమైన స్థలంలో ప్రతిష్ఠించుకుంటే రాబోయే తరానికి గతకాలపు సాక్ష్యాలను సజీవంగా అందించిన వాళ్ళం అవుతాము.



కె. విశ్వనాథ్ చలన చిత్రాలు – సామాజిక అవలోకనం – 20

# అల్లుడు పట్టిన భరతం

**టి. లక్ష్మీనారాయణ,** తెలుగు పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9704829254

"కె.విశ్వనాథ్ చలన చిత్రాలు–సామాజిక అవలోకనం" నందు ఈ మాసం చర్చించబోయే చిత్రం **"అల్లుడు పట్టిన భరతం".** 1980 నాటి ఈ చిత్రం వివాహ వ్యవస్థను ప్రధాన భూమికగా చేసుకొని నిర్మించబడింది. కృష్ణంరాజు, జయసుధ, కవితలు ప్రధాన తారాగణంగా నటించగా డి.వి.ఎస్.రాజు నిర్మాతగా వ్యవహరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వివాహ వ్యవస్థలో సంభవిస్తున్న మార్పులు, పరిస్థితులను చర్చించడానికి వ్యక్తిని యూనిట్ గా చేసుకొని ఈ చిత్రం రూపొందిచారు. వాస్తవానికి ఈ కథాంశం సార్వకాలిక–సార్వజనీన అంశాన్ని ఆధారంగా చేసుకొని రూపొందించబడింది. మనిషి నాగరికత నేర్చుకుంటూ దినదినాభివృద్ధి జరుగుతున్న క్రమంలో మానవ మనుగడను తరాలపాటు విస్తరించడంలో, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణ ఏర్పాటులో వివాహ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తూ వస్తున్నది.

**చిత్ర కథ :**

ముత్యాలు (కృష్ణంరాజు) ఊర్లో వీధుల వెంట బండిపై ముంతకింది పప్పు అమ్ముకుని జీవనం సాగిస్తుంటాడు. కాని ముత్యాలు అంటే ఊర్లో మనుషులకు అభిమానం. అంతేకాక ఊర్లోని తప్పుడు మనుషులకు చేతివాటంతో బుద్ధిచెప్పి సరైన దారిలో పెడుతూ వుంటాడు. ముత్యాలు మరదలు రాధ (కవిత). రాధ అంటే ప్రేమాభిమానాలే కాక ఆమెను మంచి చదువులు చదివించి ఆమెను వివాహం చేసుకోవాలని ఎన్నో కలలు కంటాడు. రాధ తండ్రి సింహాచలం (అల్లు రామలింగయ్య) కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తూ చాలీచాలని జీతంతో బతుకీడుస్తుంటాడు. రాధ కాలేజీలో చదువుకుంటూ వుండగా ఆమెకు లెక్చరర్ రామకృష్ణ (రంగనాథ్) చదువుకు సంబంధించిన అన్ని విషయాల్లో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తూ వుంటాడు. ఇంకోవైపు ముత్యాలుకు చాలా దగ్గర వ్యక్తి ముత్యాలు చేత మామ అని ఆప్యాయంగా పలకరింపును పొందుతూ అన్ని విషయాల్లో సలహాలు, సూచనలు అందజేస్తూ చేదోడువాదోడుగా వుండే వ్యక్తి నాగభూషణం.

రేఖ (జయసుధ) డబ్బు, అందం, పొగరు అన్నీ కలగలిసిన అమ్మాయి. రేఖ కూడా రాధ చదువుకునే కాలేజీలోనే చదువుకుంటూ వుంటుంది. రేఖ పూర్వ కుటుంబీకులే ఆ కాలేజీకి ట్రస్టీలు అవడం వల్ల రేఖ కాలేజీలో దర్పాన్ని ప్రదర్శిస్తూ అందరికీ అసౌకర్యాన్ని కలిగిస్తూ వుంటుంది. రేఖ తల్లి మాంబ (రమాప్రభ). మాంబ ప్రతి పనిలోనూ డబ్బును, అహంకారాన్ని ఒంటిపై వేసుకున్న ఆభరణాల చందాన ప్రదర్శిస్తూ వుంటుంది. తన చుట్టూ ఉన్న మనుషులకు



రేఖ తన భర్త అమెరికాలో పెద్ద,పెద్ద వ్యాపారాలు చేస్తూ వుంటాడని చెప్తుంది. కాని మాంబ తన భర్తను ఎన్నో ఏళ్ళ క్రితమే వదిలేసి వుంటుంది. ఆ విషయం కూతురు రేఖకు సైతం తెలియదు. దానికితోడు చిన్ననాటినుండి మాంబ పెంపకంలో పెరిగి పెద్దదవడం వల్ల తల్లికి ఏ మాత్రం తీసిపోని రీతిలో రేఖ ప్రవర్తన పొగరుతో కూడినదై వుంటుంది. మాంబ వద్ద మేనేజర్ గా పనిచేసే వ్యక్తి దాసు. దాసు మాంబ వద్ద అతి నమ్మకస్తుడైన ఉద్యోగి.

చిత్ర ప్రారంభంలో ఒక చిన్న పిల్లాడిని అతడి తండ్రి బడికి పంపకుండా పనికి పంపాలని భార్యతో గొడవపడ్తుంటాడు, అంతేకాక భార్యతో సారా తాగడానికి డబ్బుల కోసం గొడవ పడ్తుంటాడు. కాని తాను మాత్రం పనిచేయకుండా తాగడానికి అలవాటు పడి వుంటాడు. ముత్యాలు వచ్చి ఆ పిల్లాడి తండ్రికి బుద్ధి చెప్తాడు. ఈ సన్నివేశం ద్వారా ఊర్లో ముత్యాలు పాత్ర స్వభావం ఎలా వుంటుందో పరిచయం చేస్తాడు దర్శకుడు. రాధ తన కాలేజీ తరపు నుండి సోషల్ సర్వీస్ కు వెళ్తుంది. కాని అక్కడ విద్యార్థులు వారి కాలేజ్ స్టాఫ్ అందరూ ఒక అమ్మాయి వచ్చి ఆ కార్యక్రమం ప్రారంభించాలని ఎదురుచూస్తుంటారు. ఆ అమ్మాయే మాంబ కూతురు రేఖ. ఆమె వచ్చీ రాగానే సోషల్ సర్వీస్ కార్యక్రమాలు చేస్తున్నట్లు కేవలం ఫోటోలకు ఫోజులు ఇచ్చి వెళ్ళిపోతుంది. ఈ తతంగం అంతా రాధకు, లెక్చరర్ రామకృష్ణకు పూర్తిగా నచ్చదు. రేఖ అక్కన్నుండి వెళ్ళే క్రమంలో దారిలో వున్న ముత్యాలు బండిని కార్ తో ధ్వంసం చేసి వెళ్తుంది. దానికి గాను ముత్యాలు రేఖ బర్త్డే పార్టీ రోజు ఆమె ఇంటి ప్రాంగణంలోకి వెళ్ళి ఆమె కార్‌ను ధ్వంసం చేసి వస్తాడు. ఆ సమయంలో రేఖ ఇంటివద్ద బందోబస్తు కాస్తూ




వుంటాడు సింహాచలం. సింహాచలం విధులు నిర్వహిస్తున్నా కూడా ధ్వంసం చేసిన వ్యక్తిని పట్టుకోలేక పోయినందుకు అతడిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయిస్తుంది. దానికి గాను మళ్ళీ ఆమె కార్ పంక్చర్ చేస్తాడు ముత్యాలు. మరోవైపు ముత్యాలు తన మరదలు రాధతో వివాహ ప్రస్తావన తెచ్చే సమయానికి ఆమె లెక్చరర్ రామకృష్ణతో ప్రేమలో వుందనే విషయం తెలుస్తుంది. తన ప్రేమను మనసులోనే దాచుకుని రాధ వివాహం ఘనంగా జరిపించాలని మనసును చంపుకొని నిశ్చయించుకుంటాడు.

ఒకరోజు కాలేజీలో లెక్చరర్ రామకృష్ణ– రేఖల మధ్య అనుకోకుండా మాటామాటా పెరుగుతుంది. స్వభావరీత్యా మిక్కిలి గర్వస్తురాలైన రేఖ అతడిని ఉద్యోగం నుండి సస్పెండ్ చేయిస్తుంది. కానిస్టేబుల్ సింహాచలం, లెక్చరర్ రామకృష్ణలను ఉద్యోగం నుండి సస్పెండ్ చేయించడానికి కారణమవడం దానికి ముందు తన బండి డామేజీకి కూడా రేఖయే కారణం అవడం వల్ల ఆమెకు ఎలాగైనా బుద్ధి చెప్పాలని నిర్ణయించుకుంటాడు ముత్యాలు. కాని మామ అని పిలిచే నాగభూషణం సలహా కారణంగా తన ఆలోచన శైలికి విభిన్నంగా ఆ ప్రయత్నం మొదలుపెడతాడు. దానిలో భాగంగా కొన్ని వ్యూహాలు పన్ని రేఖ అంటే తనకు వల్లమాలిన అభిమానం అని రేఖకు తెలిసేలా చేస్తాడు. మొరటుగా, సాదాసీదాగా బతికే మనుషులను అసహ్యించుకునే రేఖ విచిత్రంగా ముత్యాలు అభిమానానికి ముగ్ధురాలు అవుతుంది. అంతేకాక ముత్యాలును వివాహం చేసుకొని పేపర్లలో, టీవీల్లో పేదవ్యక్తిని వివాహం చేసుకున్న ఐశ్వరవంతురాలైన యువతి అని దేశం మొత్తం నా పేరు మోతెత్తి పోవాలని ఒక వింతైన ఆలోచనతో అతడిని ఆశపడ్తుంది. రేఖ యొక్క ఆ విచిత్రమైన కోరికకు ఆమె తల్లి మాంబ కూడా మద్దతుగా వుంటుంది. రేఖ తన వివాహ ప్రస్తావనను ముత్యాలు వద్ద తీసుకురాగా ముందు ససేమిరా ఒప్పుకోడు, కాని తన అనంగీకారం నుండి రేఖలో సింహాచలం, రామకృష్ణలకు తిరిగి ఉద్యోగం ఇప్పించేలా ఆలోచన కల్గజేస్తాడు. దానివల్ల రేఖ వారికి ఉద్యోగాలు వచ్చేలా చేస్తుంది, ముత్యాలును వివాహం కూడా చేసుకుంటుంది. చిత్రంలో అసలైన కథ ఇక్కడి నుండి మొదలవుతుంది.

రేఖ – ముత్యాలు వివాహం తర్వాత ముత్యాలు ఆమెను తన ఇంటికి రమ్మంటాడు. అప్పుడు రేఖ నీ పూరి గుడిసెలోకి నేను రావడమా అంటూ చులకనగా చెప్తూ **"నేను నిన్ను వివాహం చేసుకొన్నది దేశం మొత్తం నా పేరు ఫేమస్ కావడానికి మాత్రమే"** అంటుంది. తన ఇంటికి వచ్చి తను చెప్పినట్టు నడుచుకుంటూ బతకమని ముత్యాలును ఆదేశిస్తుంది. అదేసమయంలో ముత్యాలు మామ నాగభూషణం ముత్యాలుతో రేఖ తన కూతురే అని చెప్తాడు. రేఖకు ఆ విషయం తెలిసి తన తల్లిపై కోపాన్ని తీర్చుకోవడానికి ముత్యాలును ఆయుధంగా వాడుకున్నారా అంటూ తండ్రి నాగభూషణంను ప్రశ్నించి వెళ్ళిపోతుంది. అప్పుడు ముత్యాలు బుద్ధి చెప్పాల్సింది భార్య రేఖకు మాత్రమే కాదు, అత్తగారైన మాంబకు కూడా అని నిర్ణయించుకుంటాడు.

ముత్యాలు రేఖ భర్తగా ఆమె ఇంటికి వెళ్ళిన తర్వాత మామగారైన నాగభూషణంను కూడా అక్కడికి తీసుకెళ్తాడు. అల్లుడు ముత్యాలుతో పాటు వచ్చిన తన భర్తను చూసి మాంబ ఇన్నాళ్లు అందరిముందు, అలాగే కూతురు ముందు దాచిన విషయం బయటపడిందని కంగారు పడ్తుంది. అల్లుడి అండతో అంతకుముందులా కాకుండా నాగభూషణం మాంబపై పూర్తిగా అధిపత్యాన్ని ప్రదర్శిస్తాడు. మరోవైపు ముత్యాలు ఇంట్లో పనిమనుషులను అందరినీ తీసివేయించి భార్య రేఖ, అత్త మాంబల చేత ఇంటి పనులన్నీ చేయిస్తాడు. సుఖాలకు అలవాటు పడిన రేఖ, మాంబలు భర్తలకు సేవ చేయడాన్ని అవమానంగా భావిస్తారు. మాంబ తన మేనేజర్ దాసు సహాయంతో అల్లుడు ముత్యాలు పై గూండాల చేత దాడి చేయిస్తుంది. మేనేజర్ దాసు మాంబ బలహీనతను, అవసరాన్ని అవకాశంగా తీసుకొని ఆమె కన్నుగప్పి ఆమె ఆస్తులను రాయించుకుంటాడు.

రేఖను తన స్వంత ఇంటికి తీసుకువెళ్తాడు ముత్యాలు. అక్కడికెళ్లిన రేఖ ఆ ఇంటి పరివారాన్ని, మనుషులను ద్వేషిస్తుంది. కాని చాలా తక్కువ కాలంలోనే పేదప్రజల జీవనవిధానంలోని ఆప్యాయతలు, ప్రేమానురాగాల మాధుర్యాన్ని గ్రహిస్తుంది. రేఖ నెమ్మదిగా తన మనసు మార్చుకోవడం మొదలుపెడుతుంది. మరోవైపు మాంబ ఆస్తులను దాసు కాజేసిన తర్వాత నిస్సహాయతతో భర్త, అల్లుడులను సంప్రదించి తన ఆస్తులను కాపాడమని కోరుతుంది. దానికి ముత్యాలు మాంబతో ఆస్తులు కాపాడాలంటే ఆస్తులను భర్త పేరుపై చాన్నాళ్ల క్రితమే రాసినట్లు కాగితాలు సృష్టించాలని చెప్పి ఆమెను ఒప్పిస్తాడు. చివరకు ఆస్తులు మామ పేరుపై చేయించి అత్తలోని ధనాహంకారాన్ని తగ్గించి ఆమెను చక్కదిద్దుతాడు. మరోవైపు రేఖ జీవితమంటే సుఖాలను అనుభవించ డమే కాదు, కష్టసుఖాలను పంచుకోవడం అని తెలుసుకొంటుంది. భర్తతో కలిసి జీవించడానికి ఆస్తులు, అంతస్తుల కన్నా దాంపత్య జీవితాన్ని అర్థం చేసుకుంటూ కుటుంబాన్ని నడపడమే ముఖ్యం

అని తెలుసుకొని ముత్యాలుతో కలిసి బతకడం మొదలుపెట్టడంతో కథ సుఖాంతం అవుతుంది.

**చిత్ర విశేషాలు :**

కె.విశ్వనాథ్ – కృష్ణంరాజుల కాంబినేషన్ లో నిర్మితమైన మొదటి చిత్రం ఇది. చిత్ర ప్రారంభంలో టైటిల్స్ ముందు వివాహ వ్యవస్థకు సంబంధించి వచ్చే మాటలు చిత్రంలో చెప్పబోయే కథాంశం గూర్చి తెలియపరుస్తాయి. చిత్రం టైటిల్స్ సమయంలో **"అంజనానందనం వీరం జానకీ శోక నాశనం"** అంటూ వచ్చే శ్లోకం ప్రేక్షకుడికి ఒక మంచి అనుభూతిని ఇస్తుంది. నిజానికి విశ్వనాథ్ గారి చాలా చిత్రాల్లో ప్రారంభ సన్నివేశాలు చాలా సరళంగా వుండి ప్రేక్షకుడికి ఆహ్లాదాన్ని కలిగించేలా వుంటాయి. వివాహం స్త్రీ–పురుష సమాన ప్రాతినిధ్యం చేత ఏర్పడే విడదీయలేని బంధం. అలాంటి బంధంలో ఒడిదుడుకులు ఎదురైతే వారిద్దరిలో బాహ్య, అంతర్గత సంబంధాల్లో తేడాలు వస్తే ఆ సంక్షోభ సమయం కుటుంబ వ్యవస్థను కూడా కృంగదీస్తుంది. చాలా వరకు వివాహ బంధం గురించి చిత్రాన్ని రూపొందించేటప్పుడు ఎక్కువ మొత్తంలో లోపాన్ని మగాడి కోణంలోనే చూపుతారు. కాని ఈ చిత్రం విషయంలో మాత్రం విశ్వనాథ్ గారు స్వభావరీత్యా స్త్రీ పక్షపాతిగా పేరొందినప్పటికీ ఈ కథని స్త్రీ కోణంలో తప్పులు ఎలా జరుగుతాయి అనే దృక్పథంలో ఆవిష్కృతం చేశారు. అంతేకాక చిత్ర కథాంశాన్ని ఎక్కడా కూడా పక్షపాత ధోరణిలో కొనసాగించకుండా పాత్రలు వాటి ప్రవర్తనాశైలికి అనుగుణంగా కొనసాగించారు. అంతేకాక రేఖ, మాంబ పాత్రలను పోలిన పాత్రలు ఖచ్చితంగా మన మధ్యలోనే ఎక్కడో ఒకచోట మనమంతా చూశామనే రీతిలో స్ఫురణకు వచ్చేలా తీర్చిదిద్దారు. భార్యను కేవలం అవసరాలు తీర్చే మనిషిగా చూసే వైఖరి ఎంత నీచమైందో, డబ్బు వుందనే కారణంచేత భర్తపై అహంకారపూరితమైన వైఖరితో భర్తను చులకనగా చూడటం అంతే తప్పు అనే విషయాన్ని నొక్కి చెప్పారు.

మొదటి సన్నివేశంలో చిన్న పిల్లాడు బడికెళ్తాను అని తండ్రితో వాదులాడినప్పుడు తండ్రి 'నువ్ బడికెళ్ళకపోతే ప్రపంచం ఆగిపోతుందా!' అంటాడు. దానికి పిల్లాడు బదులిస్తూ 'నువ్ తాగకపోతే ప్రపంచం ఆగిపోతుందా అంటాడు' తాగుడుకు బానిసైన వ్యక్తికి కుటుంబ అవసరాల ప్రాధాన్యతల పై స్పష్టత వుండకపోగా తను చేసేది తప్పు అయినా అదే సరైందని భ్రమించే విపరీత వైఖరి వుంటుంది. మరొక సన్నివేశం రాధ కాలేజీ తరపు నుండి సోషల్ సర్వీస్‌కు వెళ్ళినప్పుడు విద్యార్థులు, లెక్చరర్స్ అంతా ఒక వ్యక్తి కోసం ఎదురుచూస్తుంటారు, ఆ వ్యక్తియే రేఖ. రేఖ ఆలస్యంగా వచ్చిననూ కార్యక్రమాన్ని ప్రారంభించి నాలుగు ఫోటోలకు ఫోజులిచ్చి పేపర్లలో పడేలా ఆదేశించి బయలుదేరుతుంది. దీన్నిబట్టి ఫోటోలకు ఫోజులిచ్చే పాడు సంస్కృతి మనకు వారసత్వంగా మన మస్తిష్కాల్లో ఇంకిపోయిందని చెప్పొచ్చు.




ముత్యాలు యొక్క ముంతపప్పు అమ్ముకునే బండిని రేఖ తన కారుతో ధ్వంసం చేసి వెళ్ళినప్పుడు పేదవాడి బతుకు పై డబ్బున్న మనుషుల అహంకారం, నిర్లక్ష్యం ఎలా వుంటుందో చూపారు. అంతేకాక రేఖ కారును ముత్యాలు ఆమె ఇంటికి వెళ్ళి ఆమెకు తెలియకుండా ధ్వంసం చేసినప్పుడు ఆ సమయానికి డ్యూటీలో వున్న కానిస్టేబుల్ సింహాచలం తన విధిని సరిగ్గా నిర్వర్తించలేదనే కారణం చేత సింహాచలంను ఉద్యోగం నుండి సస్పెండ్ చేయిస్తుంది. కాని ఉద్యోగం తప్ప బతకడానికి వేరే దారిలేని మధ్యతరగతి మనుషులు, చిన్న స్థాయి ఉద్యోగుల జీవితాలను అలాంటి చర్యలు ఏ స్థాయిలో కుంగదీస్తాయో రేఖ పాత్ర తీసుకున్న నిర్ణయం తెలియపరుస్తుంది. కాని పరపతి, స్థాయి వున్న మనుషులకు ఏ అధికారాలూ ప్రత్యేకంగా వుండాల్సిన అవసరంలేదు, ఎందుకంటే డబ్బున్న మనుషులు వ్యవస్థలను వారి కనుసన్నల్లో నడిపించగలరు అనే దానికి చిహ్నంగా రేఖ, మాంబల పాత్రలు ఉంటాయి. చిత్రం మొత్తం ఏకపక్షంగా కేవలం కృష్ణంరాజు యొక్క ముత్యాలు పాత్ర ద్వారా కొనసాగుతుంది. ముత్యాలు పాత్ర బండిపై ముంతపప్పు అమ్ముకుంటూ జీవించడం నిజాయితీగా కష్టాన్ని నమ్ముకుని బతికే వ్యక్తిలోని ధైర్యాన్ని తెలియజేస్తుంది. మాంబ, రేఖ పాత్రల్లో పూర్తిగా భర్తలను తమ అదుపులో పెట్టుకొని వారిపై అధిపత్యాన్ని సాగించాలనే వైఖరి కన్పిస్తుంది. నిజానికి వివాహం, భార్యాభర్తల ప్రస్తావనతో చిత్రాన్ని నిర్మించినప్పుడు చాలావరకు ఇద్దరి తప్పిదాలనో, కేవలం భర్త తప్పిదాలనో బలంగా చూపే రీతిలో కాకుండా మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పోకడలు, స్త్రీ పురుష సమానత్వం అనే మాట ఆధారంగా తదుపరి కాలంలో వుత్పన్నం కాబోయే పరిస్థితులను చూపారు. చిత్రాన్ని పూర్తిగా స్త్రీ యొక్క అహంభావ వైఖరిని అంతర్గత రుగ్మతగా చేసుకొని ఆ కోణంలో సంఘటనలను, కార్యకరణ సంబంధాలతో చర్చించారు. కె.విశ్వనాథ్ గారి ఈ చిత్రం నాటి కాలం స్త్రీ ల కన్నా నేటి కాలం స్త్రీ లకు చాలా అత్యవసరం అని చెప్పొచ్చు. ఈ మాటలను బట్టి నేటి స్త్రీ ని అపార్థం చేసుకోవడం దీనర్థం కాదు స్త్రీ సమానత్వాన్ని కాంక్షించే నేటి కాలంలో సమానత్వాన్ని కాంక్షిస్తూనే తదుపరి ఏర్పడే పరిణామాలను భార్యాభర్తలు పరస్పరం అర్థం చేసుకోలేకపోతే తరచూ గందరగోళ పరిస్థితులు ఏర్పడడం తథ్యం

అనేదే ఉద్దేశ్యం. ఏదేమైనా బలమైన వివాహ వ్యవస్థ బలమైన సమాజానికి పునాదిగా నిలుస్తుందనేది సత్యం.

మాంబ (రమాప్రభ) ప్రవర్తనలో దోషాలను ఎత్తి చూపడానికి చక్కని ఉదాహరణలతో చక్కని సన్నివేశాలను రూపొందించారు దర్శకుడు. మాంబ తన భర్తకు ఆస్తి చెందకుండా వుండేందుకు ఇంట్లో భర్త అసౌకర్యాన్ని సృష్టిస్తున్నాడంటూ కేసు వేయడానికి తన స్నేహితురాళ్ళను వారి భర్తలు చేసే ఉద్యోగాలను ఆసరాగా తీసుకోవాలనుకుంటుంది. ఆ సమయంలో ఆ స్నేహితురాళ్ళందరూ ఆమెను నువ్వు చేస్తున్నదని తప్పంటూ మందలించడంతో పాటు మాకూ, ఆస్తి అంతస్తులున్నప్పటికీ తాము తమ భర్తలకు చేదోడువాదోడుగా వుండడాన్ని ఇష్టపడతాం అదే మా సంసార జీవితం సాఫీగా సాగడానికి కారణం అని వివరించి చెప్తారు. చిన్నప్పటి నుండీ ఏ విషయంలోనూ సర్దుబాటు ధోరణి లేని రేఖ ముత్యాలు ఇంటికి వెళ్తుంది. కాని అక్కడికి చేరుకున్న తర్వాత పేద మనుషుల జీవితాలు ఎంత అందంగా, అన్యోన్యంగా వుంటాయో తెలుసు కుంటుంది. దానికోసమై దర్శకుడు నిర్మలమ్మ దంపతుల జీవితంలో జరిగే చిలిపి విషయాలను, వారు కష్టసుఖాలను కలిసి పంచుకునే తీరును చూపే సన్నివేశాలను చక్కగా దృశ్యీకరించారు. మాంబ యొక్క మేనేజర్ దాసు పాత్ర ద్వారా తెలిసే విషయం మన చుట్టూ వుండే మనుషులకు మనం మానసికంగా బలహీనులుగా కనపడినా మనలోని లోపాలను తెలియపరిచినా, ప్రతీ విషయానికి వారిపైనే ఆధారపడినా, అన్నింటికీ మించి గుడ్డిగా నమ్మినా పర్యవసానాలు ఎలా వుంటాయనేది తెలియపరిచింది. రాజభక్తి రాజద్రోహానికి పాల్పడితే ఎలా వుంటుందో చూపేలా దాసు పాత్ర మాంబ ఆస్తులను రాయించుకోవడం ద్వారా అవగతం అవుతుంది. చిత్రంలో హాస్యాన్ని పుట్టించే ప్రత్యేక పాత్రల్లో కానిస్టేబుల్ సింహాచలం పాత్ర ఒకటి. ఈ పాత్రను అల్లు రామలింగయ్య పోషించగా మరొక పాత్రను మాంబ ఇంట్లో పనిమనిషిగా పనిచేసే పద్మనాభం పోషించారు. ఇక ఈ చిత్రంలో ప్రత్యేక విషయం ముత్యాలు తన మరదలు రాధను ఇష్టపడినప్పటికీ ఆమె కాలేజీలో లెక్చరర్ రామకృష్ణను ప్రేమిస్తుందనే విషయం తెలిసి ఆమెకు రామకృష్ణతో వివాహం చేయాలని పెద్దమనసుతో నిర్ణయం తీసుకోవడం. ఈ చిత్రానికి సంగీతం చక్రవర్తి అందించారు.

**చిత్రం: అల్లుడు పట్టిన భరతం**

**తారాగణం : కృష్ణంరాజు, జయసుధ, రమాప్రభ, కవిత, నాగభూషణం, అల్లు రామలింగయ్య, పద్మనాభం, నిర్మలమ్మ.**

**మాటలు : జంధ్యాల**

**సంగీతం : చక్రవర్తి**

**నిర్మాత : డి.వి.ఎస్.రాజు**

**దర్శకత్వం : కె. విశ్వనాథ్**

# చలి - చెలి ... !

చలియుకాలమందు చక్కనికౌగిలి
నిచ్చి నిచ్చ దీర్చు యిలనుచెలియె
చెలినిజూసినచలి చెంపలేసుకొనిల
జారు,వింత గాదె! జాణతనము!!

చెలియున్నమగడు చెదరదుబెదరదు
చలియునెంతవున్న సంబరమున
చలియుగల్గినున్న సరసమేపండించు
చలికి చెలిని మించ చాతనౌనె!


శీతకాలమందుశ్రీమతిచెలిరూపు
తన్మయంబునిచ్చు తనివిదీర
చెలియకున్నయుక్తి చెదరగొట్టుచలిని
సాగనంపుగాంచ సరసరీతి!

శీతకాలమిలను చోద్యమెమూడ్నెల్లు
వత్సరానతాను వచ్చిపోవు
చెలియకాపురంబు చెదరనినూరేళ్ళు
చలికిమమించుశక్తి సఖికుందు!

వచ్చిపోవుచలికి వగచనేలభువిన
వెచ్చదనమునిచ్చు వెలదిగాంచ
బ్రతుకువచ్చుతోడు భార్యయునున్నాళ్ళు!
అపరపరమమూర్తి నమరప్రేమ!!

శీతకాలమందు శీఘ్రుమెపెళ్ళిళ్ళు
చేసిసాగనంపు చెల్మితోడ
చలికిగలదునూహ చక్కనిహాయిని
తెలియకుండనిచ్చు తెరువరిలను!

శీతకాలమిచ్చు శీఘ్రమెగర్భము
కొత్తపెళ్ళిజంట కోర్కెదీర
అమ్మగారుమార్చు నాది శక్తిచలియు
చలిచెలియునిరువురు సమమెజూడ!



భార్యభర్తలకిల భావిగతులుజూపు
వంశతిలకులకును వరుసగాను
మూలమైనచలికిమొక్క వలయుజంట
అమ్మనాన్నకిలను నబ్బురంబు!!

**డా. జీఎస్వీ**
పెద్దపల్లి, ఫోన్ : 94901 45913

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (53) హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# ప్రపంచ పద్యం – గోపి కవిత్వం

**డా. వెల్దండి శ్రీధర్,** తెలుగు అధ్యాపకులు, గజ్వేల్. ఫోన్ : 9866977741.

కవికి సరిహద్దులు లేవు. అయినా కొంతమంది కవులు కొన్ని గీతల మీదనే నిలబడి కవిత్వం రాస్తుంటారు. చాలా కొద్దిమంది మాత్రమే ఆ గీతలను చెరిపేసి సార్వకాలిక, ప్రాపంచిక దృక్పథంతో కవిత్వం రాస్తుంటారు. అలాంటి కవిత్వమే కాలానికి ఎదురు నిలిచి మనిషి ఆంతరంగిక పోరల్ని, మానవత్వపు వెలుగుల్ని, సంక్లిష్టతల్ని, సంక్షోభాల్ని రికార్డు చేస్తాయి. గత అయిదున్నర దశాబ్దాలుగా నిత్యచలనశీల కవిగా మానవ మనుగడలోని ప్రతి మూలమలుపునీ కవిత్వం చేస్తూ సాగుతున్న డా. ఎన్. గోపి తాజా బృహత్తర కవితా సంపుటి **'మనిషిని కలిసినట్టుండాలి.'** ఇందులో 2016 నుండి 2019 మధ్య రాసిన కవితలెన్నో మనల్ని తడితడిగా పలకరిస్తాయి.

**"కవిత్వమనేది ఒక ఆత్మ పలికే భాష. అది గతానికీ వర్తమానానికీ జరిగే నిరంతర సంభాషణ. అత్యాధునిక కవిత్వంలో 'నేను' అన్నప్పుడల్లా అది 'మేము'తో సమానం. వ్యక్తివాదం రాకుండా జాగ్రత్త పడాలని తాత్పర్యం. అవసరాల ఉత్పత్తి, బృహత్ పెట్టుబడులు, ధనంవేటల కాలంలో ఉన్నాం మనం. చేతనోజ్జ్వల స్పృహతో జీవితంలోని విలువలను ఉన్నతీకరించుకోవడమే మన తక్షణ కర్తవ్యం. మార్పునకు కవిత్వాన్ని మించిన సాధనం లేదు. మానవీయ మూల్యాలను చేతులడ్డం పెట్టి కాపాడగలిగేది కవిత్వమే"** అంటారు డా. ఎన్. గోపి ఈ కవిత్వానికి రాసుకున్న ముందుమాటలో. సరిగ్గా ఈ సూత్రీకరణతో సాగినవే ఇందులోని కవితలన్నీ.

మొదటినుంచి కూడా డా. ఎన్. గోపి అట్టడుగు వర్గాల జీవితాలను దుర్బిణి వేసి పరిశీలించి, మనో సముద్రంలో ఎగిసిపడే భావోద్వేగాలను అంతే సహజంగా కవిత్వీకరిస్తూ వస్తున్నారు. గత నాలుగు దశాబ్దాలలో ఎన్నో మార్పులు ప్రపంచాన్ని కుదిపేశాయి. ముఖ్యంగా మనిషి ప్రయాణంలో గత నాలుగేళ్లు మరింత గాయాల మయం. అందుకే ఈ నాలుగేళ్ల కాలంతోపాటు ప్రయాణించే ఏ కవీ ప్రశాంతంగా ఉండలేకపోయాడు. సగటు మనిషితో తాను కూడా అనునాదమై ధ్వనించాడు. బాధాతప్త హృదయం కార్చే వాళ్ల దుఃఖపు తడిని తన అక్షరాలకు అద్దుకున్నాడు. ఈ దిశగా డా. ఎన్. గోపి ముందు వరుసలో ఉంటారు.

**"విత్తనం దగ్గరి నుంచి / నడుం విరిగేదాకా
రుతువుల తారుమారు నుంచి / జలక్రతువుల దాకా
ఓట్ల వాగ్దానం నుంచి / దళారుల దౌష్ట్యం దాకా
అలిసిపోయిన డొల్ల జీవితాన్ని
మృత్యువుతో నింపుకున్నాడు"**

ఇవాళ నాగలి దున్నడం నరకమెందుకైందో, బక్కజీవులైన రైతులు రోడ్డు మీదికెక్కి ఎందుకు నినదించాల్సి వస్తోందో, రైతుల ఆత్మహత్యలన్నీ హత్యలేనని ఎందుకు తోచటం లేదో విడమరిచి చెప్తాయి ఈ సంపుటిలోని చాలా కవితలు. భారత రాజ్యాంగం ప్రతిమనిషికీ జీవించే హక్కును కల్పించింది. కాని ఆధునిక సందర్భంలో అదెలా ఆబాసు పాలవుతుందో ఎంతో లోతుగా విశ్లేషించి ఎన్నో ఉదాహరణలను చూపుతారు డా. ఎన్. గోపి.

మనిషి కోసం, లోకాన్ని మానవత్వపు చూపుతో చూడడం నేర్పిస్తాయి డా. ఎన్. గోపి కవితలు. అందుకే ప్రతి అడుగులో, లోకంలోని ప్రతి మార్పులో మానవత్వాన్ని వెతుకుతాడు కవి. పేదరికంలో మగ్గిపోయే వాళ్లకోసం, శ్రమ సంస్కృతిని గౌరవించే వాళ్ల కోసం, ఆకలి భాషలో మాట్లాడే వాళ్లకోసం, సామాన్యుల ఆరాటాల, పోరాటాలకోసం ఎన్. గోపి అక్షరం ఎప్పుడూ తాపత్రయ పడుతూనే ఉంటుంది. మనిషిని నిలబెట్టడానికి, అతని ప్రాణ సంగీతాన్ని వినిపించడానికి **'కాలం గోడపై కవిత్వం రాయక తప్పదు'** అని నిరంతరం కవిత్వమై రగిలిపోవడం క్రియాశీల కవికే సాధ్యం.

**"నా నాలుకను తెగ్గోస్తున్నారు / శస్త్రచికిత్స చేసి
మరో నాలుకను అతికిస్తున్నారు / నా తల్లి రక్తంలోంచి
ఊపిరిలోంచి / వారసత్వంగా మొలిచిన
పలుకు మొక్కలను పెకలిస్తున్నారు / నా డి.ఎన్.ఏ.కు
తప్పుడు రిపోర్టులు రాస్తున్నారు
నా అస్తిత్వాన్ని అధఃపాతాళానికి తొక్కేస్తున్నారు
ఇవాళ బడి / ఒక పెట్టుబడి"**

భాష చుట్టూ ఒక నాగరికత ఉంది. ఒక ప్రాంతపు అస్తిత్వ వేదన ఉంది. ఒక సాంస్కృతిక వారసత్వం ఉంది. తరతరాల వ్యక్తీకరణ ఉంది. అలాంటి భాష ఇవాళ కనుమరుగు కావడానికి అంపశయ్య మీద చివరి రోజులు లెక్కిస్తోంది. విద్య వ్యాపారంగా మారిన చోట, డాలర్లు సంపాదించడమే లక్ష్యమైన చోట, కేవలం మార్కెట్ డిమాండ్ చేస్తోన్న మరయంత్రాలను ఉత్పత్తిచేయడమే అంతిమ కార్యమైన చోట భాష ఆత్మన్యూనతతో వెక్కిళ్లు పడుతోంది. తెలుగు భాష మాట్లాడడానికి నాలుక తడబడుతోంది. ఆత్మవిశ్వాసం తో అడుగు ముందుకు వేయలేక ఉన్నచోటనే కుప్పకూలుతోంది. ఎన్నో భాషలు అంతర్ధానమవుతున్నాయి. కార్పొరేట్ శక్తులు కేవలం మార్కుల భాషనే నేర్పుతున్నారు కాని మానవీయ విలువలు, విద్యార్థి మూర్తిమత్వానికి ఉపయోగపడే భాషలను పక్కకు నెట్టుతున్నారు. అందుకే మనచుట్టూ ఇంత దివాళకోరుతనం ఆవరించి ఉంది.

**'ఇవాళ నేను రెక్కలు తెగిన భావ విహంగాన్ని, నిలువెత్తు సాంస్కృతిక దుఃఖాన్ని'** అని 'భాషా విలాపాన్ని' వలపోస్తాడు కవి.

లోకంలోని సమస్త వస్తువులు, మనసు మూలలోని అన్ని పొరలు కవిత్వంగా అక్షర రూపం దాల్చాయి ఈ సంపుటిలో. కవి చూపు సోకిన ప్రతి వస్తువు, కవి భావనా ప్రపంచానికి తాకిన ఎన్నో సమయాలు కవిత్వమై మనిషిలా నిలబడ్డాయి ఈ గ్రంథంలో. మనకు లోచూపు తగ్గిపోయింది కాని నిజానికి ప్రతి వస్తువులో ఎంతో తాత్త్వికత దాగి ఉంది. వాటిని అర్థం చేసుకుంటే ఇన్ని నాటకాలు అక్కరే లేదు. ఈ వాస్తవికతను, సారాంశాన్ని అర్థం చేయించడానికే డా. ఎన్. గోపి పేర్చిన ఇంతటి బృహత్తర కవితా రాశి.

కవి ఎన్నుకున్న వస్తువులన్నింటి పైనా ఒక పరిణత స్పర్శ తొంగిచూస్తుంది. ఏడు పదుల అనుభవంలోంచి ఈ ప్రపంచాన్ని చూసినపుడు ఏదీ అక్కెరకు రాని సందర్భం, సన్నివేశం లేనే లేదు. **'దేన్నైనా మనిషిగా చూడటం నేర్చుకుంటే'** ఈ ప్రపంచపు 'వెదర్ రిపోర్టు' పూర్తిగా అర్థం అవుతుంది. ఢిల్లీ చుట్టూ ఎన్నో అనుభవాలు, అనుభూతులు కవికి. ఢిల్లీ దేశానికే కాదు కాలుష్యానికి కూడా రాజధానిగా మారింది. **'గాలికి కులమేది అన్నాడు ఓ కవి. ఇప్పుడు గాలికి స్థలమేదీ అని పాడుకోవాలి. పాడుకోవాలన్నా ఊపిరి కావాలి. శక్తి కావాలి.'** అంటాడు.

సముద్రమంత విశాలమైంది. లోతైంది ఇందులోని కవిత్వం. ఎన్నో కవితా శకలాలు మన ముఖాన్ని కెరటాల్లా తాకి గుండెలో కూలిపోతాయి. ముడి జీవితాలను, తడి పల్లెలను, పొడి రాజకీయాలను వస్త్రగాలం పట్టి కవి ఎన్నో కొత్త విత్తనాలను మన మనసు నేలమీద చల్లుతాడు. అవి అనివార్యంగా ప్రశ్నలుగానో, కర్తవ్యాలు గానో, జకముక రాయి నుండి వెలువడే నిప్పురవ్వలుగానో మొలకెత్తుతాయి.

**"కాలాన్ని చదవాలంటే / ఆమె ముఖంలోనే చదవాలి**
**పేజీలను తిప్పాలంటే / ఆమె రెప్పలే గుట్టు విప్పాలి**
**..............................**
**కాలాన్ని చదవాలంటే / అప్పుడదో కాగితం మాత్రమే**
**ఇప్పుడామె ముఖం**
**ఎంత చదివినా వొడువని జీవన కావ్యం"**

ఆమె జీవన సహచరి కావొచ్చు. ఆమె ప్రేమిక కావొచ్చు. ఆమె ఒకానొక అపరిచిత కావొచ్చు. ఆమె ఎవరైతేనేం ఆమెతోటి జ్ఞాపకాలు జీవన సౌందర్యానికి వ్యాఖ్యానాలు. కాలం ఇరుసులో పడి ఆమె ఎంతగా నలిగిపోయిందో! గాయాలతో కలిసి చేసిన ప్రయాణంలో ఆమె ఎంత కుమిలిపోయిందో! ఇన్నేళ్లు గడిచిపోయిన తరువాత ఇప్పుడామె ఏమీ రాయని తెల్లకాగితం కాదు. 'ఎంత చదివినా వొడువని జీవన కావ్యం'.

ఎన్నో మట్టిపాదాలు మనల్ని చేయి పట్టుకొని తీసుకుపోతాయి. ఆత్మవిశ్వాసాన్ని రక్తం నిండా నింపి దిగులు మేఘాన్ని ఆవలి తీరానికి తరిమేస్తాయి. గడ్డకట్టుకొని పోయిన క్షణాలని జ్వాలలా మండిస్తాయి. జీవిత సర్దుబాట్లు అక్షరాలుగా ప్రాణం పోసుకొని మనిషిని వర్తమానం మీద నిలబెడుతాయి. తెలంగాణ జీవాత్మ వాక్యాల మధ్య నిశ్శబ్దంగా ప్రవహిస్తుంది. ఒక సంచారత్వం మనల్ని ఆవహిస్తుంది. డా. ఎన్. గోపి కవిత్వానికుండే ఈ లక్షణాలే ఆయనను తన సమకాలీన కవులకన్నా ఎంతో ఎత్తులో నిలబెడుతాయి.ఏ కవినైనా ఏదో ఒక అస్తిత్వవాద చట్రంలో బిగించి చూపడం అలవాటైంది మనకు. కాని డా. ఎన్. గోపిలాంటి కవులు వాటిని దాటుకొని మానవత్వపు అంచు మీద నిలబడి కవిత్వం రాస్తుంటారు. అందుకే వాదాలను మించిన కవిత్వపాదాలు అలవోకగా పడుతుంటాయి ఆయన కవిత్వంలో.

**"భాషా విభాగాల్లో / చాలా వాటిని తొలగించి**
**క్రియల్ని మాత్రమే / హృదయాలకు హత్తుకుందాం**
**క్రియ / ఒక లయ**
**జీవితాన్ని ఒక సక్రియా సర్వస్వంగా / మలుచుకుందాం"**

నిష్క్రియాపరత్వంతో కాలాన్ని దొర్లించుకుంటూ పోతున్న ఇప్పటి తరాలకు బైబిల్ వాక్యంలాంటిది ఈ కవిత. ఓడిపోయినంత మాత్రాన జీవితం ఆరిపోదు. దైన్యానికి చోటువ్వకుండా, బాష్పనదులకు తావివ్వకుండా జీవితాన్ని గెలుచుకోవాలని 'పని తరగని గని' అంటాడు కవి. ఊపిరిని కూడదీసుకొని చేతుల్లో బలాన్ని నింపుకొని ఆలోచనా ద్వారాలను తెరిస్తే మనిషికి ఎదురే లేదంటాడు. ఉన్నచోటనే ఉండి కదలకపోతే ఎట్లా? **'కదలంది సూర్యుడెలా ఉదయిస్తాడు?'** అని ప్రశ్నిస్తాడు.

అల్లసాని పెద్దన నుంచి మేడసాని మోహన్ దాకా కవిత్వాన్ని చాలామంది కవులు నిర్వచించారు. కాని డా. ఎన్. గోపి కవిత్వాన్ని నిర్వచిస్తూనే దాన్ని జీవితానికి పర్యాయపదంగా మారుస్తాడు. దాన్నొక 'తపశ్చర్య' గా కీర్తిస్తాడు.


**"కవిత్వమంటే మరేమో కాదు / ఒక కులాన్నీ**
**ఒక మతాన్నీ / ఒక ప్రాంతాన్నీ తవ్విపోసి**
**నిన్ను నువ్వు ఖాళీపరుచుకొని**
**విశ్వం నిండా వ్యాపించడమే"**

డా. ఎన్. గోపి సప్తతి సందర్భంగా విడుదల చేసిన ఈ కవితా సంపుటిలో ప్రధానంగా నాలుగు పాయలుగా సాగింది కవిత్వం . 1. ధర్మాగ్రహం 2. ప్రతిఘటన 3. చైతన్యం 4. సత్యాన్వేషణ. అపారమైన వస్తువైవిధ్యంతో డా. ఎన్. గోపి కవిత్వం పాఠకునికి కొత్తదారులు చూపుతుంది. కవిత ఎత్తుగడ, నిర్వహణ, ముగింపుల్లో డా. ఎన్. గోపిది విలక్షణ శైలి. మన చుట్టూ ఉన్న ఎన్నో సాధారణ వస్తువులు, భావ శకలాలు కవితా పరిమళాన్ని అద్దుకొని కొత్త శక్తిని ప్రసరిస్తాయి.

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 (55) హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

# అట్టడుగు వర్గాల జీవన ప్రతిబింబం – బయటిగుడిసెలు

**డా. తండు క్రిష్ణ కౌండిన్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, నాగార్జున ప్రభుత్వ కళాశాల, నల్లగొండ.
ఫోన్ : 9704 7313 46




ఒక జాతి జీవన విధానం ఆ జాతి సంస్కృతిని ప్రతిబింబింప జేస్తుంది. సమాజంలో ఉన్నత వర్గాల వారు తమ జీవితాలను చిత్రించే సాహిత్య కళా సంస్కృతులను ఎన్నో కలిగి ఉన్నప్పటికీ నిమ్న వర్గాల వారికి మాత్రం సరిగ్గా లేవని చెప్పవచ్చు. అగ్రవర్ణాల ఆధిపత్యం కింద పాలక భావజాలపు ప్రభావం వల్ల నిమ్న వర్గాల వారి సంస్కృతి నలిగిపోయింది. ఆధునికకాలంలో ఆయా వర్గాల నుంచి పుట్టుకు వచ్చిన రచయితల వల్ల వారిని అనుగమించే ప్రగతిశీల వాదుల వల్ల సామాజిక శాస్త్ర పరిశోధనల వల్ల వారి జీవితం కొంతైనా బయటపడుతుంది. వాస్తవానికి బయటికి వచ్చిన దానితో పోలిస్తే బయటకు రాని సమూహాలు ఎన్నో ఉన్నాయి. అలా అట్టడుగున పడి కనిపించని వాస్తవాలను వెలికి తీయాల్సిన అవసరం నేటి రచయితలకు ఎంతైనా ఉంది. సరిగ్గా ఈ ప్రయత్నమే చేశారు  ప్రముఖ రచయిత దేవులపల్లి కృష్ణమూర్తి గారు. వీరు రాసిన **'బయటి గుడిసెలు'** నవల ముఖ్యంగా మొండి, దొమ్మరి, ఎరుకల, బుడగజంగాల జీవన విధానాలను తెలియజేస్తుంది. ఈ గ్రంథానికి ముందుమాటలో ఎన్. వేణుగోపాల్ గారు అన్నట్లుగా **'మాటల తీరు, స్పందనలు, హావభావాలు, అలవాట్లు, జీవనగమనం, దారుణమైన విషాదాలు, జీవన భీభత్సం సమాజంలో ఆధునికత ప్రవేశించిన కొద్దీ వీరి జీవితాలలో వస్తున్న మార్పులు – సమస్తమూ ఎంత వాస్తవికంగా, విశ్వసనీయంగా చిత్రణ పొందాయంటే రచయిత తన పాత్రలతో సంపూర్ణంగా తాదాత్మ్యం చెంది ఉండకపోతే అది సాధ్యమయ్యేదే కాదు. నిజానికి చాలా సందర్భాలలో అవి పాత్రలు కాదేమోనని, నిజజీవిత వ్యక్తులే తమంతట తాముగా, తమ గుణదోషా లన్నిటితో, లక్షణాలన్నిటితో  ఈ పుటల మీదకి నడిచి వచ్చారేమోనని అనిపిస్తుంది'** అని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రం లేదు.

దళితుల కన్నా, ఆదివాసీల కన్నా మరింత ఆవల అంచులలో ఉండడంవల్ల వీరు బయటి గుడిసెల వారు అయ్యారు. సంభాషణల్లో మొరటుతనం, స్త్రీ పురుష సంబంధాలు, అతిగా మద్యపానం చేయడం, బూతులు మాట్లాడటం వంటి కారణాల వల్ల వీరు సమాజం అంచులలో ఉన్నవారుగా పరిగణించబడ్డారు. రచయిత వీరి జీవితాలతో మమేకమై పోవడం వల్ల జీవన్మరణ ఘర్షణలను, కష్టాలను కడగండ్లను ఆద్యంతము వ్యక్తీకరించిన విధానం బాగుంది. రచయిత ఇంటి పక్కనే బయటి గుడిసెలు అనేకం ఉండడం వల్ల రచయితకు ఆ గుడిసెలోని ప్రతి మాట వినిపిస్తోంది, ప్రతి చేష్ట కనిపిస్తుంది. కృష్ణమూర్తి గారు తన ఇంట్లో ఏ మూల ఉన్నా, ఏ పని చేసుకుంటున్నా కూడా బయట గుడిసెల వారి రోజు వారీ సమస్యలు ప్రత్యక్షంగా చూడడం జరిగింది. వీరి జీవితాలే ఈ 'బయటి గుడిసెలు' నవలకు ఆధారం.

ఈ నవలలో ప్రధానంగా  బైరి ఎల్లని  జీవన ప్రస్థానం కనబడు తున్నప్పటికీ ఆయా సందర్భాల్లో పలు కుటుంబాల జీవన స్థితిగతులను రచయిత తెలియజేయడం జరిగింది. ఎల్లని  జీవన ప్రస్థానం శ్రీశైలం ప్రాంతం నుండి ప్రారంభమై అనేక ఊర్లను దాటుకుంటూ ఆయా ప్రాంతాలలో జీవనం కొనసాగిస్తూ తాటికల్లు వరకు కొనసాగింది. అక్కడే అతని జీవితం ముగుస్తుంది. ఒక్క బైరి ఎల్లని కుటుంబమే కాకుండా ఇతర బయటిగుడిసెల వారి జీవితాలను  చాలా చక్కగా తెలియజేశారు. ఈ నవల ప్రారంభం ఇలా కొనసాగుతుంది– **'శ్రీశైల ప్రాంతంలో ఏడేండ్ల నుండి వానలు పడక పంటలు లేవు. కరువు వచ్చి  జనం మలమల మాడుతుండ్రు. పశువులకు మేత దొరకడం లేదు. రాళ్ల మధ్య నుండి ఊటలూరుతున్న జలాలు కనిపించటం లేదు. ఏడాది పొడుగునా పారే వాగులు వంకలు ఎండిపోయినయి'** అంటూ కరువు తీవ్రతను తెలియజేయడం జరిగింది. బయట గుడిసెల వారి సంస్కృతికి  అద్దంపట్టే వారి జీవన విధానం, ఆచారాలు, వేడుకలు, నమ్మకాలు  మొదలగు విషయాలను ఈ నవల ద్వారా తెలుసుకోవచ్చు.

**జీవన విధానం :** బయటి గుడిసెల వారికి పెద్దగా ఆస్తులు ఏమీ ఉండవు. కొన్ని పందులు, ఒక ఊరు నుంచి మరొక ఊరికి సామాను రవాణా చేయడానికి ఒక గాడిద, వేటకుక్క, కొంత సామాను మాత్రమే వీరి ఆస్తులు. పందుల మేపుకుంటూ పొద్దుగుంకే వరకు ఒక ఊరు అండ చూసుకుని గుడిసె వేసుకొని పది, పదిహేను రోజులు ఆ ఊరిలో ఉంటారు. ఆ తర్వాత మరొక ఊరికి వెళ్లి జీవనాన్ని కొనసాగిస్తారు. వారసత్వం ద్వారా వచ్చిన ఆయుర్వేద వైద్యం కూడా చేస్తూ పొట్ట పోసుకుంటారు. పొద్దున్నే ఇంటింటికి తిరిగి ఇంత బువ్వ అడుక్కొచ్చుకుంటారు.  ఊళ్లకు

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక సంపుటి -25 : సంచిక - 4 56 హైదరాబాద్ ఫిబ్రవరి : 2022

పోయి మందులు అమ్మడమే కాకుండా అల్లి కర్ర ముక్కలతో ఈర్వెన్లు, దువ్వెన్లు చేస్తూ అమ్ముతుంటారు. దగ్గు దమ్ము, పాత రోగాలు, ఉబ్బసం, కోరింత దగ్గు, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, వాత పైత్యం మొదలగు రోగాలను చెట్ల క్రియలతో బాగు చేస్తారు. పిల్లలు లేని వాళ్లకు చెట్ల పసరు కూడా పోస్తారు. అదేవిధంగా గాడిద పాలు తాగించి చిన్నపిల్లల దగ్గును నయం చేస్తారు. పని లేనప్పుడు మగవాళ్ళు ఎలుకలు, పందికొక్కులు, ఉడుతలు, ఉడుములు పట్టుకొస్తారు. ప్రతి గుడిసెకు ఒక్క కుక్క ఉంటది. యజమాని బయటికి పోతుందంటే అది కూడా వెంట వస్తుంది. మొదట కుక్కకు ఇంత పెట్టిన తర్వాతనే తాము తింటారు. వాగుల్లో వల వేసి చేపలు పట్టి పూట గడుపుకుంటారు. కూరగాయలు వండుకోరు. ఏమీ దొరకని నాడు మిరపకాయలు, ఉల్లిగడ్డలు కలిపి నూరుకుంటారు. అంతేకాకుండా తుపాకులతో నీటి బాతులను, అడవి పిట్టలను వేటాడుతారు. చేలోకి అడవి పందులు, ముళ్ళపందులు వస్తుంటే మాటేసి వేటాడుతారు. ఇది వీరికి తరతరాల నుండి సంక్రమించిన విద్య. సైకిల్ మీద మామిడి కాయలు, జామకాయలు వేసుకొని పాత సామాన్లకు కాయలు ఇస్తుంటారు. ఈత మట్టలు కోసుకొచ్చి ఆకులు తీసి ఎండబెట్టి సాపలు అల్లుతారు. ఈత సువ్వలను నానబెట్టి గంపలు, తట్టలు బుట్టలు, గుమ్ములు, బండి జల్లలు అల్లి జీవనం సాగిస్తుంటారు. అప్పుడప్పుడు రైతుల బావుల దగ్గర ఉన్న మోటార్లను కూడా దొంగిలించి పాత సామాను కింద అమ్మి పొట్టపోసుకుంటారు. బాగా గొడవ పెట్టుకోవడం ఆ తర్వాత పోలీస్‌స్టేషన్‌కు పోవడం తాము సంపాదించిన సంపాదనంతా పోలీసులకి లంచం కింద ఇవ్వడం వీరికి సర్వసాధారణం. బాగా తాగిన మత్తులో ఉన్నప్పుడు **'ఎన్నాళ్ళు బతికినా కల్ల సంసారమిది కనిపెట్టి తిరుగవే చిలుకా మూన్నాళ్ళ బతుకు నీవు మురిసేవు తుళ్ళేవు ముందుగతి కానవే చిలుకా'** అంటూ తత్వాలు పాడుకుంటూ ఉంటారు.

**ఆచారాలు :** ఇతర కులాల వారి కన్నా వీరి ఆచారాలు భిన్నంగా ఉంటాయి. తమ ఇంట్లో ఏకార్యం జరిగినా కుల పెద్దలకు రెండు పావుల సారా పోయాలి. ముందుగా కుల పెద్దలకు కల్లు గాని సారా గాని పోసిన తర్వాతనే మిగతావారికి పోయాలి. లేకపోతే పెద్ద కొట్లాట జరుగుతుంది. సాలి పెళ్లిలో తనకు ముందుగా వడ్డించనందుకు మొండి ముత్తిగాడు కోపంతో అన్న మాటలే ఇందుకు నిదర్శనం. **'ఆపండెహె! ఏందిరా నేను ఇంటి ఆడబిడ్డ మొగన్ని, కుల పెద్దను, మొదటి కంచుడు నాకు వంచకుండా ఆ బికారి ముందాకొడుక్కు వంచుతావురా! నేనంత కండ్లకు కనపడకుండా పోయినాన్రా! మొన్న మీ ఇంటికాడ అట్లనే చేస్తివి, సరే పోనియ్యి పొరపాటు అయినది అనుకుంటే ఇయ్యాల కూడా అట్లనే చేసి నా పరువు తీస్తివి. లేండిరా, మన పంగోల్లందరూ లేవండి, ఇంత మాత్రం కల్లు నేను పోయిస్త పాండిరా!'** (పుట సంఖ్య 28). ఇలా తమకు ఏమాత్రం మర్యాద ఇవ్వకపోయినా ఇజ్జతు పోయినంత బాధపడుతారు.

ఆరోగ్యం బాగాలేనప్పుడు సరైన వైద్యుని దగ్గరికి వెళ్లకుండా భూతవైద్యుల దగ్గరికి వెళ్తారు. ఎల్లనికి మంత్రాలు రాకపోయినా మంత్రాలు వచ్చినట్లుగా నటిస్తూ మానసికంగా బాగాలేని వారికి ఓ నాలుగు మంత్రాలు వచ్చి రానివి చదువుతూ దయ్యాన్ని పారద్రోలినట్లుగా తమ చేష్టల ద్వారా నమ్మిస్తాడు . ఈ తంతులో ఉపయోగించే వస్తువులు సాంబ్రాణి, గంధకం, నిమ్మకాయలు, నల్లకోడి మొదలగునవి. అగ్రకులాల వారి అమ్మాయిని వీరి అబ్బాయిలు ఎవరైనా ప్రేమిస్తే వారు ఏమాత్రం సహించలేక ఆ అబ్బాయిని చంపేస్తారు. పెళ్లిలో తాళికి బదులుగా వరుడు వధువు మెడలో పసుపు కొమ్ము కడుతాడు. పసుపు కొమ్ము కట్టగానే పెళ్లి అయిపోయినట్లుగా భావిస్తారు.

**నమ్మకాలు :** బయటి గుడిసెల వారికి మిగతావారికన్నా వెర్రి నమ్మకాలు ఎక్కువ. తేలు కుట్టినా పాము కరచినా ఏదో ఒక ఔషధాన్ని ఇవ్వడంతోపాటు మంత్రాన్ని కూడా చదివినట్లు చేస్తారు. వాస్తవానికి మంత్రాలకు చింతకాయలు రాలవు అను సామెత ఛందంగానే మంత్రాలతో కాకుండా సరైన ఔషధం ఇవ్వడం వల్లనే ఆ బాధ పూర్తిగా తగ్గిపోతుంది. అదే విధంగా ప్రజల బలహీనతల్ని ఆసరాగా చేసుకొని పూట గడవడం కోసం భూత వైద్యునిలా నటిస్తుంటారు. వీరు స్థిర నివాసం లేక ఊరూరా తిరగడానికి కారణం పార్వతి శాపం అని ఒక నమ్మకం కూడా వీరికి ఉంటుంది. దానికి సంబంధించిన కథలు ఇలా చెబుతుంటారు. వీరి మూల పురుషులు ఒకనాడు అడవిలోకి పోయి తిండికొరకు ఒక కన్నంలో ఎలుకలున్నాయని తవ్వుతున్నారట. ఆ సమయంలో పార్వతీ పరమేశ్వరులు ఆకాశంలో విహరిస్తూ వారిని చూశారట. **'అరే ఈ జంగాలు మనను గూర్చి గానం చేస్తూ జీవిస్తున్నారు కదా! వీరికి ఏదైనా మంచి దారి చూపించు అని పార్వతి శివుని కోరింది'.** అప్పుడు శివుడు పార్వతి మాట కాదనలేక వారిని పరీక్షించదలచి శివుడు ముసలివాడుగా, పార్వతి యువతిగా వేషాలు మార్చుకొని వారి వద్దకు వచ్చినారట. వారితో మాట్లాడుతూ హితబోధ చేయబోతున్నంతలో శివుని పక్కకు దోసి పార్వతిని బలాత్కారం చేయబోయారట. అప్పుడు పార్వతి కోపించి **'మీరు సుఖ శాంతులు కోల్పోయి స్థిరనివాసం లేక ఊరూరా తిరుగుతూ హీనంగా బతుకుదురు గాక'** అని శపించిందట. అప్పటినుండి సంచార జీవితం గడుపుతున్నామనేది వీరి నమ్మకం. ఏ తప్పు చేయనప్పుడు బాగా వేడిచేసిన గడ్డపారను ముట్టుకొని పైకి లేపినప్పటికీ కాలదనే నమ్మకం వీరికి ఉంటుంది. మైసి పురుషోత్తముతో అక్రమ సంబంధం పెట్టుకున్నప్పుడు తాను ఏ తప్పు చేయలేదని నిరూపించుకోవాలంటే బాగా వేడిచేసిన గడ్డపారను పట్టుకొని పైకి లేపాలని పెద్ద మనుషులు తీర్మానం చేస్తారు. అప్పుడు మైసి భయపడి తాను చేసిన తప్పును ఒప్పుకుంటుంది.

**వేడుకలు :** పుట్టుక నుండి మరణం వరకు విందులు, వినోదాలు అన్ని మందు తోనే ముడిపడి ఉంటాయి. వీరి స్థాయికి తగ్గట్టుగా వేడుకలను జరుపుకుంటారు. తమ పిల్లలకు కట్నం కింద రెండు పంది పిల్లలను ఇవ్వడం తప్ప అంతకన్నా పెద్దగా ఇచ్చే తాహతు కూడా ఉండదు. పెళ్లి చాలా సాదాసీదాగా జరుగుతుంది. బంగారు ఆభరణాలు చేయించేంత స్థోమత ఉండదు గనుక తాళి బదులుగా పసుపు కొమ్మును వధువు మెడలో కట్టడం జరుగుతుంది. వచ్చిన బంధువులు కట్నకానుకలు పిల్ల, పిల్లగాని చేతుల్లో పెట్టి చదివిస్తారు. ఆ తర్వాత భోజనం చేసి ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోతారు. కడుపునిండా మందు తాగడం కన్నా గొప్ప వేడుక వీరికి మరొకటి ఏమీ ఉండదు. సుఖానికి, దుఃఖానికి ప్రతి సందర్భంలో మందు ఉండాల్సిందే. మంచి కార్యమైనా చెడు కార్యమైనా మందు లేకుండా ఉంటే ఆ కార్యం ఫలవంతం కానట్లే. మందు లేకుండా ఏ కార్యమూ జరగదు. అప్పుడే ఆనందంగా ఉంటారు, అంతలోనే కొట్టుకొని తలలు పగలగొట్టుకుని స్టేషన్ పాలవుతారు. అది ఆనందమైనా ఆవేదనైనా వీరికి క్షణకాలమే ఉంటాయి.

**రచనా రీతులు :** ఈ నవల అట్టడుగు వర్గాల వారి జీవనాన్ని గూర్చి తెలియజేసేది కావున ఇందులోని శైలి కూడా వ్యవహారిక భాషలోనే ఉంది. చదువుకోని వారు కావడం వల్ల సహజంగా వీరి వ్యవహారశైలిని తన రచన ద్వారా చక్కగా తెలియజేశారు. ఎక్కడ కూడా కృత్రిమత్వం ఉండదు. వీరితో ఎంతో మమేకమైతే తప్ప ఇంత సహజ మైన సంభాషణలు రాయడం సాధ్యం కాదు. ప్రత్యక్షంగా వీరి జీవన శైలిని గమనించినారు కాబట్టి నిజ జీవిత వ్యక్తులే మన కళ్ళముందు ఉన్నట్లుగా గోచరిస్తుంది. భార్యాభర్తల సంభాషణల్లో పైకి తిట్లు గానే కనిపిస్తున్నప్పటికీ లోన ఎంతో ప్రేమ ఉందన్న విషయాన్ని సహజమైన సంభాషణల ద్వారా వ్యక్తీకరించడం జరిగింది– **'పొద్దున పోతివి బతికితివా, చస్తివా జాడ తెల్వకపాయె సావనన్న సావకపోతివి నా పాపాన బడ్డివి'**. నిజంగా భార్యా భర్తలు మన ముందు మాట్లాడుతున్నట్లుగానే అతి సహజంగా కనిపిస్తుంది. బయటి గుడిసెల వారి జీవితాలను రచయిత నిశితంగా పరిశీలించడం వల్లనే ప్రతి సన్నివేశాన్ని మన కళ్ళకు కట్టినట్లుగా చక్కగా చెప్పడం జరిగింది. ఎడ్ల మల్లడు భార్య ఎల్లితో కల్లు తాగి వస్తూ బిడ్డ పెళ్లి చేయాలనే విషయంలో వారి మధ్య తగవులాట మొదలవుతుంది.దాంతో మల్లడు తన భార్యను కొట్టడంతో భార్య కోపంతో ఏడుస్తూ **'నీ మీద మన్ను బొయ్య ఎప్పుడు మాట్లాడినా కొట్టే మాట్లాడుతడే. నా ఒళ్ళంతా గుల్ల గుల్ల ఆయె. నాకు సావన్నా రాదాయె దేవుడా'** అంటూ ఏడవడాన్ని కూడా అతి సహజంగా చిత్రీకరించడం జరిగింది.

ఈ విధంగా దేవులపల్లి కృష్ణమూర్తి గారు బయటి గుడిసెల వారి జీవన విధానాన్ని ఈ నవల ద్వారా తెలియజేయడం అభినందనీయం. ఇప్పటికీ గ్రామాల్లో అక్కడక్కడ బయటి గుడిసెల వారు తారసపడుతుంటారు. విద్యావంతులైన ప్రతి ఒక్కరు వీరి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సామాజికంగా, విద్యాపరంగా రాజకీయంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెంది సమాజం అంచున కాకుండా సమాజంలో ఒక భాగంగా జీవనయానం కొనసాగించాల్సిన అవసరం ఉంది. అప్పుడే కృష్ణమూర్తిగారి కృషి నూటికి నూరుపాళ్లు ఫలిస్తుంది.

**ఆలోకనం**

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

**'కదంబం'**

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే

ఉత్తమ గ్రంథం **'కదంబం'**.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

సమీక్ష

# కథాకాశంలో కొత్త సూర్యోదయం

**డా. ఎస్. రఘు,** తెలుగు సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్: 98482 08533

కథా సాహిత్యంలో నేడు అడవులనుంచి బతుకువాసనల గాలులు బలంగా వీస్తున్నాయి. కొండల మీద దట్టంగా అలముకున్న ఇప్పపూలచెట్ల గుబుర్ల కింద గిరిజనుల జీవన పోరాట స్వరాలు ప్రతిధ్వనిస్తున్నాయి. అడవికి మైదానానికి మధ్యనున్న తండాల్లోంచి బంజారాల బతుకు రోదనలు మిన్నంటుతున్నాయి. సరైనగూడు, ఉపాధి, మౌలిక వసతుల్లేని బతుకువాకిళ్ళు పొక్కిలై వెక్కిరిస్తున్నాయి. ఆ మట్టి రేణువులు ప్రతిక్షణం గుండెను కమ్ముకుంటుంటే నడిసొచ్చిన కాలిబాటలు ఎన్నో గాథలు గర్భీకరించుకుని తనవారికోసం ఎదురు చూస్తున్నాయి. అటువంటి వేళ తన మూలాలను మరచిపోకుండా డా.సూర్యాధనంజయ్ 'ఝోళి' కథాసంపుటి ద్వారా బంజారాల జీవితాల్లో అలముకున్న వెలుగునీడల్ని అక్షరీకరించారు.

వర్తమాన కాలంలో విస్మృతికి, విస్మరణకు గురైన అనేక అంశాలపై లోతైన పరిశోధనలు, చర్చలు విస్తృతంగా జరుగుతున్నాయి. ఆ క్రమంలో గిరిజన జీవితాలు, సంస్కృతి, సాహిత్యాలపై పాఠ్యాంశాలుగా విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నారు డా.సూర్య. తన మూలాల మూల్యాలను తెలుసుకోవడానికి బంజారా జాతిపై విశేషమైన పరిశోధనలు చేశారు. అధ్యాపకులుగా తరగతిగదిలో పాఠ్యాంశాల బోధనా సందర్భంలో తలెత్తిన అనేక ఆలోచనలను గ్రంథస్థం చేస్తున్నారు. 'బంజారా నానీలు' లఘు కవిత్వంలో తమవారి జీవన గమనాన్ని, కష్టసుఖాలను రేఖామాత్రంగా స్పర్శించారు. 'తాంగ్డి' వ్యాస సంపుటిలో జానపద, గిరిజన విజ్ఞాన శాస్త్రాంశాలకు సంబంధించిన ప్రామాణిక వ్యాసాలను రచించి మౌలికమైన విశేషాలను, సత్యాలను లోకానికి అందించారు. ఆ పరంపరలో ఈ ఝోళిలోని పన్నెండు కథలు మైదాన ప్రాంతాల వారికి తెలియని కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి.

డా. సూర్య తన కథావస్తువుల కోసం ప్రత్యేకంగా ఎక్కడా సంచరించలేదు, అన్వేషించలేదు. ఇప్పటివరకు కదలివచ్చిన దారులను, ఎక్కినమెట్లను మరవకుండా ప్రతి అనుభవాన్ని జాగ్రత్తగా ముల్లెగట్టుకుని వచ్చారు. కాస్మోపాలిటన్ కల్చర్‌ను దగ్గరగా చూస్తున్నా తన భల్లూనాయక్ తండా పరిసరాలను ఏ మాత్రం విస్మరించలేదు. నాగరికుల మధ్య సహవాసం చేస్తున్నా చిన్నప్పుడు తన స్కూల్ డ్రస్సులు కుట్టిన మస్తానన్నను మరవలేదు. మస్తానన్నతో తనకున్న అనుబంధాన్ని 'మస్తానన్న డబ్బా' కథలో ఆర్ద్రంగా చిత్రీకరించారు. సహజమైన జీవన సన్నివేశాలు, సంఘటనలనుండి విలువైన బతుకు సారాంశాన్ని అందిస్తాయి ఈ కథలు.

రచయిత్రి ప్రతి జ్ఞాపకాన్ని ఒక అపురూపమైన జీవనసత్యంగా మలుచుకుని పఠితలకు స్ఫూర్తిని కలిగిస్తారు. ఒక పట్టణవాసి, తండా బాలికల మధ్య నెలకొన్న అన్నాచెల్లెల బంధం ఆదర్శంగా ఆత్మీయంగా నడుస్తుంది. కాలక్రమేణా పెరిగిన దూరం అంతర్మథనానికి గురిచేస్తుంది. ముగింపు భావోద్వేగభరితంగా వెంటాడుతుంది. మరోవైపునుంచి చూస్తే ఈ కథ తండావాసుల మనస్తత్వాన్ని పట్టి చూపుతుంది. తండా ప్రజలు మైదానవాసులపై ఏర్పరచుకున్న అపోహలను, అనుమానాలను, సంశయాలను తెలుపుతుంది.

కలుషితమైన నీరు త్రాగడం వలన వచ్చే విషజ్వరాలకు, అనారోగ్యాలకు మైదానప్రాంత మనుషులు చేసే మంత్రాలు కారణమని నమ్మే తండా ప్రజల అజ్ఞానాన్ని వివరిస్తుంది. పట్టణంలోని వ్యాపారస్థులు స్వచ్ఛమైన తండాల పర్యావరణాన్ని ఎలా కాలుష్యమయం చేస్తారో కూడా ఈ కథల ద్వారా అర్థమవుతుంది. తండా ప్రజలు ఎంత అమాయకులు, నిర్మలమైనవారో నిరూపితమవుతుంది. **"అడవి బిడ్డలు కొత్తవారు వస్తే త్వరగా నమ్మలేరు. నమ్మితే, ప్రేమిస్తే కడుపులో పెట్టుకొని చూసుకుంటారు. వారికేదైనా ఎక్కువే! ప్రేమైనా...! కోపమైనా!..."** అనేమాటలు ఈ కథలన్నిటా అంతర్లీనంగా ప్రవహిస్తాయి. పాత్రల ఆత్మవిమర్శలో రచయిత్రి మనసు ప్రతిబింబిస్తుంది.

ఈ సంపుటిలోని 'పల్లీబుట్ట' కథలో 'సక్కూ' పాత్ర కష్టాలు, బాధలు గుండెల్ని పిండేస్తాయి. ప్రతిరోజు రైలులో పల్లీలు అమ్ముకుంటూ పొట్టనింపుకునే సక్కూ అనుభవించిన కష్టనష్టాలకు మనసు దుఃఖంతో తడిసిపోతుంది. ట్రైన్‌లో వ్యాపారం చేసుకోవడానికి లైసెన్స్ లేదని వేధించే టి.సి లను తప్పించుకోవడం పెద్దసాహసమే. ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బుల్ని దొంగలు ఎత్తుకపోవడంతో సక్కూ జీవితం అంధకారంలోకి జారుకుంటుంది. ఆమెలో ఆవరించిన శూన్యం, దుఃఖం అందరిని కలచివేస్తుంది. **'ఖాళీ పల్లీల బుట్టలు జీవితాన్ని వెక్కిరిస్తున్నట్టనిపిస్తుంది'** అనే వాక్యంతో కథముగుస్తుంది కాని, సక్కూ జీవన పోరాటం మాత్రం ముగియదు. మళ్ళీ మొదలవుతుంది.

ట్రైన్‌లో ప్రయాణిస్తున్నప్పుడు కాలక్షేపం కోసం, చిన్న జిహ్వా చాపల్యంతో కొనుక్కునే పల్లీల వెనుక ఎంతటి విషాదవ్యథలు దాగివున్నాయో గుర్తుకు వస్తే అది రచయిత్రి తప్పుకాదు. తాత్కాలిక ప్రయాణంలో ఎదురయ్యే ఈ చిరువ్యాపారుల వెనుక ఎంత వేదనతో నిండిన బతుకు భారం ఉందో ఈ కథ చదివితే గుర్తుకురాక మానదు. రైలు ఎక్కిదిగే కాలవ్యవధిలో డా.సూర్య ఒక శ్రామికలోకపు గాయాల గాథను దృశ్యమానం చేస్తారు.


ఈ కథల్లో రచయిత్రి తమ లంబాడా జాతిలో వుండే సానుకూల విషయాలకే ప్రాధాన్యం ఇవ్వలేదు. ఎటువంటి మోహమాటాలు లేకుండా ప్రతీకూల అంశాలను ప్రస్తావించారు. తండా ప్రజల్లోని బలహీనతలు, వ్యసనాలను నిర్మొహమాటంగా చర్చించారు. **'కేసులా'** కథలో హరిసింగ్ తాగుడుకు బానిసకావడానికి కారణం చెపుతూనే **'తండాలో ఇంటింటికి సారాబట్టి ఉంటుంది. కొందరు బెల్లం సారా కాస్తే ఇంకొందరు ఇప్పపూల సారా తయారుచేస్తారు. సారాయే లంబాడీలందరికి జీవనాధారం'** అనే చేదునిజాన్ని వెల్లడిస్తారు. అదే సారా సోని జీవితాన్ని ఎంత అల్లకల్లోలం చేసిందో మరో పార్శ్వాన్ని చూపుతుంది. సోని భర్త మరణాన్ని దిగమింగుకునే క్రమాన్ని వైవిధ్యంగా ఆవిష్కరిస్తారు. **'మోదుగు చెట్టు మన జీవితానికి ప్రతీక. జ్వలించే వేసవి మంటల్లో కూడా కాంతివంతంగా ప్రకాశిస్తుంది మోదుగుచెట్టు'** అని ప్రవచించిన బంజారాదైవం సేవాలాల్ సందేశాన్ని స్మరిస్తూ తాత్త్వికశక్తిని అందిస్తారు రచయిత్రి. తన కష్టాలకు, దీనస్థితికి కారణమైన భర్తపాత్రను సానుభూతితో అర్థం చేసుకుంటూ భార్యసోనికి ఒక ఉపశమన మార్గాన్ని చూపడం భిన్నమైన అనుభూతిని అందిస్తుంది.

లంబాడా ప్రజల పేదరికం, నిరక్షరాస్యత, అధిక సంతానం, బాల్యవివాహాలు, వ్యసనాలు, మూఢనమ్మకాలు వారి జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. దానికితోడు ఆడపిల్లలు పుడితే పురిట్లోనే చంపుకోవడం, అమ్ముకోవడమనే దారుణ పరిస్థితి లంబాడీల జీవితాల్లో నెలకొంది. అటువంటి ఘోర విక్రయాల నేపథ్యంలో **'ఝోళి'** కథ కన్నీళ్ళు పెట్టిస్తుంది. చంద్రూ, లక్ష్మీల గారాల పాప కనిపించకుండాపోయిన ఉదంతంలోంచి తండాల్లో జరిగే ఆడపిల్లల వ్యాపార విక్రయాల దందా గురించి నివ్వెరపోయే వాస్తవాలను డా. సూర్య వర్ణించారు.

రచయిత్రిది నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంతం. దానికి సమీపంలోని దేవరకొండలోనే మొట్టమొదటి ఆడశిశువు అమ్మకం జరగడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. లంబాడీలు తమ ఆర్థిక పరిస్థితులను బాగు చేసుకోవడం కోసం ఆడపిల్లల్ని కని అమ్ముకోవడం స్థాయికి చేరడం మరింత విషాదం. చివరకు ఆడపిల్లలను దొంగచాటుగా అమ్ముకునే దశనుంచి వేలంపాటపాడే స్థితికి దిగజారిన పరిస్థితుల్లో ప్రభుత్వరంగం వారు 'సమగ్ర శిశు అభివృద్ధి పథకాన్ని' ప్రవేశపెట్టారు.

ఆడశిశువును పెంచలేనివారు, వద్దనుకునేవారి కోసం 'ఊయల'ను ఏర్పాటుచేశారు. అందులో ఈ శిశువును వదిలిపెడితే ప్రభుత్వమే వారి బాధ్యతలను చూస్తుంది. **'ఝోళి'** కథలో చంద్రూ తల్లే తన మనవరాలిని అమ్మడానికి సంతకు తీసుకెళ్ళి మనసొప్పక 'ఊయల' (ఝోళి) లో విడిచిపెడుతుంది. ఆ పసిపాపకోసం చంద్రూ లక్ష్మీల ఆవేదన మనసును కోసేస్తుంది. గాఢమైన చింతనతో

**ఝోళి (బంజారా కథా సంపుటి)**
ఆచార్య సూర్యాధనంజయ్,
వెల : 200 /-
**ప్రతులకు :** డా. ధనంజయ్ నాయక్
ఇం.నె. 12-5-55/1/టి-2,
విజయపురి కాలనీ, తార్నాక,
సికింద్రాబాద్ - 500 007
ఫోన్ : 98491 04187




మనచుట్టూ అలుముకున్న భయానక వాస్తవం భీతావహుల్ని చేస్తుంది. కథలో శిశువు దొరికి సుఖాంతమయింది కాని వాస్తవ జీవితంలో ఆచూకీ దొరకని శిశువుల రోదనలతోపాటు ఆయా తల్లిదండ్రుల కడుపుకోత పచ్చిగా మనల్ని వెంటాడుతుంది.

ఈ కథల్లోని బంజారా స్త్రీ పాత్రలు నిస్సహాయతను, స్వీయ నిర్ణయాధి కారంలేని తనాన్ని పైకి ప్రదర్శిస్తున్నట్లుగా కనిపిస్తాయి. కొద్దిగా లోతుగా వారి అంతరంగంలోకి వెళ్ళి పరిశీలిస్తే వారి అంతర్మథనం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే స్థైర్యం, తపన అర్థమవుతుంది. **'హిమ్మత్'** కథలో రమణమ్మ పాత్రలో ఒక దార్శనికత వ్యక్తమవుతుంది. బంజారాల తరతరాల దరిద్రం, పేదరికం తొలగిపోయే ప్రయత్నం చేస్తుంది రమణమ్మ.

తమ జాతి సంక్షేమం, స్వావలంబన కోసం బ్యాంక్ లోన్లు తీసుకోవడానికి, పొలం, ఇంటికాగితాలు తాకట్టుపెట్టడంలో తప్పులేదని వాదిస్తుంది. ప్రోత్సహిస్తుంది. ఆ తర్వాత పటేల్, పట్వారీలు మోసం చేస్తారు. అందరూ రమణమ్మను అనుమానిస్తారు. తీవ్రంగా దూషిస్తూ కొడతారు. వాటన్నిటిని తట్టుకుంటుంది. కొన్నాళ్ళకు అసలు మోసకారులు ఎవరో ప్రజలకు తెలుస్తుంది. రమణమ్మను క్షమించమని వేడుకుంటారు. ఆ సందర్భంలో రమణీబాయి చాలా ఉదాత్తంగా స్పందిస్తుంది.

తనను అభినందించిన కలెక్టర్‌తో తండా సమస్యలను చెప్పి అవసరమైన వ్యవసాయ పట్టాలను ఇప్పించేటట్లుగా చేస్తుంది. అక్షరజ్ఞానం లేకపోయినా ఎంతో ధైర్యంతో, ముందుచూపుతో తండా ప్రజల క్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేస్తుంది. రమణమ్మ పాత్రద్వారా బంజారాజాతి ధీరవనితల సాహసాన్ని, త్యాగాన్ని స్ఫురింజేస్తారు రచయిత్రి.

**'ధర్మిబాయి దొకాన్'** కథ బంజారా సాంస్కృతికతను సంప్రదాయాల విశేషాలను ప్రత్యేకంగా వర్ణిస్తుంది. ఈ కథ చదివితే పి.యశోదారెడ్డి కథలు గుర్తొస్తాయి. తెలంగాణ భాష, సంస్కృతి సంప్రదాయాల ప్రాధాన్యతను వివరించే క్రమంలోనే యశోదారెడ్డి కథలు నడుస్తాయి. డా.సూర్య కూడా ఆ దారిలోనే **'ధర్మిబాయి**

**దౌకాన్'** కథను నడిపించారు. ఒక బంజారా యువకుడు, బ్రాహ్మణ యువతి మధ్యగల ప్రేమ సఫలం కావడానికి యువకుడి తల్లిపెట్టిన రెండు కండీషన్స్ కథలో కీలకాంశం.

ఆ రెండు కండీషన్లలో ఒకటి పెండ్లి బంజారా సంస్కృతి, బంజారా వస్త్రధారణలో జరగాలి. రెండు తండాలోనే ఈ పెళ్ళిని చేయడం. ఈ నియమాల నేపథ్యంలో నుండి రచయిత్రి బంజారాల పూర్వచరిత్ర, వారి వలసలక్రమం, సంస్కృతి, ఆచార సంప్రదాయాలు, సాంస్కృతిక విషయాలు, అలంకరణ సామాగ్రి, ఆభరణాలు, వస్త్రవిశేషాలు, వాటి వ్యవహారనామాలు, అలంకరించుకునే పద్ధతుల్ని, అవి ఎక్కడెక్కడ దొరుకుతాయో, వాటిని కుట్టడం, అల్లికలోని నైపుణ్యాలు, కష్టాలన్నింటిని రచయిత్రి పూసగుచ్చినట్లుగా వర్ణిస్తారు.

**'బంజారా డ్రస్సుల్లో ఉన్నవారిని చూసిన కొందరు పిల్లలు దడుసుకుంటారని, కొందరికైతే జ్వరం పట్టుకుంటుందనే'** విషయాన్ని కూడా పట్టణ ప్రాంత పాత్ర ద్వారా తెలుపుతుంది. తమ వస్త్రధారణపై కొందరికి ఎటువంటి అభిప్రాయాలు, అనుభవాలు ఉంటాయో కూడా ఏమీ దాచిపెట్టుకోకుండా ప్రకటిస్తారు.

ఈ కథ ఈ విశేషాల వర్ణనతోనే ముగియదు. ఒకమంచి మలుపుతో ముగిస్తూ కథానుభూతికి లోపం జరగకుండా చూస్తారు. బంజారా వస్త్రాలు, అలంకరణ సామగ్రి, సాంస్కృతిక విషయాలు వ్యాపారాత్మకంగా కాకుండా వాటి సహజ అస్తిత్వాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా ఒక దిశానిర్దేశాన్ని చూపడం రచయిత్రి సంప్రదాయ నిబద్ధతకు నిదర్శనం.

**'అంబాలి'** కథలో రచయిత్రి అభ్యుదయాత్మక అభిప్రాయాలతో, అనూహ్య నిర్ణయాలతో విస్మయానికి గురిచేస్తారు. చిన్నవయసులోనే భర్తను కోల్పోయిన అంబాలికి బంజారాల ఆచారాల ప్రకారం భర్త తమ్ముడితో పెళ్ళి చేయడానికి నిర్ణయించుకుంటారు. అంబాలి ఈ పెళ్లిని వ్యతిరేకిస్తుంది. కులపెద్దలు, తండాలోని ఆడవాళ్ళు అందరూ ఒత్తిడి చేస్తారు. ఎప్పటినుండో వస్తున్న ఆచారాలు, కట్టుబాట్లు తప్పకూడదని బెదిరిస్తారు. బలవంతంగా పెళ్ళి చేసే ప్రయత్నం చేస్తారు. ఆ సమయంలో నగరంలో అధ్యాపకులుగా ఉద్యోగం చేస్తున్న అంబాలి దగ్గర బంధువు అరుణ వచ్చి ఈ వివాహాన్ని ఆపుతుంది.

**'ప్రతిజాతిలోనూ మంచి ఆచారాలుంటాయి. కొన్నికాలం చెల్లిన ఆచారాలుంటాయి. అటువంటిదే మరిదిని వివాహం చేసుకోవడ మనేది'** అని వాదిస్తుంది. పైగా అంబాలి వ్యక్తిత్వాన్ని గౌరవించాలంటుంది. ప్రపంచం అభివృద్ధి చెంది నాగరికతవైపు నడుస్తుంటే మనం ఇంకా ఇట్లాంటి అనాగరికతవైపు నడుస్తున్నామని తీవ్రంగా ప్రశ్నిస్తుంది. తండాల నియంతృత్వపు కట్టుబాట్లని తొలగిస్తూ అంబాలిని నగరానికి తీసుకొస్తుంది. రచయిత్రి పురోగమన ఆదర్శ దృక్పథాన్ని ప్రకటిస్తుంది ఈ కథ.


తమ ప్రాక్తన జాతి సాంస్కృతిక విశిష్టతను, సంప్రదాయాలను, నమ్మకాలను గౌరవిస్తూనే కాలదోషం పట్టిన మూఢాచారాలను ధిక్కరిస్తుంది. **'యాడికో ఉత్తరం', 'పారుబాయి'** కథల్లో కూడా ఈ దృక్పథ విస్తృతి మరింత ఔన్నత్యవంతంగా వ్యక్తమవుతుంది. సమకాలీన సమాజంలో బంజారా ప్రజలు, ముఖ్యంగా యువత ఏ దిశగా అడుగులు వేయాలో ఒక కార్యాచరణ ప్రణాళికకు సృజనాత్మక రూపంలో సందేశాన్ని అందించారు.

డా.సూర్య కటువైన అభిప్రాయాలను, నిర్ణయాలను ప్రకటిస్తూనే తమ కులపెద్దల మనసులు గెలుచుకునేలా నేర్పుగా పాత్రల చేత మాట్లాడిస్తారు. ఈ కథలన్ని స్త్రీలు కేంద్రీకృతంగా నడవడం చూస్తే రచయిత్రి వారికి ఇస్తున్న ప్రాధాన్యత విదితమవుతుంది. పురుషాధిపత్య నియమాలు, సంప్రదాయాలు పేరుతో వివక్షతకు గురవుతూ వేదన చెందుతున్న మహిళా తరానికి సాధికారత జీవనాన్ని అందించాలనే తపన అర్థమవుతుంది.


వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రపంచీకరణ విజృంభణలో తమ అస్తిత్వాలు కోల్పోకుండా ఏ విధంగా పరిణామ వికసనం చెందాలనే తపన ఈ కథల్లోని అంతసూత్రం. మరో కోణంలోంచి పరిశీలిస్తే సంధియుగ కాలంలో, సందిగ్ధదారుల్లో లైట్‌హౌజ్‌లాగా నిలబడి తమవారికి చెపుతున్న ఆత్మకథనాత్మక కథలుగానూ వీటిని భావించవచ్చు.

**'ఝోళి'** లోని ప్రతికథ వాస్తవిక జీవితాలను, అనుభవాలను ఆధారం చేసుకుని నిర్మాణాత్మకమైన భావజాల వ్యూహంతో నడుస్తుంది. సహజమైన సంభాషణలతో మాండలిక భాషా సౌందర్యాన్ని, యాసను మిళితం చేసుకుని పాత్రలు పక్కన కూర్చొని ముచ్చట్లు చెపుతున్నట్లుగా అనిపిస్తుంది. సమీపగతంలోని సంఘటనలు, చరిత్రతో పాటు సమకాలీన సామాజిక, రాజకీయ పరిణామాలను ఇతివృత్తంగా మలుచుకోవడంలో రచయిత్రి ఔచిత్య నైపుణ్యం ప్రశంసనీయం. నిరంతరం విద్యార్థులతో మమేకమైపోయిన వృత్తిగత ధర్మం, సహజ మాతృహృదయం ఈ కథల్లో కలగలసిపోయింది. అందుకే కొన్ని కథల్లో ప్రబోధాత్మక శైలి, అధ్యాపక స్పర్శ, నాయకత్వ ధోరణి వ్యక్త మవుతుంది.


ప్రకృతితో గాఢమైన అనుబంధం పెనవేసుకుపోయిన జీవనం లోంచి వచ్చిన కథలు కాబట్టి ఆ వాతావరణ వర్ణన, పరిసర ప్రాంత చిత్రణతో తాదాత్మ్యం చెందుతాం. జొన్నరొట్టెల్లో ఎల్లిపాయకారం అద్దుకుని తింటున్నట్లుగా ఉంటుంది. రాగిజావా తాగినంత అలవోకగా కథాసారం మనసులోకి జారిపోతుంది. లిపిలేని బంజారా భాషీయుల జీవన వ్యత్యాసాలను, అంతరంగ వైవిధ్యాలను నిమగ్న హృదయలేఖినితో లిఖించారు. సూర్యుడి తొలి కిరణాల్లో ఔషధ గుణాలున్నట్లే డా. సూర్యాధనంజయ్ తొలికథల్లోనూ బహుళార్థక చైతన్యశీలతను కలిగించే ఉత్తేజభావశక్తులు నిక్షిప్తమై ఉన్నాయి.




**ఉపాసన (నవల)**
కల్లూరు రాఘవేంద్రరావు
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత, నెం. 12, 5వ క్రాస్, 8వ మెయిన్, మోహన్ బిల్డింగ్స్, సప్తగిరి లే ఔట్, విద్యారణ్యపుర (పోస్ట్), బెంగుళూరు - 560097
ఫోన్ : 9493271620




**సూర్యోదయము**
అల్వాల లక్ష్మణ మూర్తి, వెల : 80 /-
**ప్రతులకు :** రచయిత, సుభాష్ నగర్, టీచర్స్ కాలనీ, ఇం.నె. 3-143/డి, కలువకుర్తి (పోస్టు, మండలం) నాగర్ కర్నూల్ (జిల్లా) - 509 324
ఫోన్ : 95504 67431



**మధురకవి శ్రీ మోత్కూరి మధుసూదనరావు గారి సాహితీ సంకలనము..**
వెల : 150 /-
**ప్రతులకు :** ప్లాట్ నెం. 301, శివసాయి అపార్ట్‌మెంట్, గోఖలే నగర్, రామంతాపూర్, హైదరాబాద్ - 500 013.
ఫోన్ : 040 - 27036061




**వివేచన-28 (100 సంవత్సరాల ప్రత్యేక సంచిక)**
సంపాదకులు : ఆచార్య సూర్యాధనంజయ్, అధ్యక్షులు, తెలుగుశాఖ, ఉ.వి.
వెల : 200/-
**ప్రతులకు :** తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ - 500 007.
ఫోన్ : 040 - 2768 2294



**శ్రీమత్పండరినాథ రామాయణము**
శ్రీ మోతుకూరి పండరినాథ మహాకవి ప్రణీతము
పుటలు : 777
**ప్రతులకు :** శ్రీ మోతుకూరి పండరినాథ మెమోరియల్ ట్రస్ట్ - 2020. అధ్యక్షులు : డా. మోతుకూరి మాణిక్య రావు.
ఫోన్ : 98666 97352

స్వాకృతి

## మూసీ పబ్లికేషన్స్ వారి పుస్తకములు

**వివరాలకు : మూసీ మాసపత్రిక, 3-4-245/1, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్ -27, ఫోన్ - 27560616**

1. భారతదేశ చరిత్ర - సంస్కృతి (17భాగాలు 4,5 మరియు 7 నుండి 21 వరకు) రూ. 175/- ఒక్కొక్క భాగానికి రూ. 2875 - 00
2. బ్రాహ్మణ రాజ్య సర్వస్వము రూ. 1200 - 00
3. నల్లగొండ జిల్లా కవులు - పండితులు రూ. 350 - 00
4. మల్యాల వంశ చరిత్ర - శాసనములు రూ. 100 - 00
5. శాసన సంపుటి రూ. 150 - 00
6. కందూరు చోడుల శాసనములు - చరిత్ర - సంస్కృతిరూ. 100 - 00
7. షబ్నవీస్ శతజయంతి సంచిక రూ. 100 - 00
8. విజయనగర శాసనములు - సాహిత్య సాంస్కృతిక విశేషములు 90 - 00
9. త్రిపురాంతక దేవాలయ శాసనములు రూ. 75 - 00
10. పులిజాల రంగారావు సంక్షిప్త జీవిత చరిత్ర రూ. 75 - 00
11. దేవాలయ వాస్తుశిల్పము రూ. 50 - 00
12. మూసీ ద్వైవార్షిక ప్రత్యేక సంచిక రూ. 50 - 00
13. మూసీ 'తెలుగు సంస్కృతి' ప్రత్యేక సంచిక రూ. 75 - 00
14. 'సుచరిత' (బి.ఎన్.శాస్త్రి సంస్మరణ) ప్రత్యేక సంచిక రూ. 100 -00
15. మూసీ 'మన తెలుగు' ప్రత్యేక సంచిక రూ. 100 - 00
16. ఆంధ్రదేశ శాసన సాహిత్యంలో స్త్రీలు రూ. 175 - 00

## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/**
**బికె-ఎల్.ఐ.జి.10, బతుకమ్మకుంట,**
**బాగ్అంబర్‌పేట, హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**

# ఎదురు చూపే....

నడిచిన బాటను కాలం గుర్తుల్ని
చూద్దామని వెనక్కి తిరిగి చూస్తే
విచిత్ర శూన్యం....!
కమిలిన నల్లని పాదాల
ఛాయలు తప్ప.....!
చిగురించిన ఆనవాలు కానరలేదు
జడివాన ఏ సాక్ష్యాన్ని మిగల్చనట్లే
నా జాడలని చేరిపి వేస్తుంది.

రేపోమాపో అనుకుంటూ దూరాలను
కొలమానం వేస్తూ...?
బరువెక్కుతున్న హృదయం తో
ఆశలు చెదిరిన పక్షిలాగా...!
నిరాశగా మబ్బుల వంక చూస్తూ
మెరిసే సంబరం కోసం
ఎప్పుడు ఎదురుచూపే.

భవిష్యత్తు బల్లెం పట్టి
కావలి కాసినట్లుంది....
కొన్ని అనుభవాలు ఒడిసిపట్టే లోపే
కాలం ఆలంతదూరంలో
నా తనువును విసిరేస్తుంది.
నా మనస్సులో ...?
ఉక్కిరిబిక్కిరైతున్న ఆలోచనలకు
స్థానస్థిరీకరణకు పూరుదు పొసే క్షణం కోసం ....?!
ఎప్పుడూ ఎదురుచూపే.

నా మెదడో బీడుపడ్డ నేలై
స్వేచ్ఛ నిర్ణయం లైని పంజరమై
వలస పోరాటంలో....?
అరవు జీవినై...!
జీవన ప్రయాణ జారుడు రాయి పై
జారిన తీపి గుర్తుల కోసం....!
ఎప్పుడూ ఎదురుచూపే.

**ముత్యంపేట గంగాధర్**
చరవాణి : 9704118352

# ఒమిక్రాన్

మాటు వేసి మృగము వేటాడువిధమున
వెంబడించె ప్రజల విషకరోన,
మరల దాడి జేయ మాయా యొమిక్రాను
వచ్చె వేగముగను బ్రతుకు దెంచ

కారు చీకట్లు నింగిని క్రమ్మినటుల
ముసిరి జలధులు తీరము ముంచి నటుల
వాయువు నలుదెసల చుట్టి వలిపినటుల
తరలి వచ్చె నిటకరోన దాడి జేయ

ఎప్పుడెవరిపై దాడికి నెగిసి పడునొ
యప్రమత్తమున మెలగుమలుసులేక
ముందు తెలిసియనుభవమునందుకొనుము
శాని టైజర్లు మాస్కులు శీఘ్ర గతిన

సైని కులుసరిహద్దులో శక్తి మేర
కృషిని సలిపిన విధమున కార్మికులును,
రక్షక భటులు, డాక్టర్లు రాత్రి పగలు
ప్రజల రక్షణ పూనిరి భయములేక

కప్పు కొన తొడుగులు కరములు నలిగిన
వెరువ కుండ జంపె విష కరోన
వెజ్జు సేవ జేయు ప్రేమతో రోగుల
దైవమని తలచుము ధరణికతడు

మాస్కుమూతికొకటి మరువక పెట్టుము
గంటకొక్కమారు కడుగు కరము
మనిషి మనిషి మధ్య మరువకు దూరము
యడుగు నిడక బయట ముడుగు మింట

**డా. గుడేలి శీనయ్య**
కొల్లాపూర్, చరవాణి : 995 996 4848

# ఫర్టీ 9 సంతాన సాఫల్యత కేంద్రం

**మీ మాతృత్వపు స్పర్శకు దూరం అయ్యారా?**

అందమైన చిన్ని చిన్ని అడుగులు..
బోసి బోసి నవ్వుల కేరింతలు...
ఒక పూజ్యమైన అలక, అలుపెరగని ఉల్లాసం..
మారం చేస్తూ, మైమరిపిస్తూ...
మీ ఆనందం అంభరాన్ని తాకాలా ?

సరోగసి, అసిస్టెడ్ హ్యాచింగ్,
ఎంబ్రియో &సెమెన్ ఫ్రీజింగ్,
స్త్రీలలో గర్భాశయ అండాశయ
లోపాల నివారణ-చికిత్స,
వెరికోసిల్, వీర్యకణాల లోపం,
ల్యాప్రోస్కోపిక్ విధానం ద్వారా
లోపాల నిర్ధారణ -సవరణ,
ఆధునిక వైద్యవిధానాలతో చికిత్స.

**7416 106 106**
www.ferty9.com

**మీరు తీసుకునే
ప్రతి నిర్ణయానికి
మా ప్రేమ, సేవ
అంకిత భావం మీకు
తోడుగా ఉంటుంది.**

**IUI | IVF | ICSI | IMSI | HSG**





**ఫర్టీ 9 హాస్పిటల్ మరియు పరిశోధన కేంద్రం**

మీ ఆశ, మీ స్వప్నం ఫలిస్తుంది ఫలప్రదంగా...

విజయ డయాగ్నస్టిక్స్ ఎదురుగా, సికింద్రాబాద్ మరియు నిజాంపేట్ క్రాస్ రోడ్, కూకట్‌పల్లి, హైదరాబాద్